ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ                సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 17 - సంచిక 02
**జులై 2012**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని, డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.


## జీవించే కళ

జీవించే కళలో ఉన్నది జీవితం. ఏదో విధంగా, మొరటుగా, మోటుగా, సభ్యతకు దూరంగా బ్రతుకు వెళ్ళదీస్తూ ఉండడం జీవితమే కాదు. అసలు జీవించే కళను తెలుసుకున్నవాడే నిజంగా జీవిస్తున్నవాడు. జీవితానికి అర్థం ఏమిటి? మనం ఎందుకు జన్మించాము? మనం ఏమి అవ్వాలని కోరుతున్నాము? జీవితానికి లక్ష్యం ఏమిటి? ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు పొందడంలోనే జీవన రహస్యం ఇమిడి ఉన్నది.

జీవితానికి గమ్యం ఏదో తెలియనప్పుడు దారి సరైనది ఎలా అవుతుంది? ఎక్కడికి చేరుకోవలసిన అవసరం లేనప్పుడు సంతృప్తి ఎలా లభిస్తుంది? ఒక తోటమాలి వద్ద బోలెడు పువ్వులు ఉన్నాయి. ఆ పూలతో మాల కట్టాలని అతడి కోరిక. కాని అతడి దగ్గర దారం లేదు వాటిని కలపడానికి, వాటిని గుది గ్రుచ్చడానికి. అతడు ఎన్నడూ తన పూలను మాలగా కట్టలేడు. ఆ తోటమాలి వంటివాడు జీవితానికి అర్థం ఏమిటో తెలుసుకోని వ్యక్తి.

జీవించే కళ తెలియని వ్యక్తికి జీవితంలో దిశ ఉండదు. అతడి అనుభవాలన్నీ విడివిడిగా, పొంతన లేనివిగా, పరస్పర సమన్వయం లేనివిగా, 'తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం' గా మిగిలిపోతాయి. జ్ఞాన రూపంలో వ్యక్తమయ్యే శక్తి ఆ అనుభవాల నుండి ఎన్నడూ లభించదు. జీవించే కళ తెలియని వ్యక్తి జీవితపు సమగ్ర అనుభవానికి దూరం అవుతాడు. ఆ సమగ్ర అనుభవం కొరవడినప్పుడు అతడు జీవించినా ఒకటే, మరణించినా ఒకటే.

అలాంటి వ్యక్తి జీవితం పువ్వులు పూసి పండ్లు అయ్యే అవకాశం ఎన్నడూ లేని మోడు వంటిది. అలాంటి వ్యక్తి సుఖ దుఃఖాలైతే అనుభవిస్తాడు కాని, ఎన్నడూ ఆనందాన్ని అనుభవించలేడు. ఎందుకంటే కళాత్మకంగా జీవించడం వల్ల, జీవితాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా, సర్వతోముఖంగా అనుభవించడం వల్ల ఆనందానుభూతి కలుగుతుంది. జీవితంలో ఆనందం పొందాలంటే జీవితాన్ని పూలమాలగా మలచుకోవాలి. జీవితంలోని అనుభవాలన్నింటిని లక్ష్యం అనే దారంతో కళాత్మకంగా గుదిగ్రుచ్చాలి. జీవించే ఈ కళను తెలుసుకోని వ్యక్తి జీవితం ఎన్నడూ సార్థకం కాదు. ఎన్నడూ కృతార్థం కాదు.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


ప్రతి సమస్యను విజ్ఞతతో పరిష్కరించుకునేందుకు కృషి చేయాలి.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** జీవించే కళ 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
విశ్వమాత ఆరాధన 2
3. **వేదమంత్రం :** జీవన సాఫల్యం 3
4. **గాయత్రీ విద్య-22 :** మనోమయ కోశం 4
5. **గాయత్రీ చిత్రావళి - 1 :** గాయత్రీ మహామంత్రం 7
6. **బాలల భవితకు బంగారు బాట-28 :**
నిరాశ నీడను ఇవ్వదు 8
7. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం) :** సత్సాహస-సంఘర్ష ప్రకరణం 9
8. **పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం : 77-86**
సద్భావనల వికాసానికి పథకాలు 10
9. **గురుపూర్ణిమ ప్రత్యేకం :** ప్రజాసేవకు తంత్ర విజ్ఞానం 12
10. **గూఢచర్యం వైదిక ఋషుల ఒక పరమ పావనమైన వరం** 14
11. **ఆదిశక్తి యొక్క లీలా కథలు-25 :**
గాయత్రీ సాధనతోపాటు సప్తశతి మంత్ర సాధన 17
12. **భూకంపాలు ఎందుకు, ఎప్పుడు వస్తాయి?** 20
13. **గురుదేవుల సుదీర్ఘయాత్ర** 23
14. **యువతకు ప్రత్యేకం :** ఐశ్వర్యం - 3 26
15. **వ్యక్తి వికాసం :** బుద్ధి సంపదగా ఎలా మారుతుంది? 30
16. **బోధ కథ :** మమకారం ఫలితంగా పురుగు జన్మ 33
17. **శరీర విజ్ఞానం :** మనిషి కోరుకుంటే తన ఆరవ ఇంద్రియాన్ని వికసింపచేసుకోవచ్చు 35
18. **పరమ వందనీయ మాతాజీ మాతృవాణి :**
గురువునే సర్వస్వంగా భావించుకోండి 37
19. **నా వారితో నా మాట :**
యువత బలమైన తుఫానువలె ముందుకు రావాలి 40
20. **ఆరోగ్యమే మహాభాగ్యం-20 :** హోమియో వైద్య సేవ 42
21. **సుభాషితాలలో సుధారస బిందువులు - 9** 43
22. **ఆషాఢ మాస ప్రాముఖ్యత** 45
23. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 46




# సద్గురు వచనామృతం

## విశ్వమాత ఆరాధన

బ్రహ్మ పదార్థం నిర్వికారమైనది; ఇంద్రియాలకు అతీతమైనది; బుద్ధికి అందనిది. దాన్ని నేరుగా చేరుకునే దారి లేదు. నామ జపం రూప ధ్యానం, ప్రార్థన, తపస్సు, సాధన, చింతన, శ్రవణం, కీర్తనం అన్నీ ఆధ్యాత్మిక ఉపకరణాలు మాత్రమే. ఆత్మ పరమాత్మల ఈ కలయికను సాధించే శక్తి గాయత్రియే. ఋషులు ఈమెనే ఉపాసించారు. ఎందుకంటే శక్తిలేనిదే ముక్తి లేదు. సరస్వతి, లక్ష్మి, కాళి, రాధ, సీత, సావిత్రి, పార్వతి మొదలైన దేవతలు కూడా గాయత్రి సాధనయే చేశారు. తల్లి ద్వారానే తండ్రితో సంబంధం కలుగుతుంది. అందువలన తండ్రి స్థాయి కన్నా తల్లి స్థాయి ఉన్నతమైనది. మానవ ప్రాణికి అపారమైన భగవదానంద రాశిని ఆస్వాదించే అదృష్టం గాయత్రీమాత ద్వారానే లభిస్తుంది.

బ్రహ్మ యొక్క ఇచ్ఛ గాయత్రి. బ్రహ్మ యొక్క శక్తి గాయత్రి. బ్రహ్మ యొక్క క్రియ గాయత్రి. ఆమె ద్వారానే జగత్తు యొక్క ఉత్పత్తి, అభివృద్ధి, నాశనముల ప్రణాళిక రూపొందుతుంది. సౌందర్యం, మాధుర్యం, సంపద, కీర్తి, ఆశ, ప్రసన్నత, కరుణ, మైత్రి మున్నగు రూపాలలో ఈ మహాశక్తియే జీవిత క్షేత్రాన్ని ఆనందమయం చేస్తూ ఉంటుంది. తరంగితం చేస్తూ ఉంటుంది. ఈ విశ్వనారిని, ఈ మహాగాయత్రిని, ఈ మహామాతను ఈ మహా విద్యను ఆరాధించి మనం అధికాధిక ఆనందాన్ని పొందటంలో పురోగమించవచ్చు. పరమానంద ప్రాప్తికి శాశ్వత మార్గం ఇదే.

*- అఖండజ్యోతి, సెప్టెంబర్, 1950*

*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**జులై 2012**

**03-07-2012 గురు పూర్ణిమ**

**27-07-2012 వరలక్ష్మీ వ్రతం**

**ఆగస్టు 2012**

**02-08-2012 జంధ్యాల పూర్ణిమ / రాఖీ పూర్ణిమ**

**15-08-2012 స్వాతంత్ర్య దినోత్సవం**

**సమస్యను ఇతరుల దృష్టికోణం నుండి చూడగలగాలి.**

వేద మంత్రం

# జీవన సాఫల్యం

**తేజోసి తేజో మయి దేహి । వీర్యమసి వీర్యమయి దేహి ।
బలమసి బలం మయి దేహి । ఓజోస్యో ఓజో మయి దేహి ।
మన్యురసి మన్యుం మయి దేహి ।
సహోసి సహోమయి దేహి ॥ (యజుర్వేద 19/9)**

**భావార్థం :** ఓ పరమేశ్వరా ! నీవు తేజస్వరూపుడవు. నాకు తేజస్సు ఇవ్వు. వీర్యవంతుడవు నాకు పరాక్రమాన్ని ఇవ్వు. నీవు బలవంతుడవు నాకు బలాన్ని ఇవ్వు. నీవు ఓజస్వి, నాకు ఓజస్సు ఇవ్వు. నీవు సహనశీలుడవు, నాకు కూడా అటువంటి సహనశీలత ఇవ్వు.

**సందేశం :** పరమేశ్వరుడని ఎవరిని అంటాము? ఆయనేమీ మనిషి కాదు. ఆయన్ని మనమే తయారుచేశాము. వాస్తవానికి ఆదర్శాల పేరు భగవానుడు. సిద్ధాంతాల, శ్రేష్ఠతల, సద్గుణాల, సత్ప్రయత్నాల సముచ్చయం పేరు భగవంతుడు. ఇక్కడ ఈశ్వరుని అనేక గుణాలలో మన జీవితానికి ఆవశ్యకమైన వాటిని అర్థిస్తూ ప్రార్థన చేయబడింది.

ఆత్మశక్తిని వికసింపజేసే, ప్రాపంచిక ప్రలోభాలను ఓడించే తేజస్సు అన్నింటికంటే మహత్వపూర్ణమైనది. తేజస్సు ఆయువులో కాదు ప్రవృత్తిలో ఉంటుంది. అది బాహ్యం కాదు, లోపల ఉంటుంది. పైకి కాక స్వభావంలో దాగి ఉంటుంది. దీనివలన ముఖ మండలం ప్రకాశవంతంగా ఉంటుంది. ఇంకొక ముఖ్యమైనది శారీరక బలం. మనం వంద సంవత్సరాలు జీవించి పరోపకారము చేయాలని భగవంతుడు ఈ శరీరం ఇచ్చాడు. మనం వీర్యవంతులం, బలవంతుల మైనప్పుడే అది సాధ్యం అవుతుంది. మనం తేజస్వులం, ఆరోగ్య వంతులం బలశాలురం కావాలి. సంయమము, తగిన ఆహార విహారములతోనే ఇది సంభవం అవుతుంది. ఈ మూడింటి వలన ఆత్మిక తేజస్సు జాగృతమవుతుంది. మనుష్యుడు ఓజస్వి అవుతాడు. తేజం, వీర్యం, బలం, ఓజస్సు నిండిన మనుష్యుడు ప్రపంచములో అన్నీ చేయగలుగుతాడు. పెద్ద పెద్ద కష్టాలు కూడా అతని మార్గాన్ని ఆటంక పరచలేవు. అతడు ఏది సంకల్పం చేసినా తప్పక పూర్తి అవుతుంది. అతడు ఏది చెప్పినా దాని ప్రభావం ఇతరుల మీద పడుతుంది. అతని మాటను తిరస్కరించగలిగే సాహసం ఎవరూ చేయలేరు.

కానీ ఇంత మాత్రంతో పని సాగదు. దుష్టులు, పాపకర్ములను ఓడించే శక్తి కూడా కావాలి. అన్యాయాన్ని విధ్వంసం చేసే స్వాభావిక అగ్ని మన లోపల నిరంతరం జ్వలిస్తూ ఉండాలి. దీనితోపాటు మన ఆత్మలో అనంత సహనశక్తి ఉండాలి. దీనితో మనం ఘోరాతి ఘోర కష్టాలలో కూడా ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండి, సత్యమార్గం నుండి చలించకుండా ఉండగలము. ఎంత సహించలేని విపత్తులు వచ్చినా ధైర్యంగా వాటిని ఎదుర్కొని సాఫల్య మార్గంలో పురోగమించగలము.

దీని పేరే జీవించే కళ. అప్పుడే మానవుడు మహనీయుడు కాగలుగుతాడు. ఎప్పుడు అతడు మహనీయుడు అవుతాడో తన కుటుంబాన్ని, సమాజాన్ని మహనీయులుగా చేయుట అతని ధర్మం అవుతుంది. వెలుగుతున్న దీపమే మరొక దీపాన్ని వెలిగించ గలుగుతుంది. ఆరిపోయిన దీపం మరొక ఆరిపోయిన దీపాన్ని ఎలా వెలిగించగలుగుతుంది? మానవుని కర్తవ్యం అతడు తేజస్వి, ఓజస్వి, వర్చస్వి అయి, ధైర్యవంతుడు, వీర్యవంతుడు, శక్తివంతుడు అయి ఇతరులను కూడా ఆ మార్గంలో నడిచేందుకు ప్రేరేపించాలి.

దీనిలోనే మానవ జీవన సాఫల్యమున్నది.

★★★

## శ్యాంప్రసాద్ ముఖర్జీ

*కొందరు పత్రికా విలేఖరులు శ్యాంప్రసాద్ ముఖర్జీని కలువవలసి ఉన్నది. స్టేషన్‌లో మూడవ తరగతి రైలు పెట్టె నుండి ఆయన దిగటం చూచి వారు ఆశ్చర్యంతో మూడవ తరగతి రైలు ప్రయాణం చేయడం మీకు బహుశా జీవితంలో మొదటిసారి కావచ్చునని ఆశ్చర్యంతో అంటారు. ముఖర్జీ కాదని తలను అడ్డంగా త్రిప్పుతూ మనం చాలా పేద స్థితిలో ఉన్నాం. ఇలా ఆదాచేసిన డబ్బు మరో ముఖ్యమైన పనికి ఉపయోగపడుతుంది, అందుకే నేను ఎప్పుడు 3వ తరగతి టిక్కెట్టుపైనే ప్రయాణం చేస్తానని తెలియజేశారు. లోకసేవకుల ఆదర్శం, అసలైన మర్మం ఇలాంటి చిన్న చిన్న సంఘటనలోనే కనిపిస్తుంది. జనులే జనార్దనుడని భావించేవారు, సేవ చేయవలసిన ప్రజాసేవకులు ప్రజల కంటే ఎక్కువ సదుపాయాలు, సుఖాలు అనుభవిస్తూ తాము ప్రజల కంటే గొప్పవారమని భావిస్తే ఎలా?*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఇచ్చి పుచ్చుకునే రీతులలో ఉదారంగా వ్యవహరించాలి.**



## గాయత్రీ విద్య-22

# మనోమయ కోశం

పంచకోశములలో మూడవది మనోమయకోశం. దీనినే గాయత్రి యొక్క తృతీయ ముఖం అని కూడా అంటారు. మనస్సు చాలా చంచలమైనది. వాసనామయమైనది. ఇది సుఖప్రాప్తి కొరకు అనేక కల్పనలు చేస్తుంది. ఇది రంగు రంగుల చిత్రాలను కల్పన చేస్తుంటే వీటిని చూసి బుద్ధి భ్రమించి అనేక అనవసరమైన హాని కలిగించే పనులు చేసి తరువాత పశ్చాత్తాపపడవలసి వస్తుంది. మంచి పనులు, ప్రశంసలు పొందగలిగే పనులు, కల్పనలు కూడా మనస్సు చేయగలదు. **మనిషిని నరకప్రాయమైన పతనావస్థలో పడవేసినా లేక మనిషిని భూసురినిగా చేసినా అది మనస్సు యొక్క క్రీడ మాత్రమే.**

**మనస్సుకు ప్రచండమైన శక్తి ఉన్నది.** ఈ ప్రేరక శక్తితో తన కల్పనా చిత్రాలను ఎంతగా సజీవం చేస్తుందంటే మనిషి చిన్న పిల్లవానివలె దానిని పొందటానికి పరుగెడతాడు. సీతాకోక చిలుకలు ఎగురుతూ పోతుంటే వాటి వెంట చిన్న పిల్లలు పరుగెత్తుతుంటారు. ఇదేవిధంగా సీతాకోక చిలుకల వంటి కల్పనలు, కోరికలు, ఆకాంక్షలు, తృష్ణల వెంట శరీరం పరుగెడుతుంది.

సుఖం మీద కాంక్షయే మనస్సులో, అంతరాళాలలో ప్రధానంగా పనిచేస్తుంది. అది ఏ విషయాన్ని ఏ విధంగా ప్రాప్తించుకోవాలో కల్పన చేస్తుంది, ఒక సుందరమైన మనోహరమైన రంగురంగుల ప్రణాళికను తయారు చేస్తుంది. మస్తిష్కం దాని వెంట పడుతుంది. శరీరం ఆ దిశలోనే పనిచేస్తుంది. కాని మనస్సు చంచలమైనది. అది క్రొత్త కల్పనలు చేస్తూనే ఉంటుంది. నిన్నటి ప్రణాళిక పూర్తికాకుండానే ఇంకొక క్రొత్త ప్రణాళిక ముందుకొస్తుంది. మనిషి మొదటిదాన్ని వదిలివేసి క్రొత్తదాన్ని పట్టుకుంటాడు. ఇంక ఇదే విధంగా నడుస్తుంటుంది. అనేక అసంపూర్ణ ప్రణాళికలు వదిలివేసి క్రొత్త ప్రణాళికలు తయారవుతుంటాయి. నియంత్రణ లేని మనస్సు యొక్క కార్యక్రమాలు ఇలానే ఉంటాయి. అది మృగతృష్ణలో మనిషిని త్రిప్పుతుంది. లెక్కలేనన్ని అసఫలతల, పూర్తికాని కార్యక్రమాల వలన జీవనం అస్థవ్యస్థం అవుతుంది.

వర్తమాన యుగంలో ఈ దోషం చాలా ఎక్కువయింది. మనిషి భౌతికత వెనుక పిచ్చిగా పరుగెత్తుతున్నాడు. ఆత్మకల్యాణం అనే మాటను వదలివేసి, కృత్రిమ సుఖ సౌకర్యాల కొరకు ఉవ్విళ్ళూరు తుంటాడు. ఎవరి దగ్గర ఈ సుఖ సాధనాలు ఎంత ఎక్కువగా ఉంటే అంత భాగ్యవంతుడిగా భావిస్తున్నారు. ఎవరి దగ్గర ఈ సుఖసాధనములు లేవో వారు తమను తాము అభాగ్యులుగా, దీనులుగా, హీనులుగా తలుస్తుంటారు. వారి మనస్సు ఘోరమైన ఉద్విగ్నతకు లోనవుతుంది. తీరని కోరికల వలన మనస్సుకు శాంతి లభించదు. "మనస్సే మనిషికి శత్రువు. మనస్సే మనిషికి మిత్రుడు, బంధనానికి మోక్షానికి కారణం కూడా మనస్సేనని గీతలో చెప్పబడింది. **వశంలో ఉన్న మనస్సు అమృతంతో సమానం. నియంత్రణ లేని మనస్సు హాలాహలం వంటిది.** నియంత్రణ లేని మనస్సు ఇంద్రియ భోగాలలో సుఖాన్ని వెతుక్కుంటూ పరిగెత్తుతుంది.

నాలుకతో రకరకాల రుచులను పొందడానికి దానిని సతాయిస్తుంటుంది. రూప యౌవ్వనాల క్షేత్రంలో కామ కలాపాలకు ఇంద్రలోకాన్ని కల్పనా జగత్తులో తయారు చేస్తుంది. నృత్యం, గీతం, వాద్యములు మనోరంజనం, షికార్లు, మనోహర దృశ్యములు దానికి ఆనందదాయకం. వీలయినంత సమయం వీటిలో గడపాలని కోరుకుంటుంది. సర్కస్, సినిమా, క్లబ్, ఆటలు మొదలైన మనోరంజకమైనవి దానికి ఇష్టం. శరీరాన్ని అలంకరించడానికి, విశ్రాంతి ఇవ్వడానికి బహుమూల్య వస్త్రాభరణములు, ఉపచారములు, కార్లలో విమానాలలో ప్రయాణం, మెత్తని పరుపు, ఫ్యాన్, ఎసి మొదలైనవి చాలా అవసరమైనవిగా భావిస్తుంది.

**సంస్కార విహీనమైన మనస్సు ఇంద్రియ భోగాలు, అహంకార తృప్తి (Satisfaction of ego), ధనం కూడబెట్టడం అనే మూడు క్షేత్రములలోనే సుఖాన్ని వెతుక్కుంటుంది.** దానిపై అంకుశం లేకపోవడం వలన ఉచితానుచితాలు పట్టించుకోక జీవిత విధానాన్ని చెడుమార్గంలోనికి తీసుకువెళ్తుంది. పాశవికమైన కోర్కెలు తీరడానికి ప్రణాళికలు వెయ్యడం, తరువాత చిక్కుల్లో పడడం, బాధలు పడటం నియంత్రణ లేని మనస్సు కలవారికి సంభవిస్తాయి. వీరి జీవితం కష్టాలలో మునిగి, పాపం, దుర్గతి కాక మరేమౌతుంది?

మనస్సును వశంలో ఉంచుకొనడమంటే అది బుద్ధి యొక్క నియంత్రణలోకి రావాలి. బుద్ధి ఏది ఔచిత్యమని తలస్తుందో,

**తెలుసుకోవలసినదేది లేదు అనే భ్రాంతి మానసిక కాలుష్యం కలిగిస్తుంది.**

ఆత్మహితంగా లాభాలను నష్టాలను బేరీజు వేస్తుందో దానికి తగిన విధంగా కల్పనలు చేయడం, ప్రణాళికలు వెయ్యడం చేసే మనస్సు వశంలోనికి వచ్చినట్లే. అనుక్షణం అనవసరమైన పరుగులు పెట్టడం, ఉపయోగంలేని జ్ఞాపకాలలో కల్పనలలో మునగడం నియంత్రణలేని మనస్సు యొక్క లక్షణం. **వశంలో ఉన్న మనస్సు ఒక పని మీద నిమగ్నమయితే ఇక అటు ఇటు పోదు.**

**మనస్సు యొక్క ఏకాగ్రతలో, తన్మయత్వంలో ఎంత ప్రపందశక్తి ఉందంటే అలాంటి శక్తి ప్రపంచంలో ఇంకొకటి లేదు.** రచయితలు, కవులు, వైజ్ఞానికులు, అన్వేషకులు, నేతలు, మహాపురుషులు అందరూ ఏకాగ్రతతోనే అంతవారయ్యారు.

సూర్య కిరణములు వెదజల్లబడి ఉంటే వాటి ఉపయోగం గొప్పగా ఉండదు. కాని భూతద్దం ద్వారా ఆ కిరణములను ఏకత్రితం చేసినప్పుడు అక్కడ అగ్ని పుడుతుంది. ఆ జ్వలిస్తున్న అగ్నితో భయంకర దావానలం పుట్టవచ్చు. **చెల్లాచెదరయిన సూర్య కిరణముల కేంద్రీకరణ దావానలంగా మారినట్లు మనస్సు యొక్క చిందరవందరగా పడిఉన్న కల్పనలు, ఆకాంక్షలు, ప్రేరణ శక్తి కూడా ఒక బిందువుపై ఏకాగ్రం (concentrate) చేయగలిగితే దాని ఫలితాలు ఊహకు కూడా అందవు.**

పతంజలి ఋషి యోగ సూత్రములలో యోగమంటే చిత్తవృత్తుల నిరోధమేనని అంటారు. **"యోగః చిత్త వృత్తి నిరోధః"** అంటే చిత్త వృత్తులను నిరోధించాలి. చిత్తవృత్తులను ఆపివేసి ఏకాగ్రం చేయడమే యోగం. యోగసాధన యొక్క విశాలమైన కర్మకాండ అంతా చిత్తవృత్తులను ఒక బిందువుపై కేంద్రీకరించుట కొరకే, ఆత్మ యొక్క ఆదేశానుసారం జీవించుట కొరకే. ఈ పనిలో సఫలత లభించగానే ఆత్మ పరమాత్మతో కూడిన సమస్త రిద్ధి సిద్ధులు లభిస్తాయి. వశంలో ఉన్నటువంటి శక్తివంతమైన మనస్సు ఎటువైపు ప్రయోగిస్తే అక్కడ ఆశ్చర్యకరమైన చమత్కారాలు జరుగుతాయి. వశంలో ఉన్న మనస్సును ప్రయోగించడం వల్ల ప్రతిభ, యశస్సు, విద్య, ఆరోగ్యం, భోగం, అన్వేషణ మొదలైన వాటిలో ఏది పొందగోరినా నిశ్చయంగా పొందగలరు. దానిని ఏ శక్తి అడ్డుకొనలేదు.

ప్రాపంచిక కోరికలే కాక పారమార్థిక ఆకాంక్షలు కూడా నెరవేరుతాయి. సమాధి సుఖం కూడా మనోబలం యొక్క ఒక చమత్కారమే. **ఏకాగ్రమైన మనస్సుతో చేసిన ఉపాసనతో ఇష్టదైవం యొక్క సింహాసనం కదులుతుంది.** గజేంద్రుని కొరకు గరుత్మంతుడిని వదలి ఒట్టి కాళ్ళతో పరుగెత్తిన భగవంతునివలె పరుగెత్తవలసి వస్తుంది. అస్పష్టమైన మనస్సుతో చేసిన సాధన అస్పష్టంగానే ఉంటుంది. ఏకాగ్రమైన మనస్సు, వశంలో ఉన్న మనస్సు ఆ లాభాన్ని క్షణంలో సంపాదిస్తుంది. యోగులకు ఇటువంటి మనస్సు జన్మజన్మాంతరాల తపస్సు వల్ల లభ్యమవుతుంది. సదన్ కసాయి, గణిక, గీధ, అజామీళుడు మొదలైన దుష్కర్మలు చేసిన పాపులు ఆ క్షణంలో చేసిన ఆర్తనాదంతో తరించారు.

మెస్మరిజం, హిప్నోటిజం, పర్సనల్ మేగ్నటిజమ్, మెంటల్ థెరపి, అకల్ట్ సైన్స్, మెంటల్ హీలింగ్ మొదలైన చమత్కారములు పాశ్చాత్య దేశాలలో ప్రసిద్ధి చెందినవి. తంత్ర క్రియ, మంత్ర క్రియ, ప్రాణ వినిమయం, సవారి విద్య, ఛాయా పురుష్, పిశాచ సిద్ధి, శవసాధన మొదలైన చమత్కార శక్తులు భారతీయులకు పరిచయమే. ఇవన్నీ ఏకాగ్రతతో కూడిన మనస్సు యొక్క సంకల్పశక్తి యొక్క చిన్న చిన్న మనో వినోదములే.

సంకల్పం యొక్క అపూర్వశక్తితో మన పూజనీయ పూర్వీకులు తమ ఆధ్యాత్మిక గుణముల వల్ల సమస్త భూమండలంపై చక్రవర్తి సామ్రాజ్యాన్ని స్థాపించారు. వారు జగద్గురువులుగా కీర్తి పొందారు. వారు సంకల్పశక్తితో భూలోకమును స్వర్గలోకంతోను, పాతాళ లోకంతోను ఇరుగుపొరుగు వారివలె సంబంధం పెట్టుకున్నారు. ఆ శక్తి యొక్క చిన్న చిన్న భౌతిక చమత్కారాలతో రావణుని వంటి వ్యక్తులు గందరగోళం చేసినా అధికాంశ యోగులు ఆ ప్రచండ శక్తిని లోక కళ్యాణం కొరకు వినియోగించారు.

అర్జునునికి వశంలో ఉన్న మనస్సు వల్ల ఎటువంటి సిద్ధులు కలుగుతాయో తెలుసు. అందువల్ల గీతలో భగవంతుడిని అడుగుతాడు – హే అచ్యుతా! **మనస్సును వశంలో ఉంచుకునే పద్ధతిని నాకు చెప్పండి. వాయువును వశంలో ఉంచుకొనుట ఎంత కష్టమో మనస్సును వశంలో ఉంచుకొనుట కూడా అంత కష్టం. వశంలో ఉంచుకున్న మనస్సు భూలోకంలో కల్పవృక్షమే. అటువంటి దానిని పొందడం చాలా కష్టమే అయి ఉండాలి".** అర్జునుడు సరిగ్గానే చెప్పాడు. మనస్సును వశంలో ఉంచుకొనడం వాయువుని వశంలో ఉంచుకొనడంతో సమానమే. వాయువును యంత్రం ద్వారా ఒక డబ్బాలో బంధించవచ్చు. కాని మనస్సును వశంలో ఉంచుకొనే యంత్రం ఏది లేదు.

**మనస్సును వశంలో ఉంచుకునేందుకు భగవంతుడు అర్జునుడికి రెండు ఉపాయాలు చెప్పాడు. 1) అభ్యాసం 2) వైర్యాగం. అభ్యాసం అంటే మనస్సును నిలువరించగలిగే యోగ సాధనలు. వైరాగ్యం అంటే వ్యావహారిక జీవనంతో సంయమశీలత పాటించడం, జీవితాన్ని వ్యవస్థితం చేయడం.** బద్ధకం, పొరపాట్లు దుర్వ్యసనములు, దురాచారములు, చంచలత్వం సమయ దురుపయోగం, అస్తవ్యస్తంగా పనులు చేయడం మొదలైన

**సమస్యను భిన్న కోణాల నుండి పరిశీలించే ఓర్పు, నేర్పు సంతరించుకోవాలి.**

కారణాల వల్ల ప్రాపంచిక జీవనంలో అధోగతి కలుగుతుంది. లోభం, క్రోధం, తృష్ణ మొదలైన వాటితో మానసిక పతనం జరుగుతుంది.

**శారీరిక, మానసిక, సామాజిక చెడుల నుంచి మనస్సును రక్షించుకుని సరళంగా ఆదర్శవాదంతో శాంతిమయ జీవనం సాధించే కళను వైరాగ్యం అంటారు.** చాలా మంది ఇంటి బాధ్యతలను వదలివేసి అడుక్కుని తినడం, విచిత్రమైన వేషాలు వెయ్యడం, అవ్యవస్థితంగా తిరగడం వైరాగ్యమని భావిస్తారు. తరువాత కష్టాల పాలవుతారు. **వైరాగ్యం అంటే రాగముల నివృత్తి.**

చెడు భావనల నుండి, చెడు అలవాట్ల నుండి తప్పించుకునే అభ్యాసం కొరకు తగిన వాతావరణం అవసరం. ఈదడానికి తగిన వసతి కావాలి. ఈదడం నేర్చుకుంటే నీటిలో మునిగిపోయే ప్రమాదము ఉన్నప్పుడు రక్షించుకోవడానికి పనికి వస్తుంది. నీటికి దూరంగా ఉండి ఈత నేర్చుకుంటానంటే కుదరదు. అలాగే **రాగద్వేషాలు ఉత్పన్నమయ్యే పరిస్థితులలోనే ఉంటూ వాటిపై విజయం ప్రాప్తించుకుంటే వైరాగ్యంలో సఫలీకృతం అయినట్లే.**

అడవులలో ఒంటరిగా ఉంటే అది వైరాగ్యం అని అనిపించు కోదు. ఎందుకంటే అడవులలో వైరాగ్యం అవసరమే లేదు. రాగం ఉత్పన్నమయ్యే పరిస్థితులలో ఉంటూనే వాటిపై విజయం ప్రాప్తించుకుంటే, ఆ పరీక్షలో విజయం సాధిస్తేనే వైరాగ్యం ఉన్నట్లు అవుతుంది. ఏకాంతంగా ఉంటే అది వైరాగ్యమనిపించుకోదు. **ప్రలోభాల నుండి నెగ్గడమే వైరాగ్యం. చెడు ఉన్నచోటే చెడుపై నెగ్గడం వైరాగ్యమనిపించుకుంటుంది. అందువల్ల గృహస్తుడుగా ఉంటూ, ప్రాపంచిక జీవనంలో సువ్యవస్థితంగా ఉంటూ, రాగాల మీద విజయం ప్రాప్తించుకొనడమే వైరాగ్యం అని అనాలి.**

అభ్యాసం కొరకు యోగశాస్త్రములలో ఇటువంటి ఎన్నో రకాల సాధనల వర్ణన ఉన్నది. వీటి ద్వారా మనస్సు యొక్క చాంచల్యత, ఉరుకులు, పరుగులు, అత్యాశ ఆపివేసి ఋతుంభరా బుద్ధికి, అంతరాత్మ ఆధీనానికి మనస్సును అందివ్వవచ్చు. ఈ సాధనలను మనోలయ యోగమంటారు. దీనిలో 1) ధ్యానం 2) త్రాటకం 3) జపం 4) తన్మాత్ర సాధన ప్రధానమైవి. మనోమయకోశ సాధనలలో ఈ నాలుగింటికి మహత్వపూర్ణమైన స్థానం ఉన్నది.

★★★

## ఆధ్యాత్మిక చికిత్స

*ఋగ్వేదం దశమ మండలంలోని రోగనివారణ సూక్తం అయిదవ మంత్రంలో ఋషి, అంతఃచేతనలో మారుమ్రోగిన మహా సంకల్పం ఇదే. నవయుగం కోసం కొత్త సృష్టి చేసిన బ్రహ్మర్షి విశ్వామిత్రుడు ఆ క్షణాలలో చింతనలో నిమగ్నులై ఉన్నారు. అప్పుడు ఆర్తితో నిండిన, కరుణ కలిగించే ఒక స్వరం వినిపించింది. దుఃఖంలో మునిగి ఉన్న ఒక స్త్రీ చేసిన ఆర్తనాదం అది. ఆయన శిష్యుడు జాబాలి ఆమెను తీసుకువస్తున్నాడు. యౌవ్వనంలోనే రోగాలు ఆమెను వృద్ధురాలుగా చేశాయి.*

*ఆమె సమీపించగానే, బ్రహ్మజ్ఞాని అయిన మహర్షి ఆమె బాధలకు మూల కారణాన్ని గ్రహించారు. ఆయన జాబాలితో ఇలా అన్నారు "నాయనా! చికిత్స ప్రక్రియలు, ఔషధాలు ఈమె మీద పనిచేయలేదని చెప్పాలనుకుంటున్నావు కదా". "అవును ఆచార్యవర్యా" అంటూ శిష్యుడు ఏదో చెప్పబోయే లోగానే ఋషి ఇలా అన్నారు "నాయనా! ఇంకా ఒక చికిత్సా విధానం మిగిలి ఉంది. అది ఆధ్యాత్మిక చికిత్స. నేను నీ ఎదుట ఆ చికిత్స చేస్తాను."*

*తన గురువుగారికి అనంతమైన ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని శిష్యుడు జాబాలికి తెలుసు. కనుక అతడు మౌనం వహించాడు. అయినా అతడిలో జిజ్ఞాస ఉంది. ఆ జిజ్ఞాసను తృప్తిపరుస్తూ అంతర్యామి అయిన బ్రహ్మర్షి ఇలా అన్నారు. "నాయనా జాబాలీ! చికిత్స సఫలం కావాలంటే జీవితాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడం అవసరం. మనిషి శరీరం మాత్రమే కాదు. ఇంద్రియాలు, ప్రాణం, మనస్సు, చిత్తం, బుద్ధి, అహం, అంతరాత్మల అదృశ్యశక్తులు కూడా మనిషిలో ఉన్నాయి. చికిత్స చేయడానికై ఆ శక్తులన్నింటి పరిజ్ఞానం అవసరం అవుతుంది."*

*ఇలా చెప్తూ మహర్షి ఆ రోగిని తన ముందు కూర్చోబెట్టారు. తన మహా తపస్సులోని ఒక అంశను దానం ఇవ్వాలని సంకల్పం చేస్తూ ఇలా చెప్పారు. "ఆ త్యాగమం శంతాతిభిరథో అరిష్టతాతతిభిః ।" అనగా శాంతిని వ్యాపింపజేసేది, నాశనం లేనిది అయిన ప్రచండమైన బలాన్ని నింపుతున్నాను. నీ రోగాన్ని పారద్రోలుతున్నాను.*

*మహర్షి ఈ సంకల్పం చేయగానే, ఆ స్త్రీ రోగం నయమయింది. ఆమెకు ఆరోగ్యం చేకూరింది. ఈ సంఘటనతో ఆధ్యాత్మిక చికిత్స సంప్రదాయం ప్రారంభమయింది.*

**మానసిక కాలుష్యం విచక్షణా జ్ఞానాన్ని క్షీణింపచేస్తుంది.**

గాయత్రీ చిత్రావళి - 1

# గాయత్రీ మహామంత్రం

గాయత్రీ మంత్రములోని అక్షరముల పరస్పర కూర్పు, స్వర విజ్ఞానము శబ్ద శాస్త్రములలోని రహస్యములపై ఆధారపడి, దాని ఉచ్చారణ మాత్రముతో సూక్ష్మ శరీరములో దాగిన అనేక శక్తి కేంద్రములు తమంతట తాము జాగృతమవుతాయి. సూక్ష్మ శరీరములోని అంగ ప్రత్యంగములో అనేక చక్రములు, ఉప చక్రములు, గ్రంథులు, మాతృకలు, ఉపత్యికలు, భ్రమరములు, మేరువు, మొదలైన గుప్త సంస్థానములు ఏవి ఉన్నాయో వాటి వికాసముతో సాధారణ మనుష్య ప్రాణి అనంత శక్తులకు యజమాని కాగలుగుతాడు.

గాయత్రీ మంత్ర ఉచ్చారణ ఏ క్రమంలో జరుగుతుందో దానితో జిహ్వా, దంతములు, కంఠము, తాలువు, పెదవులు, నుదురు, మొదలైన వాటిలో ఒక విశేష గుప్త స్పందన ఏర్పడి అది విభిన్న శక్తి కేంద్రములను చేరి, వాటి సుషుప్తిని తొలగించి చైతన్యాన్ని కలిగిస్తుంది. ఈ విధముగా ఏ కార్యమును యోగులు ఎంతో కష్టదాయక సాధనలతో, తపస్సుతో, అధిక కాలములో పూర్తిచేస్తారో, అటువంటి మహాకార్యము ఎంతో సరళరీతిలో గాయత్రీ మంత్ర జపముతో స్వల్ప సమయంలోనే పూర్తి అవుతుంది.

సాధకునికి, ఈశ్వర సత్తాయైన గాయత్రికి మధ్య ఎంతో దూరము ఉన్నది. ఈ అంతరము దాటే మార్గము ఈ 24 అక్షరముల మంత్రముతో సాధ్యం అవుతుంది. ఎలాగైతే నేల మీద ఉన్న మనుష్యుడు మెట్ల సహాయముతో ఎత్తైన మేడపైకి చేరుకుంటాడో అదే విధముగా గాయత్రీ ఉపాసకుడు ఈ 24 అక్షరముల సహాయముతో క్రమంగా ఒక్కొక్క భూమిక దాటుకుంటూ పైకి చేరుకొని తల్లికి దగ్గరవుతాడు.

*గాయత్రి మహిమ అపారము. అది భూలోకపు కామధేనువు. తల్లికృపతో తొలగించబడని కష్టమంటూ లేదు. ఆమె అనుగ్రహముతో ప్రాప్తించని వస్తువంటూ లేదు. మేము గడచిన 24 సం॥లో షుమారు 2000 ఆర్షధర్మ గ్రంథములు శోధించి, సాధనా క్షేత్రములో గాయత్రిని మించిన శక్తి మరొకటి లేదని తెలుసుకున్నాము. ఈమెయే నాలుగు వేదములకు జనని. ఇదియే భారతీయ సంస్కృతి యొక్క సమస్త జ్ఞానవిజ్ఞానములకు పునాది. ఈ జ్ఞాన గంగలో స్నానము చేసే వారి ఆత్మయొక్క సమస్త పాపములు నశిస్తాయి.*

*మేము ఒక్కొక్కటి ఇరువది నాలుగు లక్షల చొప్పున, 24 మహాపురఃశ్చరణలు పూర్తిచేశాము. ఈ తపశ్చర్య వలన మా వ్యక్తిగత అనుభవముతో, ప్రపంచములోని సమస్త సంపదల కంటే గాయత్రీ ఉపాసన అధిక విలువైనదని చెప్పగలము. ఏ వ్యక్తులు మా సంరక్షణ, సహకారము, పరామర్శతో మాతను ఆరాధించారో వారి పరిణామాలు చూడగా, ఎప్పుడైనా ఎవరికైనా గాయత్రీ సాధన నిష్ఫలం కాదని మాకు దృధ విశ్వాసం కలిగింది. ఈ యుగంలో ఇంతకు మించి ఫలదాయకము, సరళము, స్వల్పశ్రమతోనే సాధించదగినది, హానిరహితమైన సాధన మరొకటి లేదు.*

*అత్యంత మహిమ కలిగిన, సర్వశక్తి శాలియైన గాయత్రీ మాత గొప్పదనము తెలుపుటకు, సాధకుల ధ్యానమునకు ఉపయోగపడుటకు ఈ వ్యాసములను అందజేస్తున్నాము. దీనితో గాయత్రీ ఉపాసన చేయువారికి ప్రేరణ, సౌకర్యము కలుగునని మేము ఆశించుచున్నాము. ఏ ప్రయోజనము కొరకు మాత యొక్క ఏ స్వరూపము, ఏ వర్ణము, ఏ ఆకృతి, ఏ ముద్ర, ఏ వాహనము, ఏ స్థానములో ఏ విధముగా ధ్యానము చేయవలెనో మొదలైన రహస్యములన్నీ ఈ చిత్రముల ద్వారా తేటతెల్లమగును.*

*ప్రతి చిత్రముతో దానికి సంబంధించిన, ఆవశ్యకమైన సమాచారము నిచ్చు చిత్ర పరిచయము కూడా ఇవ్వబడినది. దీనివలన పాఠకులకు అధిక సౌకర్యము కలుగును. సాధనా సమయములో ఈ చిత్రముల ధ్యానము కూడా చేసుకొనవచ్చును.*

*– పండిత శ్రీరామశర్మ ఆచార్య*

గాయత్రిలోని ఒక్కొక్క అక్షరము ఒక్కొక్క ధర్మ శాస్త్రము. ఈ అక్షరముల వాఖ్యానంగా బ్రహ్మ నాలుగు వేదముల రచన చేయగా, వాటి అర్థము తెలియజేయుటకు ఋషులు ఇతర ధర్మ గ్రంథాలు రూపొందించారు. ప్రపంచములో ఏ జ్ఞాన విజ్ఞానములు ఉన్నవో అవి బీజ రూపంలో ఈ 24 అక్షరాలలో దాగి ఉన్నవి. ఒక్కొక్క అక్షరము యొక్క అర్థము, రహస్యము ఎంత వ్యాపక మంటే దాని ఒక్కొక్క అక్షరమును ఒక్కొక్క జీవితంలో తెలుసుకున్నా త్వరగా తెలుసుకున్నట్లే. ఈ 24 అక్షరములలోని తత్వ జ్ఞానము తెలుసు కున్న వారికి ఈ ప్రపంచము లోని ఇక తెలియ వలసిందంటూ ఉండదు.

గాయత్రి అన్నింటికంటే గొప్ప మంత్రము. దీనికి మించినది మరొకటి లేదు. మరే మంత్రముతో కాని ఏదైనా కూడా దీనితో తప్పక అవుతుంది. దీనితో వేదోక్త దక్షిణ మార్గము, తంత్రోక్త వామ మార్గము రెండు విధాలైన సాధన కూడా చేయవచ్చు.

– అనువాదం : డా॥ తుమ్మూరి

**(చిత్రం లోపలి కవర్‌పేజిలో చూడగలరు)**

**ప్రతి ఒక్కరికి తమ హక్కుల గురించి, బాధ్యతల గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి.**

బాలల భవితకు బంగారు బాట-28

# నిరాశ నీడను ఇవ్వదు



సర్వానంద స్వామి తన శిష్యుడైన సుముఖునితో కలసి సముద్రం ఒడ్డున నడుస్తూ ఉన్నారు. ఎప్పుడూ గలగల్లాడుతూ ప్రశ్నలు వేసే సుముఖుడు చాలా నిరుత్సాహంగా కనిపించాడు. ఏమీ మాట్లాడకుండా నీరసంగా నడుస్తున్నాడు. గురుదేవులు ప్రశ్నిస్తే "అవును-కాదు" అంటూ ముక్తసరిగా సమాధానాలు ఇస్తూ ఉన్నాడు.

గురువుగారు ఆప్యాయంగా వెన్ను నిమురుతూ "సుముఖా! ఏమిటి సంగతి? ఇలా పిచ్చివాడిలా తయారయ్యావు ఎందుకు? దీనమైన ఆ చూపులేంటి?" అంటూ రకరకాలుగా ప్రశ్నించాడు. సముఖుడు మెల్లగా తలఎత్తి గురువుగారి వంక చూశాడు. ఆతని కళ్ళలో కన్నీళ్ళు. "ఆ కళ్ళల్లో నీళ్ళేంటి? నీకిప్పుడు వచ్చిన కష్టం ఏమిటి? నాకు కాకపోతే ఇంకా ఎవరికి చెప్తావు?" అని బుజ్జగిస్తూ అడిగారు.

సుముఖుడికి దుఃఖం ఆగలేదు. ఒక్కసారిగా భోరున ఏడ్చేశాడు. గురువుగారు కొంచెం సేపు అలాగే ఏడవనిచ్చారు. తర్వాత మెల్లగా ఊరడించారు. "విషయం చెప్పు. నాకు చేతనైనా సాయం చేస్తాను" అన్నారు. సుముఖుడు గురుదేవుల ఓదార్పుతో స్థిమితపడ్డాడు.

"స్వామీ! నేను మీ వద్ద సకల విద్యలు నేర్చుకున్నాను. ఆ విద్యల బలంతో రాజుగారి ఆస్థానంలో కొలువు సంపాదించు కోవాలి అనుకున్నాను. ఇప్పటికి 5 సార్లు పోటీ పరీక్షల్లో పాల్గొన్నాను. కానీ విజయాన్ని సాధించలేకపోయాను. నాకు జీవితం మీదే విరక్తి పుడుతోంది స్వామీ!" అంటూ మనసు విప్పి తన బాధను చెప్పుకున్నాడు. గురువుగారు నవ్వుతూ – "ఓస్! అంతేగదా! పరీక్షలో ఎంతమంది పాల్గొన్నారు? అని అడిగారు.

50 మంది పాల్గొన్నారు. ఉద్యోగాలు ఎన్ని? 4 మాత్రమే. అయితే మిగిలిన 46గురు నీలాగే నిరుత్సాహంగా తిరుగుతున్నారా?

సముఖుడు మౌనంగా తలవంచుకున్నాడు. ఇంతలో సముద్రం ఒడ్డున ఇసుకతో పిచ్చుక గూళ్ళు కట్టుకుంటున్న పిల్లల్ని చూశారు సర్వానందస్వామి. ఉత్సాహంగా వారిని శిష్యునికి చూపించారు. చిన్న చిన్న పిల్లలు చిన్న చిన్న గూళ్ళు కడుతున్నారు. కట్టిన వెంటనే కొన్ని కూలిపోతున్నాయి. కొన్ని గాలికి పడిపోతున్నాయి. కొన్ని అలల తాకిడికి కొట్టుకొని పోతున్నాయి. అయినా వారు తమ ప్రయత్నాన్ని వదలిపెట్టడం లేదు. మళ్ళీ మళ్ళీ కడుతూనే ఉన్నారు. వారిలో ఒక పిల్లవాడు లేచి సముద్రానికి కొంచెం దూరంగా వెళ్ళాడు. ముఖంలో పట్టుదల తాండవిస్తోంది. ఈసారి గూడును కొంచెం పెద్దగా కట్టాడు. గూడు నిలిచింది. గబగబా నాలుగు గూళ్ళను కట్టాడు. అన్నీ చక్కగా నిలబడ్డాయి. ఆనందంగా తోటి పిల్లల దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. తాను కట్టిన గూళ్ళను చూపించాడు. అందరూ సంతోషంగా అక్కడకు చేరుకున్నారు. అందరూ పట్టుదలగా గూళ్ళను నిర్మిస్తున్నారు. వాళ్ళ ఆనందం చూడాల్సిందే గాని వర్ణించి చెప్పడం చాలా కష్టం.

"సుముఖా! చూశావు గదా! జీవితము ఇంతే. అనుకున్న కార్యాన్ని సాధించలేకపోతే నిరాశతో కుమిలిపోకూడదు. పరిస్థితులను అవగాహన చేసుకోవాలి, మనకు అనుకూలమైన దిశలోనికి మలచుకోవాలి. ఒకే ఒక లక్ష్యం వైపు పరుగులు తియ్యకూడదు. ఒకటి కాకపోతే మరొక దానిని ఎంచుకోవాలి, ప్రయత్నించాలి. ముందుగా మన దృష్టి కోణాన్ని మార్చుకోవాలి. జీవితంలో అనేక మార్గాలు ఉన్నాయి. మరొక్క దానిని ఎంచుకో, నీకు అనుకూలంగా మలచుకో" అంటూ సర్వానందుడు తేలికగా, అర్థం అయ్యేలా వివరించారు. సముఖుని మనస్సులో ఉత్సాహం ఉరకలు వేసింది.

*కం॥ పట్టిన పట్టును వీడక*
*గట్టిగ యత్నించుచుండ కచ్చిత రీతిన్*
*తట్టునుపాయంబులు తల*
*పెట్టిన కార్యంబు నెరపి పెరుగుము బాలా!*

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

## స్వావలంబన సంస్కారం

ఒక ఫ్రాన్సు దేశస్తుడు రోడ్డు ప్రక్కన బూటు పాలిష్ చేస్తున్న ఒక పేద కుర్రవాని చేతుల్లో డబ్బు పెట్టి పాలిష్ చేయమన్నాడు. మిగిలిన పైసలు తిరిగిచ్చాడు ఆ బాలుడు. వద్దన్నాడా వ్యక్తి. "నా తల్లిదండ్రులు శ్రమకు మించిన ఫలితాన్ని స్వీకరించవద్దని చెప్పారు" అన్నాడు బాలుడు. ఆ బాలుడే పెరిగి పెద్దవాడై ఫ్రాన్సు దేశానికి రాష్ట్రపతి అయ్యాడు. తల్లిదండ్రులు బిడ్డలకు చక్కని సంస్కారాన్ని అందించాలి.

– ప్రజ్ఞాపురాణం నుండి

**జీవితానికి ఆధారం సామాజిక సంబంధాలు.**

## ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# సత్సాహస - సంఘర్ష ప్రకరణం

**రుచేర్భవత ఆసక్తేరపి చార్థ సమర్థనమ్ ।**
**సమాధానం చ సమ్మానం బ్రహ్మవిద్యా విధౌవరమ్ ॥ 9**

'బ్రహ్మవిద్య' అత్యంత శ్రేష్టమైనది. దానిని తెల్సుకోవాలన్న జిజ్ఞాస మిక్కిలి శ్రేష్టతరమైనది. ఇటువంటి ఉత్తమ ఆసక్తి, జిజ్ఞాసలు కలిగిన శిష్యుల పట్ల గురువులు అత్యంత ఆనంద మనస్కులై, చక్కటి వివరణతో, సులభమైన ఉదాహరణలతో జ్ఞానోపదేశం చేస్తారు. బ్రహ్మ విద్యను గురించి భగవద్గీతలో, దుర్గాసప్తశతిలో విస్తృతమైన రీతిలో వివరించబడింది. భగవద్గీతలో "యుద్ధస్వ" అనే ప్రయోగం పలు సందర్భాలలో చేయబడింది. అంతర్గతమైన దుష్ట శక్తులు, కుసంస్కారాలపై యుద్ధాన్ని ప్రకటించమనే కర్తవ్యబోధ ఉంటుంది. తిమిరంతో సమరం చేయమన్న సందేశం కల్గిస్తుంది.

**అనీతేః ప్రతి రోధోఽపి నీతి పక్ష సమర్థనమ్ ।**
**ఏకమాస్తే తథాస్యాపి మహత్వం విద్యతే ధృవమ్ ॥ 10**

అవినీతిని ప్రతిఘటించడం, నీతిని సమర్థించడం, అనే ఏకైక లక్ష్యాన్ని తెలుసుకొని, ప్రతి నిమిషం దానిని ఆచరించే యత్నం చేయడమే మహత్వ లక్షణంగా గుర్తించాలి. ప్రతియుగంలోను అవినీతి, అరాచకం జగత్తును ఆక్రమించే ప్రయత్నం చేయడం, దానివలన మహాత్ములైన మునులు, ఋషులు, దేవతలు, కష్టాలు పాలవ్వడం భగవంతుడు అవతారాన్ని ధరించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయడం పౌరాణిక, చారిత్రక సత్యం.

విధ్వంస ప్రతిఘటనా ప్రవృత్తి, విచక్షణా శక్తి, ధర్మ రక్షణ, అధర్మ శిక్షణ వంటి ప్రవృత్తులు మానవుల మనస్సులలో నిండినప్పుడు ధర్మ పోరాటం జరిగి, ధర్మ రక్షణకు మార్గం సుగమమౌతుందన్న సత్యాన్ని పిప్పలాదుడు సవివరంగా వివరించసాగాడు.

**సంసారేఽవాంఛనీయత్వమత్ ఏవతు విద్యతే ।**
**సహానుభూతిం కుర్యాత్ర న్యాయనిష్టాం ప్రతి సదా ॥ 11**

ఈ సంసారమనే నాటక సృష్టిలో భగవంతుడు వాంఛనీయతతో (కోరతగినవి) బాటు అవాంఛనీయతను (కోరతగనివి) కూడా సృష్టించాడు. అంటే ఏవైతే కోరుకోతగినవో వాటినే కాకుండా కోరుకోతగిన వాటిని కూడా సృష్టించాడు, వాటి మధ్యగల బేధాన్ని, దానికి సంబంధించిన అనుభవాన్ని, అనుభూతిని తెలుసుకొనే న్యాయ, అన్యాయ వివేచన సృష్టించి మనుష్యులను పరీక్షిస్తూ ఉంటాడు. అందులో న్యాయనిష్టకు ప్రాధాన్యతనిచ్చే మార్గాన్ని సూచిస్తూ, అనుక్షణం మానవులను పరిశీలించి, పర్యవేక్షిస్తూ ఉంటాడు.

**సమర్థనేచతస్యాహి ప్రఖరంతత్పరాక్రమమ్ ।**
**కర్తుంచ ప్రేరయేత్ రాత్రి ర్నోచేత్ శ్రైష్ట్యం దినస్యన ॥12**

ఈ విధంగా మాయను సృష్టించి, దాని ప్రభావాన్ని, పరాక్రమాన్ని మనుష్యులపై ప్రయోగించడం ద్వారా మానవ మేధస్సును పరీక్షించి, ఆ పరీక్షలో విజయం సాధించేటట్లు ప్రేరేపించడమే భగవంతుని లక్ష్యం. రాత్రి లేకుంటే పగలు యొక్క విశిష్టత, ప్రాధాన్యతలను ఎలా తెలియవో, అవాంఛనీయ మాయ లేకుంటే, వాంఛనీయమైన న్యాయ నిష్ట యొక్క ప్రాధాన్యత తెలియదు కదా!

**అనస్తిత్వమనీ తేశ్చేత్ నీతేః కిం గరిమాజనైః ।**
**జ్ఞాయతేఽధర్మ సద్భావే, ధర్మ సంస్థాపనోదయః ॥ 13**

అవనీతి (అవినీతి) యొక్క ప్రభావం లేకుంటే నీతి యొక్క ప్రాధాన్యత ఎలా తెలుస్తుంది? అక్రమ మార్గంలో పయనించేవారికి ఎదురయ్యే శిక్షలు, బాధలు తెల్సినపుడే క్రమ మార్గంలోని విశిష్టత తెలిసేది. ధర్మము యొక్క గొప్పతనం తెలియాలంటే అధర్మం యొక్క చెడు ప్రభావం, పాపపంకిలతను తెలుసుకోవాలి. రాముని ధర్మ నిరతి తెలియాలంటే రావణుని పాప వర్తనం తెలియాలి. పాండవుల సత్యమార్గం తెలియాలంటే కౌరవుల అసత్యమార్గం తెలియాలి. కాబట్టి పాలు, నీళ్ళను వేరుచేయగల హంసల వలే మానవులు ధర్మధర్మాలను తెల్సుకోగలగాలి అన్న యోజనే భగవంతుని యోచన.

**యదిరోగానసంత్వేవ, చికిత్సాయాః తతః కథమ్ ।**
**విజ్ఞానస్య భవేత్సాతు స్థాపనా ప్రగతి స్తథా ॥ 14**

ప్రపంచంలో రోగాలే లేకుంటే చికిత్స యొక్క ఆవశ్యకత తెలియదు కదా! అనారోగ్యమే లేకుండా ఆరోగ్య రక్షణ పట్ల జాగ్రత్త తీసుకోలేం కదా! ఆరోగ్యం క్షీణించినపుడు పడే బాధలు తెలిసిన పుడే, ఆ అనారోగ్యం రాకుండా చర్యలు తీసుకుంటాం. కాబట్టి చీకటి ఉన్నది అని తెల్సినపుడే వెలుగు కోసం ప్రయత్నం చేస్తాడు మానవుడు. ఆ విజ్ఞాన శోధనమే అతని ప్రగతికి మార్గమవుతుంది.

**అజ్ఞానాన్నహానిభ్యః ఆత్మానం రక్షితుంవయమ్ ।**
**మనీషిణః సదా జ్ఞాన సాధనాం కర్తుముద్యతాః ॥ 15**

అజ్ఞానం, హాని మొదలైన విషయాలు, వాటి నుండి ఎలా రక్షించుకోవాలన్నదే జ్ఞానులు, మహనీయులు ఆలోచనా మార్గం. అజ్ఞానం జ్ఞానం, హాని-మేలు అనే విషయాలకు గల ప్రాధాన్యతలను తెల్సుకొని ముక్తిమార్గంలో పయనించడమే మేధావుల ధ్యేయం.

*– కథాకథన వ్యాఖ్యానం: సాధన నరసింహాచార్య*

**అనారోగ్యానికి మూలకారణం మానసిక కాలుష్యమే.**

పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం: 77-86

# సద్భావనల వికాసానికి పథకాలు

**దయ, కరుణ, సేవ, ఔదార్యం, సహకారం, పరమార్థం, న్యాయం, సంయమనం, వివేకం, ప్రేమ మున్నగు భావనలను జనమానసంలో మేలుకొల్పడం ఉత్తమోత్తమమైన సేవ.** కాఠిన్యం, సంకుచితత్వం, స్వార్థపరత్వం ఈ విశ్వాన్ని నరకంగా మార్చాయి. ఈ విశ్వంలో స్వర్గ వాతావరణాన్ని నెలకొల్పడానికి ఒకే మార్గం మనిషి అంతఃకరణను ఉన్నతస్థాయికి కొనిపోవడం. సద్భావనా శీలురైన వ్యక్తులు దేవతలుగా పరిగణించబడుతారు. దేవతా స్వభావం కలిగిన వ్యక్తులు ఉన్నచోట స్వర్గతుల్యమైన శాంతి సమృద్ధులు వెల్లివిరుస్తాయి. సద్భావనలను మేలుకొల్పేందుకు దిగువ కార్యక్రమాలు ఉపకరిస్తాయి.

**సేవా కార్యాలలో అభిరుచి :** అవసరమైన వ్యక్తులకు సహాయం అందిస్తూ ఉండడానికి, దుఃఖంలో ఉన్నవారికి దుఃఖం పోగొట్టటానికి వ్యక్తిగతంగాను, సామూహికంగాను సేవా కార్యాల నిర్వహణ జరుగుతూ ఉండాలి. క్రైస్తవ మిషన్‌లు పెక్కు స్థలాలలో ఆసుపత్రులు నడుపుతున్నాయి. ప్రాచీన కాలంలో బౌద్ధవిహారాలలో కూడా ఇలాంటి ఏర్పాటు ఉండేది. రామకృష్ణ మిషన్ కూడా పెక్కు స్థలాలలో ఆసుపత్రులు నడుపుతోంది. మనం “నిత్య జీవితంలో తులసి” పుస్తకం ఆధారంగా తులసి ఆకులతో కొన్ని మామూలు వస్తువులు కలిపి ఔషధాలు తయారుచేయవచ్చు. వాటిని అందించి రోగులకు సేవ చేయాలి. తులసి మొక్కలను పెంచి, ఇలా తక్కువ ఖర్చుతో హానిరహితమైన చికిత్స చేయాలి. సూర్య చికిత్స పద్ధతి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

సేవా సమితులు ప్రకృతి ప్రకోపాలకు గురయిన ప్రజలకు సేవా కార్యాలు, ఇతర విధములైన సేవాకార్యాలు నిర్వహిస్తున్నాయి. అలాగే మనం కూడా ప్రజలకు ప్రయోజనం కలిగించే ఏదో ఒక పనిచేస్తూ ఉండాలి. సద్భావనలను మేలుకొలపడంలో ఇవి సహాయకారులు అవుతాయి. వికలాంగ సోదరులకు పరికరాలు అందించే పనిని కూడా మనం చేపట్టాలి.

**పనికి వచ్చే ఉపకరణాల పంపిణీ :** జనం తరచు ఇతరుల నుండి అడిగి తెచ్చుకునే ఉపకరణాలను మన సమితి తనవద్ద ఉంచుకోవాలి. పెళ్ళిళ్ళలో పనికి వచ్చే పాత్ర సామానులు, గుండిగలు, జంపఖానాలు, నిచ్చెనల వంటి చిన్న చిన్న వస్తువులను సేకరించి ఉంచాలి. వాటిని నామమాత్రపు అద్దెకు ప్రజలకు ఇస్తూ ఉండాలి.

**జీవకారుణ్యం :** పశువులకు, పక్షులకు, జీవ జంతువులకు సేవచేసే ప్రవృత్తులకు ప్రోత్సాహం ఇవ్వాలి. పశువులు, పక్షులు కూడా మన కుటుంబంలోని సభ్యులే. వాటి మాంసం తినే అలవాటు, వాటి రక్తం త్రాగే అలవాటు వదులుకోవాలి. మాంసాహారం వల్ల ఆధ్యాత్మిక సద్గుణాలు నాశనం అవుతాయి. క్రూరత్వం పెరుగుతుంది. చర్మం నేడు జీవించి ఉన్న జంతువుల నుండి వస్తోంది. ఆ చర్మాన్ని ఉపయోగించడం వల్ల పశువధ పెరుగుతోంది. చర్మంతోకాక వస్త్రంతో, రబ్బరుతో తయారైన పాదరక్షలను మనం ఉపయోగించాలి. చర్మంతో తయారైన ఇతర వస్తువులను కూడా వాడకూడదు. నేడు లేడి చర్మం (కృష్ణాజినం) కూడా బ్రతికి ఉన్న లేళ్ళ నుండి తయారవుతోంది. కనుక పూజ కొరకు వాటిని వాడకూడదు. పట్టు పురుగులను బ్రతికి ఉండగానే ఉడికించి తయారుచేసే పట్టును కూడా వాడకూడదు.

పశువుల చేత వాటి బలానికి మించి పని చేయించుకోవడం, పశువుల మీద మోయలేని భారం మోపడం, వాటిని చితక బాదడం, గాయపడ్డ, జబ్బు పడ్డ పశువుల చేత పని చేయించడం, పశువుల నుండి కృత్రిమ పద్ధతులతో పాలు పితకడం వంటి పనులకు స్వస్తి చెప్పాలి.

గోపాలన, ఆవుపాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధర్మ కృత్యాల పట్ల శ్రద్ధ వహించాలి. అందువల్ల ఆరోగ్యం, సమృద్ధి, సద్భావన పెరుగుతాయి.

**మంచి దుకాణాల నిర్వహణ :** కల్తీలేని ఆహార పదార్థాలను సరమైన ధరలకు అమ్మే దుకాణాలను నిర్వహించాలి. ఆహార పదార్థాలలో కల్తీ క్షమించరాని నేరం. అది ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. నిజాయితీపరుడైన వ్యక్తులు ఇందుకు ప్రత్యామ్నాయం చూపాలి. అందువల్ల అతడికి బ్రతుకుదెరువు ఏర్పడుతుంది. ప్రజల అవసరము తీరుతుంది. బియ్యం, పప్పు, గోధుమ పిండి, నూనె, నేయి, పాలు, తేనె, బెల్లం, ఎండు పండ్లు, మసాలా దినుసులు, ఔషధాలు, ఆవిరిమీద ఉడికించే కుక్కరు, వ్యాయామ సాధనాలు, సాహిత్యం, పూజా సామగ్రి, ఇతర **నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందించే వ్యాపారస్థుడు ఈనాటి పరిస్థితిలో సమాజ సేవకుడే అవుతాడు.**

**సమ్మేళనాలు, గోష్ఠులు :** సద్భావనలను మేలుకొల్పడానికై చిన్నా

సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉత్తమమైన జీవన విధానం అవసరం.

పెద్ద సమ్మేళనాలు, గోష్ఠులు, సత్సంగాలు నిర్వహించాలి. సమ్మేళనాలలో మన భావాలను వ్యక్తం చేయడంలో సౌలభ్యం ఉంది. అందువల్ల ఉత్సాహము పెరుగుతుంది. చిన్న చిన్న గాయత్రీ యజ్ఞాల నిర్వహణ ఇందుకు ఉపయోగపడుతుంది. పెద్ద పెద్ద సభల కన్నా చిన్న చిన్న గోష్ఠులు మరింత ప్రయోజనకరంగా ఉంటాయి.

**నవరాత్రులలో శిక్షణా శిబిరాలు :** సద్భావనా శిక్షణా శిబిరాల నిర్వహణకు దేవీ నవరాత్రులు, చైత్ర నవరాత్రులు ఉత్తమమైనవి, ఈ నవరాత్రులలో తొమ్మిది రోజుల శిబిరాలను ప్రతిచోట నిర్వహించాలి. ఆ శిబిరాలలో ఉదయం జపం, హవనం, అనుష్ఠానం జరగాలి. సాయంత్రం గోష్ఠి, భజన, కీర్తనలు జరగాలి. రాత్రిపూట బహిరంగ ప్రవచనాలు జరగాలి. ప్రసాదంగా సత్సాహిత్యాన్ని పంచాలి. దేవ దక్షిణగా వ్యక్తులు దుర్వ్యసనాలను, దురాలోచనలను వదులుకునేటట్లు చేయాలి. చివరలో మహిళా గౌరవం దృష్ట్యా కన్యాభోజ్ (కన్యలకు భోజనం) ఏర్పాటు చేయవచ్చు. యుగ నిర్మాణ సిద్ధాంతాన్ని ప్రవచనాలలో వివరించ దానికి కార్యకర్తలకు తగు శిక్షణ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం ఇలా రెండు నవరాత్రులలో రెండు శిబిరాలు నిర్వహించాలి. ఇవి ప్రజలలో ఉపాసనను, భావనలను పెంపొందిస్తాయి.

**ధర్మ ప్రచార పాదయాత్ర :** కుటుంబ వ్యవహారాలను కొద్దిరోజులు ప్రక్కనబెట్టి కార్యకర్తల బృందాలు పాదయాత్రలు నిర్వహించాలి. నిర్ణీత కార్యక్రమం ప్రకారం ఒక్కోరోజు ఒక్కోఊరిలో బసచేయాలి. రోజు ఉదయం జపం, హవనం, సాయంత్రం గోష్ఠి, రాత్రి ప్రవచనం జరపాలి. బృందం పాదయాత్ర జరిపే స్థలాలలో ముందుగానే ఆయా కార్యాక్రమాలకు తగు ఏర్పాట్లు జరగాలి.

**సద్వాక్యాల లేఖనం :** గోడల మీద సద్వాక్యాలు పెద్ద ఖర్చు లేకుండా ప్రజా శిక్షణ జరిపే కార్యక్రమం. ఆదర్శాలను బోధించే, ప్రేరణ ఇచ్చే సద్వాక్యాలను మంచి దస్తూరితో గోడల మీద వ్రాయడం వల్ల వాటిని చదివేవారు ప్రభావితులు అవుతారు. పలువురు కార్యకర్తలు కలసి గోడల మీద ఇలా సద్వాక్యాలు వ్రాస్తే, ఆ స్థలంలోని గోడలన్నీ ప్రేరణ కేంద్రాలుగా రూపొందుతాయి.

**సంజీవని విద్యలో శిక్షణ :** సంజీవనీ విద్యకు ఒక కేంద్ర విద్యాలయాన్ని ప్రతి క్షేత్రంలో ఏర్పాటు చేయాలి. ఆ విద్యాలయం లో ప్రతి సమస్యపై లోతయిన అధ్యయనం జరగాలి. ఆయా సమస్యల పరిష్కారానికై ప్రయత్నించాలి. ఆ వ్యవస్థ, కుటుంబంలో కలతలు, ఆర్థికమైన చిక్కులు, విరోధుల ఆక్రమణ, అస్తవ్యస్తమైన దాంపత్య జీవితం, బాలబాలికలు భవిష్యత్తు, ఆత్మ కళ్యాణానికై వివిధ సాధనలు, పేదరికం, చింతలు, ఉద్వేగాలు, ప్రగతి పథంలో ఎదురయ్యే అవరోధాలు, మున్నగు అనేకానేక సమస్యలకు వ్యక్తిగత పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారం అందించగల శిక్షణను ఈ విద్యాలయాలలో ఇవ్వాలి. స్వార్థాన్ని పరమార్థాన్ని సమన్వయం చేసి మనిషి ఇహపర సుఖాలను ఎలా పొంద గలుగుతాడో శిక్షణ ఇవ్వాలి. ఈ విద్యాలయాలలో మనస్తత్వశాస్త్రం, సమాజశాస్త్రం, వ్యావహారిక జ్ఞానముల ఆధారంగా సమగ్ర శిక్షణ ఇవ్వాలి. ఇందువల్ల వ్యక్తిత్వ వికాసంలో తగు దోహదం లభిస్తుంది.

దేశంలో పలు విధములైన విద్యాసంస్థలు నడుస్తున్నాయి. కానీ జీవించే కళను నేర్పే ఏర్పాటు ఎక్కడా లేదు. మనం ఈ లోటును భర్తీ చేయాలి. గాయత్రీ శక్తిపీఠాలు ఇలాంటి శిక్షణ కేంద్రాలు అవ్వాలి. మథురలోని గాయత్రీ తపోభూమిలో, హరిద్వార్‌లోని శాంతికుంజ్‌లో ఇలాంటి శిక్షణ ఇవ్వబడుతోంది. కార్యకర్తలందరూ ఈ శిక్షణ నుండి ప్రయోజనం పొందాలి.

**చిన్న చిన్న స్థానిక శిక్షణా కేంద్రాలు :** మథురలోని గాయత్రీ తపోభూమికి, హరిద్వార్‌లోని శాంతికుంజ్‌కు వెళ్ళి శిక్షణ పొందడం కొందరికి సాధ్యపడకపోవచ్చు. అందువల్ల ప్రతి కేంద్రంలో శిక్షణ శిబిరాలు నిర్వహించాలి. జీవన విద్య పాఠ్య గ్రంథాలు ఆధారంగా సమస్యలను పరిష్కరించే జ్ఞానాన్ని కార్యకర్తలు ఈ శిబిరాలలో పొందాలి. సంస్కృతి జ్ఞాన పరీక్ష, జీవించేకళ, ఆరోగ్యం మెరుగుపరచుకునే పాఠ్య ప్రణాళికలు నిరంతరం అమలు జరగాలి. ఈ శిబిరాల ద్వారా యుగ నిర్మాణానికి అవసరమైన సంజీవనీ విద్య ఎక్కువ మందికి అందుతుంది.

సద్భావనలను పెంచడానికై కొన్ని కార్యక్రమాలు ఈ వ్యాసంలో ఇవ్వబడ్డాయి. పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని కార్యక్రమాలను రూపొందించుకొని ఉత్సాహపూర్వకంగా నిర్వహించాలి.

యుగశక్తి గాయత్రి
మాస పత్రిక చదవండి !
చదివించండి !!

జీవితం పనుల సమాహారం.

గురుపౌర్ణమి ప్రత్యేకం

# ప్రజాసేవకు తంత్ర విజ్ఞానం

పాత అఖండజ్యోతి సంచికలు చూస్తే అందులో గురుదేవుల కొన్ని రహస్యాలు బయటపడతాయి. వాటిల్లో గురువుగారి యొక్క 'జన్మ కర్మ చ మే దివ్యం' యొక్క ఉదాహరణలు కనిపిస్తాయి. 1940 ఏప్రిల్, జూన్ అఖండ జ్యోతి సంచికల్లో ఇలాంటి ఒక రహస్యమయ ప్రసంగం ప్రస్తావించబడింది. ఆ రోజుల్లో గురువు గారు 'ఆనంద ప్రతిష్ఠాన్' అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. తంత్ర విజ్ఞానానికి సంబంధించిన సాధన, శిక్షణ, వాటి విభూతులు, వాటి ద్వారా సాధించిన సాఫల్యంతో ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఈ సంస్థ స్థాపించబడింది. పరమపూజ్య గురుదేవులు ఒక మహాయోగి, తంత్ర విద్యలో గొప్ప ప్రావీణ్యులు. 1940 జూన్ అఖండ జ్యోతి పత్రికలోని పేజీలు ఆయన ఆచార్యత్వాన్ని నిరూపించే దస్తావేజులు.

సామాన్య వ్యక్తిగత చర్చలలో అప్పుడప్పుడు ఈ తంత్ర విద్యకు సంబంధించిన రహస్యాలు కొన్నిటి గురించి ప్రస్తావించేవారు. దుర్లభమైనటువంటి తంత్ర విజ్ఞానంలోని కొన్ని కోణాలలో తమ గురువుగారు శిక్షణ ఇచ్చారని ఒకానొక సందర్భంలో చెప్పారు. కొన్ని యుగాల క్రితం విశ్వామిత్ర బ్రహ్మర్షి ద్వారా బహిర్గతం చేయబడ్డ ఈ సాధనలు కాలాంతరంలో లుప్తమైపోయాయి. ఈ తంత్ర విద్య యొక్క రహస్య విజ్ఞానాన్ని బ్రహ్మర్షి విశ్వామిత్రులవారి కారణసత్తా నుండి వారి గురువుగారు (దాదా గురుదేవులు) పొందారట. ఆ తరువాత సరైన సమయ మొచ్చినప్పుడు వారి సుయోగ్య శిష్యుడు, మనందరి గురువుగారు అయిన శ్రీరామశర్మ ఆచార్యగారికి అప్పగించారు. ఎన్నో సంవత్సరాల కఠోర సాధన తరువాత వీటిలో ప్రావీణ్యం సంపాదించారు. ఎన్నో విద్యలు, సాధనలకు ఆచార్యులైన వీరు ఈ తంత్ర విజ్ఞానానికి కూడా సుప్రసిద్ధ ఆచార్యులెయ్యారు. ఆనంద ప్రతిష్ఠాన్‌లో వారి తంత్ర విద్య యొక్క సాధన వెల్లడయింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా నగరంలో ఫ్రీగంజ్ అనే ప్రాంతంలో ఈ ఆనంద ప్రతిష్ఠాన్ స్థాపించబడింది. ఇది తంత్ర విద్యను ఉపాసించే కేంద్రం. ఇందులో గురుదేవులు, మరియు వారి ద్వారా శిక్షణ పొందిన కొందరు సాధకులు తంత్ర విజ్ఞానానికి సంబంధించిన క్రియల ద్వారా పొందిన శక్తిని ప్రజాసేవకై వినియోగించేవారు. గురుదేవులు ప్రచారం చేసిన ఈ సాధనలు, ప్రక్రియలు అత్యంత సూక్ష్మమైనవి. తదనుసారంగా వాటి ప్రభావం సుదూరాల్లో వ్యాపించి, దీర్ఘకాలిక ఫలితాలు కలిగించేవి. ఈ నిగూఢ క్రియల ద్వారా ఉత్పన్నమెయ్యే సూక్ష్మ కంపనలు ఎంతో శక్తివంతమైనవి. వాటి ప్రభావం దగ్గరున్నవారి మీద ఎంతగా ఉండేదో వేల మైళ్ళ దూరంలోని వారి పైన కూడా అంతే ఉండేది. ఇదేదో క్షణకాలపు మెరుపులాగా కాక చికిత్స చేయబడే వ్యక్తి యొక్క మనస్సు, శరీరాలపై మంచి ప్రభావాన్ని చూపించి ఆశ్చర్యకరమైన, చమత్కారమైన మార్పులు తెచ్చేది.

తమ కఠిన సాధన ద్వారా పొందిన శక్తిని పీడితుల సేవ కోసం వినియోగించి, గొప్ప పేద భేదం లేకుండా ఎవరి దగ్గర నుండి కూడా ఏదీ స్వీకరించలేదు ఆనంద ప్రతిష్ఠాన్. అంటే ప్రజల కష్టాలను ఉచితంగా తొలగిస్తారు. అయితే లాభం పొందిన వారు తృప్తితో ఏదైనా ఇస్తే అది సాధకుల జీవన నిర్వహణకు వాడేవారు. ఈ తంత్ర విద్య ద్వారా ఎన్నో అతి కఠిన శారీరిక, మానసిక రుగ్మతలు, చెడు అలవాట్లు, సంతాన సమస్యలు, గృహ కలహాలు, అనిష్ట నివారణ, భూత బాధ, అశాంతి మొదలైన వాటిని తేలికగా నయం చేసేవారు. ప్రాణాంతకమైన రోగాలతో బాధపడే వారికి యుద్ధప్రాతిపదికతో చికిత్స చేసేవారు. అసాధ్యమైన శారీరిక రోగాలే కాక జ్ఞాపక శక్తి లోపాలు, చింత, ఉద్వేగం, న్యూనతా భావం, చెడు ప్రవృత్తులు, కోపం మొదలైన మానసిక వ్యధలను కూడా ఇక్కడ బాగు చేసేవారు.

అఖండ జ్యోతిలో గురుదేవులు ఇలా వ్రాశారు. 'తంత్ర విజ్ఞానం యొక్క అద్భుత శక్తితో మీ కష్టాలను తొలగించుకోవడానికి మా సేవలను వినియోగించుకోండి. ప్రాణాంతక రోగాలతో బాధపడే వారు మాత్రమే మమ్మల్ని సంప్రదించండి. సాధారణ రోగాలకు డాక్టర్ల ద్వారా చికిత్స పొందవచ్చు. ఒక విషయం స్పష్టంగా తెలియపరుస్తున్నాం. మారణ్, మోహన్, ఉచ్చాటన, వశీకరణం, స్తంభనం వంటి పాప క్రియలు ఎవరికీ అనుకూలంగా కాని, వ్యతిరేకంగా కాని ప్రయోగించము. ఇటువంటి వాటి కోసం ఎవరూ ఉత్తరాలు రాయవద్దు. త్వరగా లాభాలు పొందడం, లంకె బిందెలు, రహస్య నిధులు వంటి విషయాలు కూడా ఇక్కడ చెప్పబడవు.'

**ఘర్షణలతో సమస్యలకు పరిష్కారాలు సాధించలేరు.**

తంత్ర విజ్ఞానం ద్వారా ప్రజాసేవ చేయటమే ఆనంద ప్రతిష్ఠాన్ యొక్క ఉద్దేశం. శారీరిక, మానసిక, సామాజిక వ్యధలతో బాధపడే వారికి చికిత్స చేసే ఈ ప్రయత్నం పూర్తిగా వైజ్ఞానికమైనది. అందుకు గురువుగారు మరోమాట వ్రాసారు, "ఎటువంటి మూఢ నమ్మకాలను, భ్రమలను, కపటాన్ని మేము ప్రచారం చేయటం లేదు. మేము ఎవ్వరి దగ్గర నుండి ఎలాంటి ఫీజు తీసుకోనప్పుడు, ఏ విధంగాను డబ్బులు హరించనప్పుడు మేము చేసేది మోసం, కుట్ర అయ్యే అవకాశం ఎలా అవుతుంది?" ఇక్కడి వారిని చికిత్స కోసం సంప్రదించే పద్ధతి చాలా సులభం. రోగికున్న కష్టాన్ని ఉత్తరంలో వ్రాసి పంపించాలి అంతే. అయితే చికిత్స సులభంగా, త్వరగా అవడం కోసం నాలుగు వస్తువులు అవసరం. 1) రోగానికి కారణం, ప్రస్తుత పరిస్థితి, రోగి యొక్క పూర్తి వివరాలు 2) రోగి ఫొటో (ఐదేళ్ళకన్నా పాతది అవకూడదు), 3) రోగి యొక్క శిఖా స్థానంలోని 11 వెంట్రుకలు, 4) బ్లాటింగ్ పేపర్ మీద రోగి ఎడమ బొటన వేలు నుండి తీసిన ఒక బొట్టు రక్తం. ఈ నాలుగు వస్తువులు ఉంటే చికిత్స చాలా సులభంగా, త్వరగా జరిగేది, అంతేకాక నిశ్చితమైన పరిణామాలను కూడా ఆశించవచ్చు.

రకరకాల రోగాల చికిత్సతో పాటు ఆధ్యాత్మిక విద్య, తంత్ర విద్యల శిక్షణ కూడా ఇక్కడ ఇవ్వబడేది. తమ ఆధ్యాత్మిక ఉన్నతి కోరుకునే వారికి, ఇతరులకు చికిత్స చేయదలచిన వారికి ఇక్కడ శిక్షణ ఇవ్వబడేది. ఇందులో భాగంగా అలౌకికమైన, రహస్యమైన విషయాలు తెలుసుకునే శిక్షణ కూడా ఇవ్వబడేది. ఈ శిక్షణ కూడా ఇక్కడ ఉచితంగానే ఇవ్వబడేది. కాకపోతే ఇక్కడికొచ్చిన సాధకుడు ఈ విద్యను పరోపకారానికి మాత్రమే ఉపయోగిస్తాననే సంకల్పం తీసుకోవాలి. గురువుగారు తమ దివ్యదృష్టి ద్వారా ఇటువంటి సాధకులను పరిశీలించేవారు. "తమ తుచ్ఛమైన కోరికల కోసం, స్వార్థం కోసం ఈ విద్యను ఉపయోగించదలచిన వారు మా నుండి ఎటువంటి శిక్షణని ఆశించరాదు" అంటూ స్పష్టంగా చెప్పారు.

రోగుల చికిత్సకు, సాధకుల శిక్షణకు అయ్యే ఖర్చు గురువుగారే పూర్తిగా భరించేవారు. అమూల్యమైన రామబాణం వంటి మందులు, రసాయనాలు, మూలికలు, సాధనా యంత్రాలు, కవచాలు, రక్షా విధానాలు మొదలైనవి ఎన్నో వస్తువులు ఆనంద ప్రతిష్ఠాన్ నుండి ఉచితంగా రోగులకు పంపబడేవి. కాకపోతే రోగులు వాటి పోస్టు ఖర్చులు భరించాలి. ఈ అద్భుత కేంద్రం నుండి గురువుగారు చాలా సంవత్సరాలు ప్రజాసేవ చేసారు. తంత్ర విజ్ఞానం యొక్క వైజ్ఞానికతను నిరూపించారు. లెక్కలేనంత మంది, అసాధ్యమైన రోగాల నుండి కూడా చికిత్స పొందారు. ఎందరివో దుఃఖాలు, నిస్పృహ పటాపంచలై ఆనంద సూర్యోదయం జరిగింది. కార్యభారం పెరగడం వల్ల ఈ ప్రతిష్ఠానాన్ని మూసేయవలసి వచ్చినా, నేటికీ ఆయన జీవిత పుస్తకంలో సువర్ణ అధ్యాయంగా ప్రకాశిస్తూనే ఉన్నది.

*– అఖండజ్యోతి, జులై 2002*
*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## లాల్‌బహదూర్ శాస్త్రిగారి యొక్క కుటుంబ శిక్షణ

*అప్పట్లో లాల్‌బహదూర్ శాస్త్రిగారు ఉత్తరప్రదేశ్‌లో గృహ మంత్రిగా ఉండేవారు. ఒకనాడు కొందరు గవర్నమెంటు ఉద్యోగులు వారి ఇంట్లో కూలర్‌ని ఏర్పాటు చేయడానికి వచ్చారు. ఈసారి ఎండబాధ ఉండదని పిల్లలు చాలా సంతోషించారు. ఇంతలో శాస్త్రిగారు వచ్చి, వారికి తన అభ్యంతరాన్ని తెలియజేశాడు. ఏ సౌకర్యమైతే కోరకుండా లభించిందో దానిని నిరాకరించవలసినదే మున్నదని భార్య ప్రశ్నించగా దానికి శాస్త్రిగారు "ఇది అవసరంకాదు, విలాసం. నేను ఎప్పుడూ మంత్రి పదవి లోనే ఉంటానని అనుకోవటానికి వీలులేదు. విలాసంతో కూడిన ఈ సౌకర్యాల వలన పిల్లలు తర్వాత బాధలు పడతారు. ముఖ్యంగా వివాహాలుచేసి అత్త వారింటికి పంపవలసిన ఆడపిల్లలకు అక్కడ ఈ సౌకర్యాలు లభించనినాడు అసంతృప్తికిలోనై అభిప్రాయభేదాలు చోటు చేసికొని జీవితాలు దుర్భరంగా తయారవుతాయి" అని తెలియజేశారు.*

*ఇలాంటి శిక్షణ శాస్త్రిగారు తన తల్లి వద్ద నుండి నేర్చుకొన్నారు. ఏ శిక్షణైతే తనను అంతగొప్పవాణ్ణి చేసిందో అదే శిక్షణను ఆయన తన కుటుంబ సభ్యులకు కూడా ఇవ్వడం జరిగింది. తండ్రుల పదవులను అడ్డుపెట్టుకొని సౌకర్యాలకు అలవాటు పడటంగాక, ఎలాంటి పరిస్థితుల లోనూ చలించకుండా నిలబడగల సద్గుణ సంపన్నులైన సంతానాన్ని సమాజానికి అందించాలనేది మహామానవుల ఆకాంక్ష.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**సమస్యలను ప్రశాంత వాతావరణంలో పరిష్కరించుకోవాలి.**

# గూఢచర్యం వైదిక ఋషుల ఒక పరమ పావనమైన వరం

సృష్ట్యారంభము నుండే మానవుని జిజ్ఞాస మరియు ఆత్మరక్షణ అనే ప్రబల భావన అతనిని తన ప్రతిపక్ష వ్యక్తుల, శత్రువులు గురించిన విషయ సేకరణ చేసే దిశగా ఉసిగొల్పింది. ఈ జ్ఞాన పిపాస గుప్తచర్య వ్యవస్థ అనే సంస్థకు జన్మనిచ్చిందని చెప్ప వచ్చును. ఆంగ్లేయులు ఈ పద్ధతిని 'స్పైయింగ్' అని, దీనిలో పనిచేసే వారిని 'స్పై' అని పిలుస్తారు. ఈ స్పై శబ్దము సంస్కృతము లోని 'స్పశ్' శబ్దమునకు సమానార్థకమైనది. దాని అర్థము చూచేవాడు మరియు నిరంతర అప్రమత్తత. ఈనాటి గూఢచారి వ్యవస్థ ప్రాచీన భారతభూమి ఇచ్చిన కానుక అన్నది సుస్పష్టము. పూర్వకాలములో కొంతమంది వ్యక్తులు ప్రతి ఒక్క వ్యక్తి క్రియా కలాపములు, నిత్యజీవిత గమనము మీద దృష్టిని ఉంచేవారు. కాలాంతరములో ఇదే ఒక వ్యవస్థగా సమన్వయ ప్రణాళికా రూపంలో వికసించినది. అదే గుప్తచర్య కళకు జన్మనిచ్చింది.



దీని చరిత్ర అతి ప్రాచీనమైనది. బహుశః మానవోత్పత్తితో పాటే ఈ విధానము కూడా ఆవిర్భవించినదేమో! ఆది మానవులు తమకు తాము ఏకాకులుగా మరియు రక్షణలేనివారుగా భావించు కునేవారు. అయితే వారు ఆత్మరక్షణ కొరకు సంఘర్షించవలసిన అవసరము తలెత్తింది. బహుశః అప్పటినుండే తమ విరోధులు, శత్రువుల గురించి ఆరాతీయడం అనేది జీవితంలో ఒక గొప్ప అవసరముగా రూపుదాల్చి ఉంటుంది. తరువాత తరువాత కాలాంతరములో ఈ అవసరము సమాజ వ్యవస్థలో ఒక అవిచ్ఛిన్న అంగంగా మారిపోయింది. రాజకీయ కూటమిల ఆవిర్భావంతో పాటుగా గూఢచారీ సంస్థ యొక్క వ్యవస్థీకృతరూపం సమాజము ముందుకొచ్చింది. మనిషి, సమాజము, దేశముల అప్రతిహతమైన వికాసము, అభివృద్ధికొరకు దీనిని విస్తృత రూపంలో ఉపయోగించుట ప్రారంభమైనది. ఋగ్వేదకాలం వరకు ఈ తంత్రము బాగానే వృద్ధిచెందినది. వైదిక ఋక్కులు దీనికి ప్రమాణంగా నిలుస్తున్నాయి.

**సహస్రధారేஉ వ తే సమస్వరన్ దివో**
**నాకే మధుజిహ్వా అసశ్చతః ।**
**అస్య స్పశో న ని మిషంతి భూర్ణయః**
**పదే పదే పాశినః సంతి పేతవః ॥ (ఋగ్వేదం)**

అనగా 'అతి వేగంగా చరించేవారు, దుష్టులను బంధించే గుప్తచారులు ప్రతిస్థానంలోనూ ఉన్నారు, వారి కనురెప్పలు ఎప్పుడూ మూతపడవు. మధురభాషణ చేసే, ఎవ్వరితో కలవని ఆ గుప్తచారులు దేశంలోని అసంఖ్యాక మానవులను రక్షిస్తూ ఉంటారు, వివిధ వ్యవహారాలు సలిపే ముఖ్యకేంద్రాల పనులకు ఆటంకములను కలిగిస్తూ తిరుగాడే దుష్టులను అణచివేస్తారు.'

దీనివలన ఒక విషయము స్పష్టమౌతున్నది. రక్షణ, సువ్యవస్థ మరియు ప్రగతికి సంబంధించిన ఈ తంత్రవ్యవస్థ వైదిక కాలంలోనే ఉనికిలోకి వచ్చింది. ఆర్షగ్రంథముల అధ్యయనము చేత 'ప్రాచీనకాలంలోనే రాజ్యం యొక్క సమగ్ర స్వరూపము వికాసం చెందినది' అనేదానికి గట్టి ఆధారాలు, సాక్ష్యాలు లభ్యమౌతాయి. ఇందువలన రాజ్యంలో శాంతి, సువ్యవస్థల కొరకు ఒకవేళ గుప్తచర వ్యవస్థవంటి ప్రణాళిక ఏదైనా ఉండి ఉంటే అందులో ఆశ్చర్యపడవల్సిన విషయమేమీ లేదు. ఆర్ష వాఙ్మయములో వరుణుని స్వరూపంలో ప్రప్రథమ సామ్రాట్టు వర్ణన లభిస్తుంది. కాలంతోపాటు వైదిక దృష్టి కలిగిన రాజులు కేవలము వరుణుని గుణ-స్వరూపాలను, అధికారాలను వరించటమేకాక, సమాజ వ్యతిరేక తత్త్వముల యొక్క పనులమీద దృష్టినుంచి, వారిని దండించే అధికార బాధ్యతను కూడా చేపట్టారు అన్నది పై విషయం వల్ల స్పష్టమౌతున్నది. వైదికసంహితలలో సమాజపు అసురక్షస్థితి (without protection) యొక్క విపుల వర్ణన కూడా లభిస్తుంది. ఈ అసురక్ష, విపత్కర పరిస్థితుల నుండి రక్షించమంటూ, 'దేవతాగణములారా! మీరు కేవలము ఆర్య సమాజమును ప్రాకృతిక ప్రకోపాలు మరియు దుర్ఘటనల నుండే కాక, దస్యులు, అనార్యులు మరియు అరాచక తత్త్వాలనుండి కూడా ఈ భూమిని ఎల్లప్పుడూ కాపాడండి' అని దేవతా గణమును ఉద్దేశించి చేసిన ప్రార్థనలు కనిపిస్తాయి. వైదిక కాలం ముందు, ఆ తరువాత కాలంలో నగర నిర్మాణ వికాసంతో పాటు, ఆర్యులకు సంస్కారహీనులు, అర్ధవికసిత సభ్యత గలవారు మరియు దుండగులు అయిన మనుష్యుల వలన ముప్పు ఏర్పడినది. వారి నిరంతర ఆక్రమణలు, అణచివేతల వలన పరంపరాగతమైన సమాజంలో విశృంఖలత వ్యాపించసాగింది. సమాజము, జీవితము మరియు సంపత్తిని దోచుకునే అపరాధుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందిన

**పంతాలు పట్టింపులు మానవ సంబంధాలను దెబ్బతీస్తాయి.**

కారణంగా వైదిక జనులు భయగ్రస్తులై అశాంతితో జీవితమును గడుపసాగారు. అటువంటి స్థితిలో భారతీయ మనీషులు ఒక తంత్రవ్యవస్థను రూపొందించారు. తద్వారా పైన చెప్పిన అరాచకతత్త్వముల నుండి మానవులను, సమాజమును రక్షించుట, అంతేకాక వారి అభ్యుదయమునకు సైతము బహు మూల్యమైన కృషిసలుపుట. దీనికొరకు రాజ్యంలో విభిన్న స్థాయిలలో గుప్తచారులను నియమించే ఏర్పాటు ఉండేది. తదనుసారంగా గూఢచారుల పని, అధికారాలలో భేదం ఉండేది. పనిలో ఉండే తేడానుబట్టి వారికి వేర్వేరు సంకేతపదాలు కూర్చబడ్డాయి. మహాభారతము, రామాయణము, మనుస్మృతి, కామందకము, శుక్రనీతి, కిరాతార్జునీయము, ముద్రారాక్షసము, ఉత్తరరామచరిత నాటకము, ముక్తికల్పతరువు, కౌటిల్యుని అర్థశాస్త్రము మొదలగు గ్రంథాలలో ఈ పేర్లు ప్రస్తావించబడగా, స్మృతి సాహిత్యములో ఈ పేర్లు అక్కడక్కడ కనబడతాయి. గూఢచర్యానికి సంబంధించి ప్రయోగించబడిన సంకేతపదాలు వరుసగా చర్, ప్రణిధి, ప్రహిత్, అపసర్ప, సంచార్ పురుష్, గూఢపురుష్, ఆణ్త, ప్రత్యాయిత, పథిక్, ఉత్పథిక్, ఉపనిషత్, ఉభయవేతన్, కాపటిక్, ఉదాస్థిత్, గృహపతిక్, వైదేహక్, తాపస్, సత్రిన్, తీక్షణ్ రసద్, భిక్షుకి, కర్ణేజక్, సూచక్, ఛాత్ర, కిరాత్, యమపట్టిక్, అహితుణ్డిక్, శౌండిక్, శౌభిక్, పాటచ్చర్, విట్, విదూషక్, పీఠమర్ద, వైతాళిక్, గణక్, శకునిక్, భిషగ్, నైమిత్తిక్, సూద్, ఆరాలిక్, సంవాహక్, జడ్ మొదలైనవి.

పాణిని రచించిన 'అష్టాధ్యాయి' అను గ్రంథంలో గుప్తచారుల గురించి కొన్ని విషయాలకు ప్రామాణికాలు లభిస్తాయి. ఈ వ్యవస్థ కౌటిల్యునికంటే ముందునుండే పాలనా రంగంలో ఒక మహత్వ పూర్ణమైన అంగం రూపంలో ప్రతిష్ఠితమై ఉన్నది. కౌటిల్యుడు చెల్లాచెదరైన ఈ జ్ఞానమును కేవలము సువ్యవస్థీకృతము, సుసంఘటితము కావించారు. ఈ పద్ధతి ఏదో ఒక వ్యక్తి లేక యుగపు అన్వేషణ కానేకాదు, పైపెచ్చు అనేక యుగాల పరిణితి. విడిపోయిన ముత్యాలను ఏరి దారంలో గ్రుచ్చినట్లు కౌటిల్యుడు తన అర్థశాస్త్ర గ్రంథంలో గూఢచర్య వ్యవస్థ యొక్క చెల్లాచెదరైన జ్ఞానమును ఒకచోటున సూత్రబద్ధం కావించాడు. ప్రస్తుతము ఉన్న జ్ఞానమునకు పూర్వం నుండి నిరంతరము ప్రవహిస్తున్న అనంత జ్ఞానధారలను కాలానుగుణంగా తిరగరాసి ఒక చక్కని రూపునిచ్చాడు. దీనికి పలు ఉన్నత ప్రమాణాలు కాలానుగుణ్యంగా పరివర్తన చెందుతున్న శతాబ్దాలలోను మరియు పురాణాలలోను, భాసుడు, కాళిదాసు, మాఘుడు, బాణభట్టు చేసిన రచనలలోను, దక్షిణ దేశానికి చెందిన తమిళసాహిత్యములోను లభ్యమౌతాయి. ఈ పనిలో కౌటిల్యునికి అపరిమిత సాఫల్యము లభించినది. ఆయన రచనయైన అర్థశాస్త్రంలో కౌటిల్యుని దూరదృష్టి, సమస్యల ఆకళింపు శక్తి నిశ్చయంగా విస్మయకరమైనదే! దీని ప్రాయోగిక ఉపయోగమునకు, నిరంతర మరియు సూక్ష్మతమమైన విధానాలకు ఇచ్చిన స్పష్టత అభూతపూర్వమైనదే! ప్రజాభిప్రాయమును తనవైపుకు త్రిప్పుకొనుట, మిత్రమండలిలో భేదాభిప్రాయమును సృష్టించుట ఇత్యాది విషయాలకు సంబంధించి కౌటిల్యునిచే ప్రణీతమైన ప్రక్రియలు మనలను అధునాతన గుప్తచార వ్యవస్థకు 2000 సంవత్సరాలకంటే ముందుండే కాలానికి తీసికెళతాయి. విశిష్టవ్యక్తుల రక్షణ విషయానికి సంబంధించి కౌటిల్యుడు ప్రతిపాదించిన మార్గదర్శక సిద్ధాంతాలు, ఇప్పుడు కూడా వాటిలో ఏవిధమైన సవరణలు లేకుండా సమగ్రతా స్వరూపం కలిగి విజయవంతంగా ఉపయోగించుకోతగినవి.

మానవ సభ్యతకు ఆది గ్రంథమైన ఋగ్వేదంలో ఈ తథ్యము ఖండించలేని రీతిలో ఉపలబ్ధమౌతున్నది. గుప్తచరవ్యవస్థ ఆర్య ఋషుల వరదానము, గొప్ప కానుక. ఆ గ్రంథంలో ఇంద్రుడు వరుణుల ద్వారా తమ సర్వవ్యాపి దూతలు లేక గుప్తచరులను ఉపయోగించుట, 'సరమా' ద్వారా అపరాధులను అన్వేషించుట మున్నగు విషయాల కూలంకషమైన వర్ణన లభిస్తుంది. నేడు ఈ విద్యకు సంబంధించి అమలులో ఉన్న నీతి నియమాలు కౌటిల్యుని చేతలో మార్పు చేర్పులకు లోనై, వృద్ధిచేయబడినవే అని చెప్పక తప్పదు. ప్రస్తుతము ఈ రంగంలో యంత్రోప కరణములను కూడా ఉపయోగిస్తున్నారు. కానీ ఆనాడు కేవలము బుద్ధి, చాతుర్యముల ఆధారంగానే సమస్తం నిర్వహించబడేది, గ్రహించబడేది. దీనిని ఆ యుగపు విశిష్టత, గొప్పదనమని చెప్పక తప్పదు.

గూఢచారీ వ్యవస్థ యొక్క మూల ఉద్దేశ్యము, లక్ష్యము శాంతి, సువ్యవస్థ, ప్రగతిల యొక్క సంరక్షణ చేయుట. ఈ వ్యవస్థ యొక్క లక్ష్యము సంపూర్ణంగా దోషరహితమైనది. అనగా లక్ష్యము ఉన్నతమైనది. ఇందులో నిక్కచ్చి, నిఖార్సైన మనిషిని దండించే, పీడించే అవకాశము లేదు. ప్రాచీన భారతభూమిలో నచ్చనివారి అణచివేతకు, అన్ని విషయాలను తన అధీనంలో ఉంచు కొనుటకు, పాలక వర్గీయుల శ్రేయోభిలాషుల అభివృద్ధి కొరకు ఈ సంస్థ ఆవిర్భవించలేదు. పైపెచ్చు నైతిక, ధార్మిక వ్యవస్థలను బలోపేతము చేయుటకు ఈ సంస్థను ఉపయోగించే వారు. ఆనాటి కాలంలో ధర్మమును సాంప్రదాయిక అర్థంలో ప్రయోగించేవారు కాదు, పైగా ఇది ఒక సంపూర్ణ ధర్మ ఆచరణ సంహిత, లోకహితము తప్ప దీనికి అన్య ప్రయోజనమేమీ లేదు. అర్థ శాస్త్రముల దృష్టికోణములో మౌలికంగా ఈ అంతరమే కనపడుతుంది. కౌటిల్యుని ద్వారా ప్రస్తావించబడిన వ్యవస్థలో 'రాజు అధికారమును సుదృఢము కావించుట, అఖండ రాజ్య స్థాపన వెనుక దాని చరమ లక్ష్యము లోకకళ్యాణ భావనయే'

**ఆచరణ సాధ్యమైన లక్ష్యాలను నిర్ణయించుకోవాలి.**

ఉన్నది. దీనిని భారతీయ ఆలోచనావిధానము మరియు దర్శనముల సర్వోపరి విశిష్టత అని చెప్పవచ్చును. ఈ విధానంలో సార్వజనిక వ్యవస్థ నిరంతరము జనహితమునకే అంకితమై ఉంటుంది. భారతీయ గూఢచారుల ప్రణాళికే దీనికి ఉత్కృష్ట ఉదాహరణ. డిసెంబరు 13న పార్లమెంటు భవనము మీద, అంతకుమునుపు జమ్మూ కాశ్మీరు అసెంబ్లీమీద జరిగిన ఆత్మహత్యా దాడులను గమనించండి. ఇది విదేశీ గూఢచారీ వ్యవస్థ యొక్క విధ్వంసకరమైన ఆలోచనా విధానమునే దర్శింపజేస్తున్నది. ఈనాడు ప్రపంచమంతటా ఇటువంటి అనేక గుప్తచారీ వ్యవస్థలున్నాయి. అవి ప్రాదుర్భావకాలం నుండి వినాశనము, జనహానిలో లీనమై ఉన్నాయి. అవి ఈ కళ యొక్క మూల భావన నుండి సర్వదా వ్యతిరేక భావనలే కలిగి ఉన్నాయి. గూఢచారీ వ్యవస్థ మూల ఉద్దేశ్యము సురక్ష, వికాసము, వృద్ధి. శత్రువుల ప్రగతి యొక్క రహస్యములను కనిపెట్టి, తమ అభివృద్ధి పథములో ఎదురయ్యే దాడులను, సవాళ్ళను విఫలము కావించి తమ ప్రగతియాత్రను నిరంతరము ముందుకు సాగిస్తూ పయనించుట. అదే ఈ విద్యలో దాగి ఉన్న నిజమైన అర్థము, లక్ష్యము. ఈనాడు అది తన మూల ప్రయోజనము నుండి తిరోన్ముఖమై వినాశకరమైన సరంజామాను ప్రోదిచేసుకొనుటలో లీనమై ఉన్నది. గూఢచార వ్యవస్థకు ఇంతకన్నా అవమానకరమైన అంశము మరేముంటుంది? మనువు, శుక్రుడు, యాజ్ఞవల్క్యుడు, కామందకుడు, సోమదేవుడు, కౌటిల్యుడు మరియు మేధాతిథి వంటి ఆచార్యులు, వారికంటే ముందు లిఖించబడిన వైదిక సాహిత్యము ప్రప్రథమముగా ఈ విద్యను కనిపెట్టి వెలుగులోకి తెచ్చి ప్రపంచము ముందుంచినప్పుడు తర్వాతి కాలంలో ఈ కళ వినాశకరమైన లీలలను ప్రదర్శించుటలో, కుతంత్రములు రచించుటలో దురుపయోగమౌతుంది అని పూర్వులు కలలో కూడా ఊహించి ఉండరు. **ఏ తంత్రమైతే మనుష్యులు, సమాజము యొక్క ఉన్నతికి దోహదపడుతుందో అది ఇప్పుడు వ్యతిరేకదిశలో, పూర్తి విరుద్ధ భావనలో మునిగితేలుతూ, అవ్యవస్థ, అరాజకత్వముల సాలెగూటిని అల్లుతోంది. ఇది గూఢచారీ వ్యవస్థయొక్క దౌర్భాగ్యమనే చెప్పాలి.**

ఏ కళ అయినా స్వయంగా తనకు తాను మంచిదీకాదు, చెడ్డదీకాదు. అది కర్త 'విషమును అమృతంగా మారుస్తున్నాడా లేక అమృతమును కాలకూటవిషంగా మారుస్తున్నాడా' అన్న అంశము మీద ఆధారపడి ఉంటుంది. ఇది సంపూర్ణంగా వ్యక్తి చింతన, నడవడి, కర్తవ్యముల మీదే ఆధారపడి ఉంటుంది. అసురత్వము ఎక్కడ ఉనికిలో ఉంటే అక్కడ అస్థిరతను, అశాంతిని రేకెత్తిస్తుంది. సదాశయము యొక్క గొంతు నులిమి చంపివేస్తుంది. సరిగ్గా దీనికి భిన్నంగా దేవత్వం చెడులో కూడా మంచిని దర్శిస్తుంది, అన్వేషిస్తుంది. ద్రోణాచార్యుడు దుర్యోధనుని యొక్క విద్యా కౌశలమును పరీక్షించే నిమిత్తము అతనిని 'ఒక సజ్జనుడిని వెతికి తెమ్మని' ఆదేశించాడు. లక్ష ప్రయత్నాలు చేసిన తర్వాత కూడ అతనికి ఒక్క సజ్జనుడు కూడా లభ్యమవ్వలేదు, పైగా అందరిలోనూ అతనికి చెడే కనిపించినది. అప్పుడు ద్రోణుడు యుధిష్ఠిరుడిని 'ఎవరైనా ఒక్క దుర్జనుడిని వెతికి తెమ్ము' అని ఆదేశించాడు. యుధిష్ఠిరుడు తిరిగినచోట తిరగకుండా వెతికినప్పటికి అతనికి ఒక్క దుర్జనుడు కూడా లభించలేదు. యుధిష్ఠిరునికి అందరిలోనూ సజ్జనత్వమే కనపడినది. ఈ మహాభారత కథ వాస్తవానికి రెండు భిన్నమైన ఆలోచనా విధానాలను, దృష్టికోణములను ఆవిష్కరిస్తుంది. అంతేకాక మనిషి వ్యక్తిగతమైన ఆలోచనావిధానమే ఏ వస్తువు, వ్యక్తి లేదా పద్ధతి యొక్క మంచిచెడుల నిర్ణయానికి దోహదపడుతుంది అన్న అంశమును తేటతెల్లము చేస్తుంది. **గుప్తచార వ్యవస్థ ఈనాడు ఈ దుష్టచింతన కారణంగానే కళంకితమౌతున్నది.**

**గుప్తరూపంలో విషయ సమీకరణ చేసే పద్ధతి కారణంగానే దీనిని 'గుప్తచర్యం' అని పిలుస్తారు. ఇదొక పవిత్ర సంస్థ. సదా దీని పవిత్రతను కాపాడుకోవటంలోనే మానవ కళ్యాణము దాగి ఉన్నది. గుప్తంగా సముపార్జించిన వ్యక్తి, సమాజము, దేశాల రహస్యాలను కేవలము ఉన్నతి, ప్రగతిల క్షేత్రంలోనే వినియోగించాలి తప్ప దీని ప్రయోగము ద్వేషము, పగ, ప్రతీకారముల రూపంలో సాగినట్లయితే సర్వత్రా హాని కలిగి, హాహాకారాల ప్రతిధ్వనులే వినిపిస్తాయి.**

*– అఖండజ్యోతి, మార్చి 2002*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## బంకించంద్ర

*బంకించంద్ర ఒక ప్రభుత్వోద్యోగి. ఆనాటి పరిస్థితులు ఆయన చేత "ఆనంద మఠం" అనే పుస్తకాన్ని రచింప చేశాయి. వందేమాతరం అనే జయఘోషను తొలిసారిగా వినిపింపచేసిన మహనీయుడు ఇతడే. ఈ నవల బానిసత్వపు బంధనాల నుండి దేశానికి ముక్తిని ప్రసాదించటం కొరకు ఒక సేనను రహస్యంగా తయారుచేసి, పోరాడుతూనే ప్రాణత్యాగం చేసిన దేశభక్తులైన సన్యాసుల కథ. ఈ నవలలో ఉన్నటువంటి వందేమాతరం అనే జయఘోష దేశనలుమూలల వ్యాపించి విదేశీ శాసకులను గడగడలాడించింది. ఇలాంటి ప్రయత్నం ప్రఖర ప్రతిభా సంపన్నులకే సాధ్యమవుతుంది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

క్రమబద్ధమైన జీవితాన్ని గడపటానికి కృషి చెయ్యాలి.

# గాయత్రీ సాధనతోపాటు సప్తశతి మంత్ర సాధన

ఆదిశక్తి యొక్క లీలాకథ పారాయణ, శ్రవణముల చేత మనిషి సమస్త సంకటముల నుండి విముక్తుడౌతాడు. సప్తశతి అతని మనోవాంఛితములను హస్తగతము చేస్తుంది. ఈ పావన కథా మర్మజ్ఞుడు మార్కండేయమహర్షి. ఆయన భగవంతుడు సదాశివుని, మాత భవానీల కృపాపాత్రుడైన వ్యక్తి. దేవాధిదేవుడు మహాదేవుని కృపయే మార్కండేయ మహర్షిని మృత్యుంజయుడిని చేసింది. శివుని వరదానము చేత ఆయనను మృత్యువు కనీసం స్పృశించలేకపోయింది. భగవానుడు మృత్యుంజయుని ఆశీర్వాదం వలననే మార్కండేయమహర్షి మృత్యుంజయుడయ్యాడు. ఆయన జీవన్మరణాల సమస్త రహస్యములను ఎరిగిన జ్ఞాని. భూత భవిష్య వర్తమానరూపంలో ఉన్న మూడు కాలఖండములు అఖండ రూపములో ఆయనకు కరతలామలకములు. ఆ కారణముగానే ఆ మహర్షికి కాలము మరియు దాని ప్రత్యేక కళల రహస్యజ్ఞానము ప్రాప్తించినది. సృష్టి యొక్క సృజనకు చెందిన రహస్యము ఆయన ఎరుగుదురు. జగన్మాత దయవలన మార్కండేయ మహర్షులవారు జీవజగత్తుల సూక్ష్మతతో పరిచితులు. బాల ముకుందుని కృపచేత వాటిని దర్శించుట వలన మహర్షికి ఆదిశక్తి యొక్క మాత మరియ మాయలనే రెండిటి స్వరూప జ్ఞానం బోధపడినది.

తత్త్వజ్ఞాని, మాతకు పరమభక్తుడు అయిన మార్కండేయ మహర్షి మాతా భగవతి కథను ప్రవచిస్తున్నప్పుడు భవానీమాతయే స్వయముగా శబ్దరూపు ధరించి ప్రకటీకృతమౌతుంది, వాగ్ధారగా ప్రవహిస్తుంది. అటువంటి పావన కథలో భగవతి భగవానుల రసోవైసః యొక్క పరమస్వరూపము ప్రకటీకరించబడుతుంది. ఆదిశక్తి లీలాకథ గత భాగంలో దుర్గాసప్తశతి మంత్రకావ్య ప్రథమ మంత్రోచ్చారణలో ఈ సత్యమే తెలియజేయబడినది. ఇందులో మహర్షి మరియు ఆదిశక్తి లీలాకథ యొక్క భావమయ సంబంధము స్పష్టీకరించబడినది. దీని తదుపరి మంత్రములో పరమజ్ఞానియైన మార్కండేయ మహర్షి ఇలా అన్నారు.

**ప్రథమ చరితమ్**

**ప్రథమో అధ్యాయః (మధు-కైటభ వధ)**

**సావర్ణిః సూర్యతనయో యో మనుః తథ్యతేఽష్టమః ।**
**నిశామయ తదుత్పత్తిం విస్తరాద్ గదతో మమ ॥ (1/1/2)**

భావార్థము : మేము విపులంగా వర్ణిస్తున్న 8వ మనువు అని చెప్పబడే సూర్యపుత్రుడైన సావర్ణి జన్మవృత్తాంతము యొక్క ఆ కథను వినుము.

ఆదిశక్తి లీలాకథ ఈ సూత్రములో అనేక పౌరాణిక సత్యములు, దార్శనిక, ఆధ్యాత్మిక రహస్యములు ఇమిడి ఉన్నాయి. వాటిని చింతన చేసినట్లయితే శ్రీదుర్గాసప్తశతి యొక్క ఈ శ్లోక మంత్రములో కొంగ్రొత్త గవాక్షములు తెరుచుకుంటాయి. నూతన ఆయామములు ఆవిష్కరింపబడతాయి. ఈ శ్లోకములో 8వ మనువు జన్మ వృత్తాంతమును విస్తారంగా ప్రవచించే విషయము చెప్పబడి ఉన్నది. మన్వంతరాధిపతిని మనువు అని పిలుస్తారు. పురాణ కథల వర్ణన ప్రకారము 14 మన్వంతరాధిపతులు 14 మంది మనువులు. పురాణాలలో ఈ 14 మంది మనువుల వివరణ ఈ విధంగా వర్ణించబడి ఉన్నది. 1) స్వాయంభువ, 2) స్వారోచిష, 3) ఉత్తమ, 4) తామస, 5) రైవత, 6) చాక్షుష, 7) వైవస్వత, 8) సావర్ణి, 9) దక్షసావర్ణి, 10) బ్రహ్మసావర్ణి, 11) ధర్మసావర్ణి, 12) రుద్రసావర్ణి, 13) దేవసావర్ణి, 14) ఇంద్రసావర్ణి లేక మౌత్య.

ముందు చెప్పినట్లుగా ఒక్కో మనువు ఒక్కొక్క మన్వంతరానికి అధికారిగా ఉంటారు. పౌరాణిక వర్ణనల ఆధారముగా 71 చాతుర్యుగములు అనగా 30 కోట్ల 67 లక్షల 20 వేల సంవత్సరముల మానవ సంవత్సరముల ఒక మన్వంతరకాలము అవుతుంది. ఇదే ఇంద్రుడు, సప్తర్షులు మరియు మనువుల అధికారిక కాలము. ప్రస్తుతము 7వ మన్వంతరకాలం నడుస్తున్నది. దీనికి రాజు లేక అధిపతి వైవస్వతుడు. ఆధ్యాత్మిక సాధన, అనుష్ఠానముల ప్రారంభకాలములో చేయబడే సంకల్ప మంత్రములో దీని వివరమంతా చెప్పబడుతుంది. **'ఓం విష్ణుర్విష్ణుర్విష్ణుః ఓం నమః పరమాత్మనే, శ్రీపురాణ పురుషోత్తమస్య శ్రీవిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్యా శ్రీబ్రహ్మణో ద్వితీయపరార్థే శ్రీశ్వేత వరాహకల్పే వైవస్వతమన్వన్తరే...॥** ఈ మన్వంతర కాలములోనే మనమందరము జీవిస్తున్నాము.

దీనికి అతి పురాతన మన్వంతరకాలాధిపతిగా స్వారోచిష మనువు ఉండేవారు. ఆయన అధికారకాలములో రాజా సురథుడు జగన్మాత ఆదిశక్తి ఉపాసన చేశాడు. తపః ప్రభావముచేత ఆయన భగవతి నుండి 8వ మన్వంతరమునకు అధిపతిగా ఉండే వరదానమును పొందాడు. ఆ వరప్రభావ కారణముచేత తరువాతి

**మనోమాలిన్యం భౌతిక ప్రవర్తనతో బహిర్గతమవుతుంది.**

అనగా 8వ మన్వంతరములో ఆయన సవర్ణ గర్భమునుండి సూర్య తేజస్సుతో జన్మించి, సావర్ణి అను పేరు గల 8వ మన్వంతరమునకు అధిపతి అవుతాడు.

ఇది ఒక పౌరాణిక సత్యమేకాక శ్రీదుర్గాసప్తశతి యొక్క ఈ ప్రథమశ్లోక మంత్రములో రహస్యమయ దార్శనిక, ఆధ్యాత్మిక రహస్యములు కూడ ఇమిడి ఉన్నాయి. వాటి అనుభూతిని చెందిన సాధకగణము తమ ఆత్మసాధనలో ఉన్నత ఉచ్చతర సోపానములను అధిరోహించగలరు. ఈ శ్లోకమంత్రములో రాజా సురథునకు భగవతి కృపతో సూర్యపుత్రుడు జన్మించుటయే అన్నింటికన్నా మహత్వపూర్ణమైన విషయము. **'సూర్య ఆత్మ జగతస్తస్థుషశ్చ'** అనగా సూర్యుడు ఈ సమస్త జగత్తుకు ఆత్మ అను వేదవాక్కు విఖ్యాతమైనది. జీవాత్మ ఈ విరాట్ ఆత్మ పరమాత్మ నుండి విముఖమై పోయింది. వాటి సంబంధము త్రెగి పోయింది. అందువల్ల జీవాత్మ అజ్ఞానాంధకారములో కూరుకు పోయింది. దానిని పలురకాల కష్టములు వివిధరూపములలో ఆవరిస్తున్నాయి.

మనిషి జీవితము పరివర్తన చెందినప్పుడే ఈ విముఖత దూరమౌతుంది. మానవుడు నూతన ఆధ్యాత్మిక జీవనమును పొంది ద్విజుడౌతాడు. దీనికొరకు ఆదిశక్తి జగన్మాత ఉపాసన చేయుట తప్పనిసరి. ఈ జగన్మాత ఆదిశక్తియే సూర్యతేజస్సు, వేదమాత గాయత్రి. గాయత్రీ మహామంత్రము 24 అక్షరములలో చతుర్వేదములలో గానము చెయ్యబడినది. గాయత్రీ ఉపాసన చేతనే జీవుని జీవితములోని చీకట్లు పటాపంచలైపోతాయి. నూతన అనుభూతులు పొంది అతను తనను తాను సూర్యభగవానుడు అనగా పరమాత్మ పుత్రుని రూపములో అనుభూతిచెందుతాడు. ప్రకృతి అతనిని అతని జీవనము యొక్క కాలఖండమునకు అధికారిని చేస్తుంది. అయితే భగవతి కృప లేకుండా ఇది జరుగుట సాధ్యపడదు. ఆమె కృపను పొందుటకు జీవుడు తన జీవితములో ఆదిశక్తి లీలాకథ పారాయణ, శ్రవణములను చేస్తూ భగవతి యొక్క మహామంత్రజపము ద్వారా ఆమెను ఆరాధించవలసి ఉంటుంది.

ప్రతి మనిషి జీవితములో ఈ సాధనాకాలమే మాత ఒడి అవుతుంది. సూర్యుని తేజస్సును, గాయత్రీ తపస్సును ధారణ చేయుటలో ఈ సవర్ణయే సమర్థురాలు. సవర్ణలో తప్ప ఈ సామర్థ్యము మరెవ్వరిలోనూ ఉండదు. నిజానికి ఈ సవర్ణయే సత్ప్రవృత్తుల, సత్కర్మల మరియు గాయత్రీ తపశ్చర్యకు ప్రతీక. ఏ జీవునకు ఈ సవర్ణమాత గర్భస్థానము లభించదో అతనెప్పటికీ సూర్య పరమాత్ముని పుత్రుడయ్యే సౌభాగ్యమును పొందలేడు. కేవలం మంత్రోచ్చారణ చేయుట, కర్మకాండలను ఆచరించుటతోనే సూర్య సాధన, గాయత్రీ సాధన సంపూర్ణమవదు. దీనికిగాను సత్ప్రవృత్తి మరియు సత్కర్మల కొరకు తపించవలసి ఉంటుంది. గాయత్రీ ఉపాసనతోపాటు సాధన, ఆరాధనల సమస్త విధి విధానములను పాటించవలసి ఉంటుంది. అప్పుడే సద్గుణముల యొక్క కృప లభిస్తుంది. సూర్యసాధకునికి సూర్యుడు లేక సవర్ణకు పుత్రునిగా అయ్యే గౌరవపూర్వకమైన అనుభవం పొందుతాడు.

ఇది ప్రతి జీవునకు పునర్జన్మ, అతని ఆధ్యాత్మిక జీవన శుభారంభము. ఈ నూతన జీవితము ఏవిధముగా లభించినది? ఆ విస్తారగాథ యథార్థమునకు జగన్మాత గాయత్రీమహామంత్ర సాధనా కథ. అది పరమ రహస్యమైనది, పరమ గోపనీయమైనది. ఈ రహస్యములను అందరూ చెప్పలేరు, అందరూ వినలేరు. వీటిని తెలుసుకొనుట కూడ పరమ ఆశ్చర్యకరము. ఈ తత్త్వమును బోధపరుస్తూ యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు ఆధ్యాత్మిక సప్తశతీరూప శ్రీమద్భగవద్గీతలో ఇలా అన్నారు.

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతిశృత్వాప్యేనం**
**వేద న చైవ కశ్చిత్ ॥ (2/29)**

ఎవరో ఒక అసామాన్యమైన మహాపురుషుడే ఈ ఆధ్యాత్మిక తత్త్వమును ఆశ్చర్యంతో చూస్తాడు, అలానే మరొక అసాధారణ మహా సాధకుడే దాని తత్త్వమును ఆశ్చర్యంతో వర్ణిస్తాడు. వేరొక విశేష పురుషార్థపరాయణుడైన సాధకుడు దీన్ని ఆశ్చర్యంతో వింటాడు మరియు మరెంతోమంది వినినప్పటికి దానిని తెలుసు కొనలేరు.

శ్రీదుర్గాసప్తశతిలో గాయత్రీ సాధన యొక్క రహస్యమయ ప్రసంగాల ఈ ఆశ్చర్యకరమైన వివరణనే ఆదిశక్తి పావనలీలాకథ యొక్క మర్మజ్ఞులైన మార్కండేయమహర్షి వినిపిస్తున్నారు. దీని యొక్క ఈ దార్శనిక మరియు ఆధ్యాత్మిక సత్యమేకాక ఈ శ్లోకమంత్ర మాంత్రిక సత్యం కూడ ఉన్నది. సాధనావిధాన అంతర్గతముగా ఈ వర్ణన చెయ్యబడినది.

### సాధనా విధానము

**వినియోగః ఓం అస్య శ్రీ "సావర్ణిః సూర్యతనయో" ఇతి సప్తశతీ ద్వితీయ మన్త్రస్య శ్రీ మార్కండేయ ఋషిః, భగవాన్ శ్రీ సూర్యనారాయణోదేవతా, హ్రీం బీజం, జ్యోతిః శక్తిః, ఛిన్నమస్తా మహావిద్యా, రజోగుణః శ్రోత్రజ్ఞానేన్ద్రియం, శాన్త రసః, వాక్ కర్మేన్ద్రియం, పఞ్చ స్వరం, భూతత్త్వం, విద్యాకళా, హ్రీం ఉత్కీలనం, సంక్షోభిణీముద్రా, మమజ్ఞాన భక్తి వైరాగ్య క్షేమ**

ముందు చూపుతో వ్యవహరించాలి.

స్థైర్యాయురారోగ్యభివృద్ధ్యర్థం శ్రీ ఆదిశక్తి మాతా గాయత్రి రూపేణా యోగమాయా భగవతీ మహాదుర్గా ప్రసాద సిద్ధ్యర్థం చ నమో- యుత ప్రణవ-వాగ్బీజ-స్వ బీజ లోమవిలోమ పుటితోక్త ద్వితీయ మన్త్రజపే వినియోగః ॥

**న్యాసః**

| కరన్యాసము | షడంగన్యాసము |
|---|---|
| ఓం ఏం హ్రీం అంగుష్ఠాభ్యాం నమః | హృదయాయనమః |
| ఏం నమోనమః తర్జనీభ్యాం నమః | శిరసేస్వాహా |
| సావర్ణిః సూర్యతనయో మధ్యమాభ్యాం నమః | శిఖాయై వషట్ |
| యో మనుః కథ్యతేఽ ష్టమః అనామికాభ్యాం నమః | కవచాయహుమ్ |
| నిశామయ తదుత్పత్తిం కనిష్ఠికాభ్యాం నమః | నేత్రత్రయాయ వౌషట్ |
| విస్తరాద్ గదతో మమ కరతలకరపృష్ఠాభ్యాం నమః | అస్త్రాయఫట్ |

**ధ్యానం**

**(ధ్యేయః సదా సవితృమణ్డల-మధ్యవర్తీ)**

భాస్వద్-రత్నాఢ్య-మౌలిః స్ఫురధర-రూచా రఞ్జితశ్చారూ కేశో।
భాస్వాన్యో దివ్యతేజాః కర కమలయుతః స్వర్ణ-వర్ణః ప్రభాభిః ॥
విశ్వాకాశాపకాశో గ్రహ-గణ సహితో భాతి యశ్చోదయాద్రౌ ।
సర్వానంద ప్రదాతా హరి-హర-నమితః పాతు మాం విశ్వ-చక్షుః ॥

**మంత్రం**

ఓం ఏం హ్రీం నమః సావర్ణిఃసూర్యతనయో
యో మనుః కథ్యతేఽ ష్టమః ।
నిశామయ తదుత్పత్తిం విస్తరాద్ గదతో
మమ నమో హ్రీం ఏం ఓం ॥

**1000 జపాత్ సిద్ధిః శక్రరాతిల ఘృతేన దశాంశ హోమః।**

గాయత్రీ మహామంత్రజపం 10,000

గాయత్రీ విధానేన దశాంశ హోమః ।

**10 మాలల గాయత్రి, 1 మాల సప్తశతీమంత్రము ।**

**ఈ విధంగా పదిదినములు అనుష్ఠించి తరువాత ప్రతి ఒక్క దానికి దశాంశముతో హోమము చేయాలి.**

**ఆధ్యాత్మిక ఫలశృతి :** సాధనా జీవన ప్రారంభము అనగా ఆధ్యాత్మిక నవజన్మ ప్రాప్తి

**లౌకిక ఫలశృతి :** సంతానప్రాప్తి

ఆదిశక్తి గాయత్రీమాత యొక్క లీలాగాథను చదువుతూ, శ్రవణము చేస్తూ ఉన్న శక్తిసాధకులు ఈ కథాక్రమములో మాత గాయత్రి రహస్యాత్మక సాధనాకోణములను నిరంతరము అనుభూతి చెందుతుంటారు. దీనితోపాటు వారు సప్తశతి మంత్రాలలో వేదజనని గాయత్రి యొక్క చమత్కారపూరితమైన శక్తులను అనుభూతి చెందుతారు. అనుభవజ్ఞులైన సాధకులకు కామనతో కూడిన సాధనలలో విధివిధానమునకు విశేష మహత్వమున్నదని తెలుసు. సప్తశతి మంత్రములు గాయత్రీ సాధన సుయోగము, సంయోగమును పొంది విశేషమైన ప్రభావశాలి మంత్రములుగా రూపొందుతాయి. కామనతో విధిపూర్వక అనుష్ఠానం చేసినప్పుడు కూడ అనుకున్న కోరిక ఫలించక పోవటమును మనము పలుమారులు చూస్తూనే ఉంటాము. ప్రబలమైన ప్రారబ్ధం వలన ఇలా జరుగుతుంది. అటువంటి స్థితిలో జగన్మాత సాధకులు, తసాధకురాంద్రు అయిన సంతానము తమ సాధనా ప్రయాసలను విడువరాదు. పైగా ఈ దిశలో నిరంతర ప్రయత్నము చేస్తూ వుండాలి.

*- అఖండజ్యోతి, జనవరి 2009*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## 1+1= 11

*మహారాష్ట్రలో జమీందారు భావు రఘునాథ. ఠాకూర్‌కు 13 సంవత్సరాల వయస్సులో మూడు సంవత్సరాల బాలికతో వివాహం జరిగింది. వారు పెద్దయిన తర్వాత బాల్య వివాహాలు వ్యతిరేకించారు. వారు తమ పుత్రిక సరళను యం.ఎ. వరకు చదివించారు. ఆమె మహిళా జాగృతికై పనిచేయడానికి నిశ్చయించుకున్నది. మహర్షి కర్వే మహిళా విశ్వ విద్యాలయంలో అధ్యాపకురాలిగా చేర్పించి, వివాహం గురించి ప్రస్తావన వచ్చినప్పుడు మహిళా విద్యకు సహకరించే వారినే పెండ్లాడుతానని షరతు పెట్టింది. అదృష్టవశాన ఇండోర్‌కు చెందిన ప్రేమ్‌నాయక్‌తో వివాహం జరిగింది. ఇద్దరు కలసి మహిళా జాగృతికి 30 కన్యా విద్యాలయాలు ప్రారంభించారు. వీటిలో 22000 మంది కన్యలు చదువుకున్నారు. దీనినే ఒకటి ఒకటి కలిస్తే పదకొండు అవటం అని అంటారు.*

- ప్రజ్ఞాపురాణం నుండి

**చెయ్యవలసిన పనులను పథకం ప్రకారం చేసుకోవాలి.**

# భూకంపాలు ఎందుకు, ఎప్పుడు వస్తాయి?

జడమయంగా కనిపించే ఈ జగత్తు యొక్క రహస్యము అద్భుతమైనది, ఆశ్చర్యకరమైనది. దీని ప్రతి ఒక్క క్రియాకలాపం విస్మయకరమైనదే! దీని రహస్యములు దుర్భేధ్యములు! అయితే ప్రకృతిని తల్లిగా భావించి పెరిగి పెద్దవారైన ఋషులు, మంత్రద్రష్ట వేత్తలు దీని లోతుల లోలోపలి చరమసీమలను గురించి కొన్ని గంభీరమైన విషయములు తెలుసుకున్నారు. ప్రకృతిమాత గర్భం నుండి జన్మించి, పోషించ బడి, ఉచ్ఛస్థితిని సాధించిన ఋషులు దీనిని గూర్చి కొన్ని అంశములను అవగాహన చేసుకున్నారు. వారి ఆ అంతర్బోధే ఋగ్వేదంలోని ఋక్కులు, ఉపనిషత్తులలోని మంత్రములు, దర్శన శాస్త్ర సూత్రములు, జ్ఞానవిజ్ఞానమునకు చెందిన అనేక గ్రంథముల యొక్క లెక్కకుమీరిన పుటలలో, పుస్తకాలలో దర్శనమిస్తూ కాంతులీనుతున్నాయి. జీవజగత్తుల సమస్త రహస్యములను వారు సూత్రసంకేతాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ క్రమములోనే వారు భూకంప విపత్తు, ఆపదల గురించిన సమాచారమునంతా గ్రహించుటలోను, జటిలమైన, ఆకస్మికంగా సంభవించే సంఘటనలతోనూ సుపరిచితులే! వీటన్నిటి గురించి కూడా వారికి పూర్తి అవగాహన, జ్ఞానము ఉన్నది.

అతి ప్రాచీనకాలంలో కదలలేని, భీమకాయములు కలిగిన పర్వతములు అనంతాకాశంలో ఆనందపూర్వకంగా ఎగురుతూ, చరిస్తూ ఉండేవి. అంతేకాక స్వేచ్ఛావిహారమును పూర్తిచేసుకొని తిరిగి మరల తమ స్వస్థానములలో ప్రతిష్ఠితమయ్యేవి. అయితే అవి అప్పుడప్పుడు ఎగురుతూఎగురుతూ భూమి మీద పడిపోయేవి. తత్కారణముగా అపారమైన బరువుచేత భూమి కంపించేది. భూవ్యవస్థ ఛిన్నాభిన్నమయ్యేది. పృథ్వి యొక్క కలతతో కూడిన వినమ్ర ప్రార్థనను ఆలకించిన ప్రజాపతి బ్రహ్మ ఇంద్రుడిని 'పర్వతాల రెక్కలను ఖండించుము!' అని ఆదేశించాడు. ఇంద్రుని చేత రెక్కలు ఖండించబడిన పర్వతరాజములు ఎగురుటకు అసమర్థములు, శక్తిహీనములై తామున్నచోటుననే స్థిరంగా నిలిచి పోయాయి. అయినప్పటికి అవి వాయువు, అగ్ని మరియు జలములతో కలసి భూమిని కంపింపజేస్తూనే ఉన్నాయి. ఋగ్వేద ఋక్కులలో భూకంపముల యొక్క వైజ్ఞానికతను గురించిన సంకేతములు లభిస్తాయి. ఈ ఋక్కులలో నిహితమై ఉన్న సంకేత సూత్రాల వలన 'మన ప్రాచీన ఋషులు కేవలం అంతర్యాత్ర యొక్క అధ్యాత్మజ్ఞాన ప్రణీతలేకాదు, మీదుమిక్కిలి వైజ్ఞానిక సృజేతలు కూడా!' అనే విషయము తేటతెల్లమౌతున్నది. వారికి భూకంపముల గురించి లోతైన జ్ఞానమున్నది.

ఈ సందర్భంలో బల్లాల్‌సేన్ రచించిన ప్రఖ్యాత గ్రంథము 'అద్భుతసాగర్'లో 'ఇంద్ర, అగ్ని, జల, వాయువులు ధరిత్రిని తమ శక్తులచేత సంపూర్ణంగా ప్రభావితము చేస్తాయి. వరుసగా తూర్పు, దక్షిణ, పడమర, ఉత్తర దిశలలో కంపనములు రేకెత్తిస్తాయి' అనే వర్ణన మనకు లభ్యమౌతున్నది. పరాశర మహర్షి కూడా ఈ తథ్యమునే స్పష్టంగా వెల్లడించారు. ఈ ఋషి గ్రహణములు, అంతరిక్ష అలజడులతో పాటు భూకంప ఉత్పత్తి అనగా భూకంపనము ఎలా పుడుతుంది అనే సిద్ధాంతమును కూడా ఆవిష్కరించారు. ఈ రకంగా ప్రాచీన గ్రంథాలలో కాలగతి మరియు ఆనాటి నక్షత్ర సంరచనను ఆధారంగా చేసుకొని పేర్కొన్న నాలుగు రకములైన భూకంపనముల వర్ణన లభ్యమౌతున్నది. అశ్వని, మృగశిర, చిత్త, హస్త, పునర్వసు, స్వాతి, ఉత్తరఫల్గుని నక్షత్రములు ఉన్నప్పుడు రాత్రియొక్క చివరిజాములో లేదా ప్రాతః కాలపు మొదటి జాములో ఉత్తరదిశలో భూకంపనము వచ్చినట్లయితే అది వాయుమండలీయ భూకంపము అని పిలువ బడుతుంది. అద్భుతసాగర్ పుస్తకంలో ఇదేవిధమైన వర్ణన లభిస్తుంది. ఈ గ్రంథవర్ణన ప్రకారం దక్షిణ, తూర్పు, పశ్చిమ దిశలలో పుట్టిన భూకంపములు వరుసగా అగ్ని, ఇంద్ర, వరుణ మండల కంపనములుగా విభజించబడినవి.

ప్రాచీన భారతీయ గ్రంథాలలో భూకంపం యొక్క ఈ మండలీకరణ లేదా విభజన గొప్ప వైజ్ఞానిక పద్ధతిలో ప్రతిపాదించ బడినది. వీటి సూక్ష్మ అధ్యయనము, అన్వేషణలతో విభిన్న రకాలైన భూకంపములు వేర్వేరు క్షేత్రాలలో వస్తాయి అనే విషయము తెలుస్తుంది. బృహత్‌సంహిత ప్రకారము సౌరాష్ట్ర, కురు, మగధ, దశార్ణము, మత్స్య ప్రాంతములు వాయుమండల ప్రాంతాలు, యవన, దండక, సాళ్వ, సౌవర్ధన్, పులింద, విదేహ, నల, దరద, అంగ, వంగ, అవంతి, మాలవ్య, త్రిగర్త, సౌవీర, యౌధేయ, క్షుద్రక, శివిక, మద్రక, శక, కాంభోజ, బాహ్లీక, గాంధార, కళింగ, శబర, మయేద్ధ, తంగణలు అనునవి వాయు మండల ప్రాంతాల పేర్లుగా అద్భుతసాగర్ పుస్తకంలో చెప్పబడ్డాయి. బృహత్ సంహితలో అశ్మకము, అనగ, బ్రాహ్లీకము, తంగణ, కళింగ, వంగ, ద్రవిడ, శబరలు, అద్భుతసాగర్ కావ్యంలో పులింద, యవనము, ఓఢ్ర, అవంతి, ఇక్ష్వాకు, కులూత, తుషార,

**పనుల ప్రాధాన్యతలను ముందే నిర్ణయించుకోవాలి.**

శివిక, త్రిగర్త, విదేశ, సౌరాష్ట్ర, మధ్యదేశము మరియు దాశార్ణములు అగ్ని మండల ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. బృహత్ సంహితలో కాశి, యుగాంధర, పైరావ, కిరాత, కీరా, అభిసార, హల, మద్ర, అర్బుద, సౌరాష్ట్ర మరియు మాళవ ఇంద్ర మండల క్షేత్రాలుగా చెప్పబడ్డాయి.

ఈప్రకారంగా భూకంపనముల వర్గీకరణ జరిగిన తదుపరి పురాతన భారతీయ విద్వాంసులందరు ఒక విషయములో ఏకాభిప్రాయమున కొచ్చారు. అదేమిటంటే 'భూకంపము ఒక అతిథివలె ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ సమయములోనైనా రావచ్చును. అందువలన అన్నిరకాల భూకంపములు అంటే అన్నిటి సమ్మిళితమైన కంపనము కూడా సంభవమే!' పరాశరుడు ఇలాంటి సమ్మిళిత భూకంపముల గురించి ప్రస్తావించాడు. అవి 1) వాయు-అగ్నిమండల, 2) వాయు-ఇంద్రమండల, 3) వాయు -వరుణ మండల, 4) అగ్ని-ఇంద్రమండల, 5) అగ్ని-వరుణ మండల, 6) ఇంద్ర-వరుణ మండల.

వాయు-అగ్ని మండలములు అనేవి కురు, సాళ్వము, మత్స్య, నిషాధ, పుణద, ఆంధ్ర, కళింగ, వింధతలలో చోటు చేసుకుంటాయి. వాయు-ఇంద్రమండల కంపనములు ప్రాచ్య, శక, చైనా, పహలవా, యౌధేయ, యవన, మగధలలో కనపడతాయి. వాయు-వరుణ మండల క్షేత్రములు అవంతిక, పులింద, విదేహ, కాశ్మీరము, దరద్. అగ్ని-ఇంద్రమండల ప్రాంతములు ఇక్ష్వాకు, పాటచరం, ఆమీరం, చైనా, మరుకచ్చలు. అగ్ని-వరుణమండల కంపనములు గోనార్ద, అంగనారాజయ, తటీయ భూభాగాలలో పెచ్చరిల్లుతాయి. ఇంద్ర-వరుణమండల ప్రాంతాలు కాశీ, అభిసార, అత్తృత, కచ్ఛద్వీపాలు.

1025వ సంవత్సరములో చాళుక్యరాజు జయసింహుడు ఈ విషయమునే ప్రస్తావిస్తూ చాముండరాయులు రచించిన 'లోకోపకారము' అను కన్నడ పుస్తకమును చదివాడు. ఈ దుర్లభ గ్రంథములో రచయిత 8 శ్లోకాలలో 4 రకాల భూకంపనములను గురించి వివరిస్తూ వాటి వివేచన చేశాడు. ఈ విశ్లేషణను అనుసరించి వాయుమండల భూకంప ప్రభావక్షేత్రాలుగా కురు, మగధ, ద్రవిడ, కుంతల ప్రాంతాలు వస్తాయి. చాముండరాయుల భావానుసారము ద్రవిడభూమి తమిళదేశం అని చెప్పబడినది. అగ్నిమండల భూకంపములు కేవలము అంగ, వంగ, కళింగ, కేరళ, బాహ్లీక, ద్రవిడ క్షేత్రాంతర్గత ప్రాంతాలలో చోటు చేసుకుంటాయి. ఈవిధంగానే ఇంద్రమండల భూకంపములు కేవలము సౌరాష్ట్ర, అభిసారములకు మాత్రమే పరిమితమై ఉంటాయి. వరుణమండల కంపనాలు విదేహ, గోవర్ధన, నిషాద మరియు బీహారులలో ఉత్పన్నమౌతాయి.

భారతీయ విద్వాంసులు భూకంపముల యొక్క విస్తృత వినాశకరమైన ప్రభావం గురించి కూడా వ్రాశారు. ఈ ప్రభావము చేత వేర్వేరు మండలాల యొక్క భూకంపాలు వేర్వేరుగా ఉంటాయి. వాయుమండల భూకంపాల కారణంగా భవనాలు, విహార ప్రాంతాలు, మందిరములు, గృహములు, ద్వారములు మరియు కోటలు సర్వనాశనమౌతాయి. భూకంపనము పొడసూపే వారం రోజుల కంటే ముందే వచ్చే పెను తుఫానులు ఈ భూకంపనములు సంభవిస్తాయి అను విషయమును సూచిస్తాయి. ఈ ప్రకారంగానే అగ్నిమండల భూకంప ప్రభావము నగరాలు, పల్లెలలో కనపడుతుంది. తత్కారణంగా విస్తృతరూపంలో చెలరేగి వ్యాపించే మంటల గురించి, నదులు, ఇతర జలప్రాంతాలు ఎండి పోతాయి అనే విషయము గురించి చెప్పబడినది. ఇంద్ర మండల భూకంపములతో వర్షములో హెచ్చుతగ్గులు పొడ సూపుతాయి, క్రిమి కీటకాదుల నివాసములు నాశనమవుతాయి. వరుణ మండల భూకంపములు నదులు, సముద్రతీర ప్రాంతాలలో నివసించే మానవుల జీవితములో భీకర రీతిలో విధ్వంసమునకు కారణ భూతమౌతాయి.

భార్గవీయ మను పేరు గల అతి ప్రాచీన గ్రంథములో భూకంప తీవ్రత గురించిన సంకేతాలు ఇవ్వబడినవి. భూకంప తీవ్రత అనేది భూకంప వర్గీకరణకు మూలాధారంగా తీసుకొన బడినది. ఈ గ్రంథ వివరాల ప్రకారం వాయుమండల భూకంపనముల ప్రభావము 200 యోజనముల వరకు ఉంటుందని చెప్పబడినది. అగ్ని, ఇంద్ర, వరుణమండల ప్రభావ క్షేత్రము వరుసగా 90, 80, 70 యోజనములు ఉంటుందని భావిస్తారు. వరాహమిహిరుని ప్రకారము భూకంప తాండవనృత్య ప్రభావ క్షేత్రములు ఇంతకంటే ఎక్కువగానే ఉన్నాయి. ఆయన లెక్కల ప్రకారము వాయుమండలము 200 యోజనాలు, వరుణ మండలము 180 యోజనములు, ఇంద్రమండలము 160 యోజనములు మరియు అగ్నిమండలము 110 యోజనములు వ్యాపిస్తుంది. ఒక యోజనము=3 మైళ్ళు లేదా 9.6 కి.మీ.కు సమానము. ఈ ఆధారంగా వాయుమండల భూకంప ప్రభావక్షేత్ర వ్యాసార్థము 1920 కి.మీ లుగా భావించవచ్చును. 1896లో అస్సాము, 1934 లో బీహార్‌లో సంభవించిన భూకంప ప్రభావ క్షేత్రములు వరుసగా 1440, 1280 కి.మీలుగా గుర్తించబడ్డాయి. అందువలన పురాతన గ్రంథాలలో వర్ణించబడిన వాయుమండల భూకంపముల తీవ్రత రెక్టర్‌స్కేల్ అనగా భూకంప సూచిక మీద

**ప్రతి ఒక్కరు తమ కాలం ఎక్కడ ఎలా వృథా అయిపోతున్నదో సూక్ష్మంగా పరిశీలించాలి.**

6.8 తో సమానము. ఆధునిక వైజ్ఞానికుల అభిప్రాయము కూడా 5 లేక అంతుకుమించిన భూకంపము వల్లనే అపార జన, ధన నష్టములు వాటిల్లుతాయి అనే విషయమునే బలపరుస్తున్నది.

ఆధునిక భూకంప విజ్ఞానము ఒక్కసారిగా, అకస్మాత్తుగా విరుచుకుపడే ఈ విపత్తుని గురించి ముందుగా చెప్పలేకపోతున్నది. అయితే మన పరమపూజ్య మనీషులు చెప్పినవి, అలాగే ధర్మ గ్రంథాలలో వీటిని గురించిన భవిష్యవాణుల సుస్పష్ట సంకేతాలు కానవస్తాయి. వాటిని అనుసరించి భూకంపము, భవిష్యగర్భంలో దాగి ఉన్న భీషణమైన దుర్ఘటనను వెలుగులోకి తెస్తుంది అనే విషయం అర్థమౌతుంది. ఋషులకు వీటి భవిష్య దర్శనము జరుగుతుంది. పురాతన వివరణలలో భూకంపాలను రాజు యొక్క మృత్యువు, యుద్ధము, మహమ్మారి యొక్క భీషణ విన్యాసముల యొక్క అపశకునముల రూపంలో చిత్రీకరించారు. వరాహమిహిరుడు బృహత్‌సంహిత చతుర్థ అధ్యాయములో స్పష్టంగా ఇలా చెప్పారు. 'చంద్రుని బాహ్య పరిధి దక్షిణ ఉత్తర దిశలో వ్యాపించి ఎద్దుబండి ఇరుసు లేక కాడి ఆకారంలో దర్శన మిచ్చినట్లయితే భూకంపము వస్తుంది.' 'ఒకవేళ గ్రహణ సమయములో తీవ్రగాలులు చెలరేగితే, ఉల్కాపాతము జరిగితే, ధూళితో కూడిన తుఫాను విరుచుకుపడితే, గాఢాంధకారము అలముకుంటే, ఆకాశంలో మెరుపులు కనిపించి పిడుగులు పడితే భూకంపము వస్తుందనే విషయమును అవి సూచిస్తాయి' అని ఆయన పంచమాధ్యాయములో వర్ణించారు. పురాతనంగా ఉన్న ఋషులు అభిప్రాయమును అనుసరించి 24 నెలలలోపు చోటు చేసుకునే రెండు గ్రహణాల మధ్యలో ఒకటి లేదా రెండు భూకంపములు వచ్చే అవకాశం ఉన్నది.

పరాశరమహర్షి అభిప్రాయమును అనుసరించి 5000 సంవత్సరాల కాలవ్యవధిలో కనపడే చలకేతు అను పేరుగల తోకచుక్క భూమిమీద కంపనమును ఉత్పత్తిచేసి, మధ్యదేశములోని జనసాంద్రత అధికంగా గల ప్రాంతాలను నాశనము చేస్తుంది. ఇదేవిధంగా 'ఫలానా సమయము అని నిశ్చయంగా చెప్పలేని లేక అనిశ్చిత వేళలో ప్రకటితమయ్యే తోకచుక్క కూడా భూకంపమునకు కారణమౌతుంది' అని ఏనాడో చెప్పారు. ఐదవ పురాణము అని చెప్పబడే మహాభారతములోని ఉద్యోగపర్వము, ద్రోణపర్వము, శల్యపర్వము మరియు సభాపర్వములలో కూడా భూకంపముల గురించిన భవిష్యవాణి సంకేతాలు లభ్యమౌతాయి. ఈ విషయమును గురించి ఆధునిక విజ్ఞానమునకు ఏమీ తెలియదు. భూకంపదేశము అని చెప్పబడే జపాన్‌లో వీటిని గూర్చి భవిష్యవాణి చెప్పటకు 'ఎర్త్‌క్వేక్ ఎసెస్‌మెంట్ కమిటి' అనే ఒక సంఘము ఏర్పడినప్పటికి అది పెద్దగా ఏమి ఉపయోగపడలేదు. లేకపోతే పెద్దవి మరియు సుదీర్ఘమైన భూకంపముల యొక్క చారిత్రక విషయములను ప్రక్కన పెట్టినప్పటికి గడచిన దశాబ్ద కాలంలో లాతూర్, ఉత్తరకాశి, ఇరాన్, చమోలీ, జబల్‌పూర్ మరియు భుజ్‌లలో వెల్లువెత్తిన భూకంపాలలో కొన్నిటిని అప్రమత్తతతో ఉంటే ఎదుర్కొనగలిగేవారమే. కానీ ఈ ప్రాకృతిక ఆపదలు ఎలా కలుగుతాయి అనే రహస్యాలను ఆధునిక విజ్ఞానము తెలుసుకొనలేకపోయింది. అలాగే అధునాతన మానవీయ మనస్సు గ్రహించలేకపోయింది. వీటిని గూర్చి తెలుసుకొనుటకు మన ప్రాచీన ఋషులు, మనీషుల సూత్ర, సంకేతాల రహస్యాలను సరియైన రీతిలో ఛేదించినప్పుడే మనకు ఏదైనా సహాయము లభ్యమౌతుంది.

**'పుత్రోఽహం పృథివ్యా' అనే వేదమంత్రమును హృదయంగమము చేసుకుంటే ఈ ప్రాకృతిక ఆందోళన, ప్రళయ భయంకరమైన దుర్ఘటన నుండి మనము సురక్షితంగా బయట పడగలము. దీనికొరకు మనము ప్రకృతిమాత ఒడిలో ఆమె సంతానమువలె ఒదిగిపోవాలి. భూమాత కప్పుకున్న పచ్చని తివాచీని, స్వచ్ఛమైన వాతావరణమును తిరిగి దివ్యంగాను, పవిత్రంగాను నిర్మించుటకొరకు సర్వస్వమును సమర్పణ కావించు కొనవలెను. ఈ ప్రయత్నము, పురుషార్థముల చేత మనిషి భూకంపము అనే ఆపద నుండి తనను తాను రక్షించుకొనగలడు.**

*- అఖండజ్యోతి, మే 2003*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## ధర్మం

*రావణుని మిత్రుడైన వాలి యొక్క పుత్రుడు అంగదుడిని రాముడు తన దూతగా లంకకు పంపడం జరిగింది. రావణుడు "అంగదా! నీ తండ్రిని చంపిన వానికి సహాయం చేస్తూ నీ తండ్రి మిత్రుడను, పితృ సమానుడను అయిన నాతో విరోధిస్తున్నావా?" అని ప్రశ్నిస్తాడు. దానికి అంగదుడు పక పక నవ్వి రావణా! అసలైన ధర్మానికి నిర్వచనం అధర్మంతో పోరాడి దానిని నిర్మూలించడమే. ధర్మ స్వరూపుడైన శ్రీరాముడు ధర్మ విహీనులైన వారితో పోరాడక తప్పదు. నా తండ్రే అయినా, తండ్రిలాంటి తండ్రి మిత్రుడవైనా, ధర్మ విహీనులై నప్పుడు వ్యతిరేకించక తప్పదు కదా! అని ఆవేశంతో పలికే సరికి రావణుడు ఖిన్నుడై బదులు పలకలేకపోతాడు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నిర్విరామ కృషి చెయ్యాలి.**



# గురుదేవుల సుదీర్ఘయాత్ర-1

## ముందుమాట

ఏప్రిల్ 10, 1984 శ్రీరామనవమి. గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య పూర్తి ఏకాంతములోకి వెళ్ళారు. ప్రజలను కలుసుకోవటం నిలిపివేశారు. సాధకులు మరియు కార్యకర్తలు (స్వచ్ఛంద సేవకులు) అప్పటివరకు గురుదేవులను భౌతికంగా కలసికొని ప్రేరణ పొందెడి అవకాశం ఆగిపోయింది. ఊహించని గురుదేవుల ఈ నిర్ణయం మమ్ములనందరిని మూగవారిని చేసింది. అప్పటివరకు ఎడతెరపి లేకుండా శక్తికొలది గాయత్రీ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, కార్యక్రమాలతో దేశమంతటా ప్రయాణిస్తూ ఉన్నారు గురుదేవులు. వెంటనే ఈ ఏకాంతం తరువాత ఏమి జరుగుతుంది? అని అందరిలో ఉత్కంఠ. "మానవులలో దేవత్వం ఉదయింప జేయుట మరియు భూమిపై స్వర్గావతరణ సాధనకై ఏ గురువు దిశానిర్దేశంలో కనుసన్నలలో అప్పటివరకు సాధన చేస్తున్న మేమందరం ఆయన భౌతిక సంపర్కంతో పొందే స్వర్గానుభూతికి దూరము అయినాము. ఆయన మార్గదర్శనం మాకెలా లభిస్తుంది? భౌతికంగా ఆయనకు దూరమై మేము ఏమి చేయగలం? కాని ఈ సందిగ్ధావస్థ ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆ సందిగ్ధావస్థ ఉన్నంత కాలం మేము భయంతో కాలం గడిపాం. తన ఏకాంతానికి గురుదేవులు కారణం చెప్పనందున మేము ఎంతో ఉద్విగ్నానికి లోనైనాం. అప్పుడు మా అందరికి ధైర్యాన్ని, మార్గదర్శనాన్ని అందిస్తూ గురుదేవులు ఒక సందేశాన్ని పంపారు. ఆ సందేశసారం "అప్పటివరకు భౌతికంగా పనిచేసిన గురుదేవులు, క్రమక్రమంగా సూక్ష్మ శరీరధారులు అవుతారు. వారి భౌతిక శరీరం - సూక్ష్మ రూపం దాల్చుతుంది. రానున్న ఈ మార్పులకు భయపడవలసిన లేక నిరుత్సాహపడవలసిన అవసరం లేదు. భౌతిక శరీరంతో చేయగల పని కన్నా వెయ్యి రెట్లు అధిక ప్రమాణంలో సూక్ష్మ శరీరంతో చేయగలరు". ఈ అభయం ఇచ్చినది ఒక సామాన్య వ్యక్తి కాదు. ఒక మహాపరిణతి చెందిన సిద్ధ పురుషుని నుండి వచ్చినది, కోటానుకోట్ల మందిని ప్రేరేపించిన మహా మనీషి నుండి వచ్చింది.

అసాధ్యముగా కన్పిస్తున్న యుగపరివర్తన ప్రక్రియ, సూక్ష్మీకరణ సాధన ప్రయోగంతో సుసాధ్యం కాగలదనే భరోసాను మా అందరికి అందించారు పూజ్య గురుదేవులు. మహాశివుని ప్రథమగణాలకు ప్రతిరూపాలైన పంచవీరభద్రులు ఈ సూక్ష్మీకరణ సాధనతో ప్రత్యక్షమయ్యెదరు, వశమయ్యెదరు. పురాణ గ్రంథాల వర్ణన ప్రకారం, పంచవీరభద్రులు శివుని 5 రూపాలకు ప్రతీకలు మరియు శివుని సర్వశక్తులను కలిగి ఉన్నవారు. గురుదేవులు చెప్పుచున్న సూక్ష్మీకరణ సాధన ద్వారా పంచ వీరభద్రుల సాక్షాత్కరింపజేసికొనుట అనేది ఒక మానసిక చేతనత్వ ప్రక్రియ. గురుదేవులు సామాన్యులుగా కన్పిస్తున్న సాధకులు మరియు కార్యకర్తలకు అసామాన్యమైన ప్రతిభాపాటవాలను అందించి, యుగపరివర్తన లక్ష్యాలను సాధింపచేస్తారు. ఈ భరోసాను గురుదేవులు తన ప్రవచనాల ద్వారా మరియు వ్యాసాల ద్వారా పరిజనులకు అందించారు. పరిజనుల అంతఃచేతన గురుదేవుల సందేశాలను నేరుగా అందుకొనే స్థాయికి ఎదుగగానే బాహ్యమైన గురుదేవులు మార్గదర్శనంతో కాని లేక వారి భౌతిక స్పర్శతో కాని పనిలేదు.

కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్ప గురుదేవులతో నేరుగా సంప్రదించుట నిషేధించడమైనది. ఇట్టి సమయంలో తాంత్రిక విద్యలో నిష్ణాతుడైన ఒక తాంత్రికుడు గురుదేవుల ద్వారా మంత్ర దీక్ష పొందుటకై శాంతికుంజ్ వచ్చారు. గురుదేవులు తమ మౌనాన్ని విడచిపెట్టగానే వారిని దర్శించు కొనవలెనని ఎదురు చూస్తున్నాడు. అతని స్వానుభవం విలక్షణంగా ఉంది. మాటల సందర్భంలో గురుదేవులు సాక్షాత్తు శివుని ప్రతిరూపమేనని తన అనుభవాన్ని వెల్లడించారు. "మీరు ఇంకేమి చూశారు? అనుభవంలోనికి తెచ్చుకున్నారని అడుగగా" నేను కలసిన నిజమైన యోగులందరు గురుదేవుని గురించి గొప్పగా చెప్పారు" అన్నాడు ఆ సాధకుడు. "నా అంతరాత్మ నాకు చెప్పుచున్నది. ఇట్టి గొప్ప చైతన్యవంతమైన అవతార ఆత్మలు భౌతికస్థితిలో కన్నా, సూక్ష్మరూపములో అనేక రెట్లు పనిని చేయగలవు. "ప్రస్తుతం యుగపరివర్తన ప్రక్రియ ప్రారంభమైనదని బహు కొద్దిమందికే తెలుసు. కొద్ది సంవత్సరాలలోనే గురుదేవుల శక్తి ఎంతో వేగంగా దైవీశక్తితో కూడిన విద్యుత్తు ప్రవాహంగా మారి యుగపరివర్తన ప్రక్రియ వేగాన్ని పుంజుకుంటుంది. గురుదేవుల స్థూల శరీరాన్ని విడిచిన తదుపరి మాత్రమే దీని ప్రభావాన్ని భౌతికంగా చూడగలం. వేలకొలది సామాన్య పరిజనులు అసామాన్యరీతిలో పనిచేయుట ప్రారంభిస్తారు. వీని ఫలితాలు సమాజాన్ని మరియు దేశాన్ని బలోపేతం చేస్తాయి. ఊహకందని అభివృద్ధి పథంలో పయనింప జేస్తాయి. గాయత్రీ జయంతి జూన్ 2, 1990 గురుదేవులు తన

**నిరాశావాదులు తమ శ్రమను ఇతరులు దోచుకుంటున్నారని భావిస్తారు.**

భౌతిక శరీరాన్ని విడిచిపెట్టారు. గురుదేవుల పార్థివ కాయానికి శ్రద్ధాంజలి ఘటించు నిమిత్తం దక్షిణ భారతదేశం నుండి వచ్చిన ఒక సిద్ధ పురుషుడు గురుదేవుల గురించి "రానున్న యుగానికి ప్రధాన నాయకుడు" అని ప్రస్తుతించారు. దీనిని మీరు ఏ ఆధారంతో చెప్తున్నారని ప్రశ్నించగా "ఇచ్చట గుమికూడిన ప్రజాసంఖ్యను ఆధారంగా చేసుకొని ఆయన ప్రాబల్యాన్ని అంచనా వేయరాదు. రానున్న కాలములో కోట్ల మంది ప్రజలు ఆయన ఆలోచనలను, గ్రంథాలను, పనులను ఆదరించెదరు. వారి బోధనలను తమ జీవితాలలో అనుకరిస్తారు" అన్నాడు. 1986-1990 మధ్య కాలంలో గాయత్రీ పరివార్ ఎదుగుదలను గమనిస్తే సాధకుని భవిష్యవాణి నిజమేనని అనిపించక మానదు. గత 5-6 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధికరమైన పనులు వారికి తెలిసి ఉండకపోవచ్చు. ఆయన తన అంతః చేతనత్వముతో దర్శించి భవిష్య వాణిని విన్పించాడు. ఈ కాలంలో జరుగుచున్న పరివర్తనకు గాయత్రీ పరివార్ సజీవ ఉదాహరణ.

గురుదేవులు తన భౌతిక శరీరంతో ఉన్న సమయం 1988లో ప్రారంభించిన యుగసంధి మహాపురశ్చరణ సాధన ద్వారా అనేక మంది పరిజనులను యుగ సాధనలో పాల్గొనేలా చేశారు. గురుదేవులు భౌతిక శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత వందనీయ మాతాజీ సంస్థ కార్యకలాపాలను తన అధీనంలోనికి తీసుకున్నారు. తదుపరి సంవత్సరాలలో సంస్థ సాధించిన విజయాలను అవలోకించి, ఆహ్వానమున్నా లేకున్నా అనేక మంది భక్తులు దేశవిదేశాల నుండి శాంతికుంజ్‌కు విచ్చేయుటను గమనించవచ్చు. గురుదేవుల మహాప్రయాణం చేసిన సంవత్సరం కాలంలో వారు సూక్ష్మశరీరం ద్వారా ఆశ్చర్యాన్ని గొలిపెడి ఈ క్రింది పనులను అత్యంత ప్రతిభావంతంగా పరిజనులతో చేయించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో 6 దీపయజ్ఞాలు శ్రద్ధాంజలి సమారోహం (గురుదేవులకర్పించే శ్రద్ధాంజలి ఉత్సవం) మరియు ప్రతిజ్ఞ తీసికొనే ఉత్సవం రెండూ శాంతికుంజ్‌లోనే జరిగాయి. 1992 నుండి అశ్వమేధ యజ్ఞాల పరంపర ప్రారంభం, వీనిలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనుట వగైరాలను ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. వీటన్నింటిలో గురుదేవులు భౌతికంగా పాల్గొని గాయత్రీ పరిజనుల పనులను, శక్తిపీఠాలను, ప్రజ్ఞా సంస్థానాలను ఉత్సాహపరుస్తూ సంస్థ పనులలో ఉత్సాహంగా పాల్గొనేలా గురుదేవులు దగ్గరుండి చేస్తున్నట్లు పరిజనులు అనుభూతి పొందారు. పైవన్నీ ఈ గ్రంథ రచయితలతోపాటు అనేకమంది పరిజనుల మనోభావాలు కూడా.

గురుదేవుల యొక్క ఈ మహత్వపూర్ణమైన కార్యక్రమం ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రారంభమయిందో చెప్పడం చాలా కఠినమైన పని. ఉదాహరణకు గాయత్రీ మంత్ర దీక్షను బహిరంగంగా ఇచ్చుట అంటరాని స్త్రీకి తన గ్రామంలో శుశ్రూష చేయుట, జబ్బుపడిన గోవుల సంరక్షణ చేయుట, 15 సంవత్సరాల లేత వయస్సులో మహాపురశ్చరణ క్రియను చేపట్టుట, ప్రేరణాత్మక గ్రంథాల రచన, యజ్ఞపరంపర ప్రారంభించుట, గాయత్రీ పరివార్ సంస్థను ప్రారంభించుట, మహా పురశ్చరణ పూర్తియైన తదుపరి మథురలో 1008 కుండముల గాయత్రీ మహా యజ్ఞాన్ని చేపట్టుట, మున్నగునవి వేనికవే గొప్ప ప్రారంభాలుగా కన్పిస్తాయి. కాని ఇవేవి ప్రారంభ ఘట్టాలని మేము భావించడం లేదు. గత 2500 సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ కాలం నుండి నిర్విరామంగా కొనసాగుచున్న కాలగమనంలో ఇవి మైలురాళ్ళ వంటివి.

గ్రంథ రచనాపరంగా ఆచార్య గురుదేవులు వ్రాసిన గ్రంథాల సంఖ్య 3000 సంఖ్య దాటింది. జనవరి 1940 నుండి నెలకు ఒక పుస్తకం చొప్పున అఖండజ్యోతి ద్వారా వ్రాసి అందించారు. ప్రాచీన మత గ్రంథాలకు ప్రాచుర్యాన్ని కల్పించిన ఆయన తీరు పండితులను మొట్టమొదట ఆకర్షించింది. సులభశైలిలో వ్యాఖ్యానాలు, నాలుగువేదాలు, పద్దెనిమిది పురాణాలు, నూట ఎనిమిది ఉపనిషత్తులు, ఇరువది స్మృతులు, ఇరవైనాలుగు గీతలు హిందీలోనికి తర్జుమా వగైరా పనులు నిర్వర్తించి, వీనిని సామాన్య జనులకు అందుబాటులోనికి తెచ్చుటయే ఒక మహాకార్యం. పై గొప్ప పనులు గురుదేవులను గొప్ప సాహితీవేత్త స్థానంలో నిలుపుతాయి. సనాతన ధర్మం ద్వారా, విశ్వమానవాళి ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చుటకై గాయత్రీ పరివార్‌ను స్థాపించుట అనే ఒక భూభారమంతటి కార్యాన్ని గురుదేవులు చేపట్టారు. సాధకులైన శైవులు, వైష్ణవులు, శక్తి ఆరాధకులు మున్నగు వారెందరో తరతమ భేదాలు మరచి దీనిలో చేరారు. మథురలో గాయత్రీ తపోభూమి స్థాపన ద్వారా తీర్థముల వ్యవస్థాపనకు శ్రీకారం చుట్టారు. ఇది కొనసాగుతూ ఉంది. వేలకొలది దేశమంతటా చేసిన గాయత్రీ యజ్ఞాలు, ఆచార్యులవారి దిగ్విజయ యాత్రకు ప్రతీకలు. 1971లో గురుదేవుల సారథ్యంలో నిర్వహించిన 5 సహస్రకుండీ యజ్ఞాలు, ఆయా ప్రాంతాలలో ధర్మానికి విజయంగా పరిగణింపవచ్చు.

సాధనకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, గురుదేవులు శాంతికుంజ్‌ను 1971 నుండి తన పనులకు కేంద్రబిందువుగా చేసుకుని సాధనలను వివిధ స్థాయిలలో నిర్వహించారు. వారి వారి ఆంతరంగిక (అంతఃచేతన) ఎదుగుదలను బట్టి వేల మంది సాధకులకు గురుదేవుల మార్గదర్శనం లభించేది. సిద్ధ పురుషుల స్థాయికి ఎదిగిన సాధకులు అనేకమంది ఉన్నారు. వారి సిద్ధులను

**ఇతరులు తమను గౌరవించడం లేదని క్రుంగి పోకూడదు.**

ప్రదర్శించరాదని గురుదేవులు వారిపై ఆంక్షలు విధించారు.

తర్కం, గణాంకాల మరియు తార్కాణాల ఆధారంగా ఈ యుగం నడుస్తున్నది. మతము మరియు ఆధ్యాత్మికతపై వానిని మన్నిస్తూ / సంతృప్తిపరుస్తూ మనగలగాలి అనేది గురుదేవుల ఆకాంక్ష. దీనికొరకై 1979లో "బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్" అనే పరిశోధనా సంస్థను హరిద్వార్‌లో ప్రారంభించి ఆధ్యాత్మికత కూడా శాస్త్రబద్ధమైనదే అని నిరూపించుటకు గురుదేవులు బీజాలు నాటారు. ఆనాడు నాటిన చిన్న బీజము నేడు మర్రిచెట్టులా ఎదిగింది. దాని పనులు విశ్వవ్యాపిత దిశగా సాగుచూ దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ రూపాన్ని సంతరించుకొన్నది. ఈ విశ్వ విద్యాలయం ధ్యేయం పాత-కొత్తల, తూర్పు-పశ్చిమముల మరియు శాస్త్రీయ-ఆధ్యాత్మికతల మేలు కలయికను సాధించుటయే. భారతీయ ఆధ్యాత్మికత మరియు తాత్విక చింతనల బీజాలను గురుదేవులు గాయత్రీ మంత్రాక్షరాలలో దర్శించారు. సనాతన ధర్మ వనములో ఈ బీజాలు అంకురించి, పెరిగి పుష్పించి విరబూచాయి. గురుదేవుల చివరి సంవత్సరాలలో గాయత్రీ మంత్రం ఆధారంగా విశ్వమతాన్ని వ్యాపింపచేయవలసిన అవసరాన్ని గుర్తించారు.

ఆచార్య శ్రీ ఆధ్యాత్మిక సుదీర్ఘయాత్రను తెలియచెప్పుట, మనకు ఎంతో ఆనందాన్నిస్తుంది. దీన్ని అందజేయుట ద్వారా మనకెంతో ప్రియమైన, ఇష్టమైన ఉత్తేజాన్ని, మనోరంజకాన్ని పొందుతాము. ఆయన జీవితంలోని సంఘటనల నిర్ధారణలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొన్నాం. గురుదేవుల కృపతో ఆటంకాలను అన్నింటిని అధిగమించి సత్యమునే మేము ఇచ్చుట పొందుపరచాం అని ఘంటాపథంగా చెప్పగలం.

ఈ గ్రంథ రచనలో మేము ఎదుర్కొన్న మొదటి సమస్య ఆచార్యశ్రీ గురించి చాలినంత సమాచారం అందుబాటులో లేకుండుట. దీనికి తోడు ఆచార్యశ్రీ తనను గురించి ఎక్కడ చెప్పలేదు. ఒకవేళ ఏమైనా చెప్పి ఉంటే అదంతా సాధకుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చెప్పినవే. పరిజనులు అనేకసార్లు వారి సాధనల గురించి, జీవిత విశేషాల గురించి చెప్పమని అర్థించినా, గురుదేవులు వారి కోరికను మన్నించలేదు. అటువంటి సందర్భాలలో "మీరు ఏదైతే చూస్తున్నారో అదే ప్రధానం" అని గురుదేవులు చెప్పేవారు. పరిజనుల నుండి ఒత్తిడి పెరుగగా, "ఆత్మకథ" ను వ్రాయుట జరిగింది. ఈ పుస్తకంలో ఆయన జీవితానికి సంబంధించిన సంఘటనలను లీలగా మాత్రమే ఉటంకించారు. ఆధ్యాత్మిక జీవన విధానాన్ని గురించి ఆయన దర్శించిన దానిని ఆ గ్రంథంలో వివరణాత్మకంగా అందించారు. ఈ ఆత్మకథను చదివి కూడా పరిజనులు తృప్తినొందక, తమ పాతకోరికను పలుమార్లు తిరిగి కోరారు. పరిజనుల కోర్కె సంపూర్ణంగా నెరవేరలేదని దీని అర్థం. గురుదేవుల గురించి పరిజనులు మరింత లోతుగా తెలిసికొనగోరుతున్నారు. "నా జీవన విధానమే నా సందేశం" (My life is my message) అన్నారు గురుదేవులు.

ఆచార్యశ్రీ ఆయన జీవిత చరిత్ర వ్రాయలేదు. కాని ఆయన జీవితంలోని అరుదైన ఘట్టాలను, అనుభవాలను తన చర్చలలో, ఉత్తర ప్రత్యుత్తరాలలో, వ్యాసాలలో వివరించారు. వీటినన్నింటిని క్రోడీకరించుట జరిగింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాట సంఘటనల గురించి లోతుగా పరిశీలించుట జరిగింది. గురుదేవుల బంధు మిత్రుల నుండి మరియు సహచరుల నుండి విషయ సేకరణ చేశాము. గురుదేవులతో కలసి పనిచేసిన కార్యకర్తల నుండి కూడా విషయ సేకరణ జరిపాం. ఆ విధంగా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఒక క్రమ పద్ధతిలో ఈ గ్రంథములో ప్రకటించుట జరిగింది. వీనిని 2000 సంవత్సరం వరకు వెల్లడించకూడదని గురుదేవులు ఆంక్ష విధించారు. దీనిని పాటించుట జరిగింది. ఇప్పుడు, సమయం ఆసన్నమైనందున బహిర్గతం చేయుట జరిగింది. ఈ సమాచారాన్ని అంతటిని ప్రోగుచేయు సమయంలో లభ్యమైన సహాయం గురుదేవులే స్వయంగా ముమ్మల ఉత్సాహపరుస్తూ చేయించినట్లు మాకు అనిపించింది. ఈ గ్రంథంలోని విషయాలు మీకు ప్రేరణను, ఉత్తేజాన్ని అందించినచో అదంతా గురుదేవుల ఆశీస్సులే. దీనిలో దొర్లిన లోపాలకు మేమే బాధ్యత వహిస్తూ, గురుదేవుల క్షమాపణల కోరుచున్నాం.

*- డా॥ ప్రణవ్ పండ్యా*

*జ్యోతిర్మయి*

*అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

## రామకృష్ణ పరమహంస

*రామకృష్ణ పరమహంస తల్లి ఒకసారి కలకత్తా వచ్చి కుమారుడి దగ్గర ఉన్నది. దక్షిణేశ్వర యజమానురాలు రానమణిదేవి ఈమెను సన్మానించాలని రకరకాల బహుమతులు ఇచ్చింది. కాని ఆవిడ అవేమీ స్వీకరించకుండా గౌరవం కోసం ఒక యాలక్కాయ మాత్రమే స్వీకరించింది. అది చూచిన వారు ఇలా అనుకున్నారు - "ఇటువంటి వైరాగ్యశీలులైన తల్లే పరమహంసలాంటి కొడుకులకు జన్మనివ్వగలదు" - ప్రజ్ఞాపురాణం నుండి*

**మన వైఫల్యాలకు ఇతరులు కారణం కాదు.**

## యువతకు ప్రత్యేకం

# ఐశ్వర్యం - 3

మనం చేసేటువంటి చిన్న చిన్న పనులు కూడా పద్ధతిగా ఉండాలి (organised). ఉదాహరణకు పుస్తకాలు నీట్‌గా సర్దుకోవడం, చెప్పులు లైనులో పెట్టడం మొదలైనవి అలవాటు చేసుకోవాలి. మందుల షాపులలో ఈ వ్యవస్థ బాగా కనిపిస్తుంది. వేలాది మందులు ఎంత చక్కగా పెట్టుకుంటావంటే ఏ మందు కావలసినా క్షణంలో తీసి ఇస్తారు. ఇదే అసలు పూజా విధాన మంటే. మీ దగ్గర ఉన్న వనరులను ఉపయోగించుకోవడమే పూజా విధానం.

మనిషికి ఎన్ని వనరులు ఉంటాయి? కాలం, శ్రమ వీటిని వనరులు అనుకోవచ్చా? లేక వీటికి ముందు ఇంకా ఆధార భూతమైనవి ఉన్నాయా (fundamental resources)? మనకు అద్భుతమైన వనరులు పది ఉన్నాయి. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు. మీరు ఏ జ్ఞానం పొందినా వీటి ద్వారానే పొందుతారు, పొందిన జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలకున్నా వీటి ద్వారానే ఉపయోగిస్తారు. వీటిని బాగా ఉపయోగించుకున్నవాడు ఎదుగుతాడు. వీటిని బాగా ఉపయోగించని వాడు ఎదగలేడు. దీనిని పంచోపచార పూజ అని చెప్పారు.

మనం దేవాలయానికి వెళ్తాం. ఏ దేవాలయానికి వెళ్ళినా ఒకటే మనకి. ఎందుకంటే ఆ దేవాలయాలలో ఎవరు ఉన్నారో తెలియదు. ఎవరు ఉన్నారో తెలియనప్పుడు శ్రద్ధ ఉండదు. గుడికి వెళ్తే పూజారి మంత్రాలు చదువుతుంటాడు. అతను ఏమి చదువుతున్నాడో మనకి తెలియదు. నెత్తి మీద అక్షింతలు వేస్తాడు. ఇంకేదో చేస్తాడు. కాని మనం ఏమి చెయ్యాలో అది చెయ్యం. ఏవో విషయాలు మాట్లాడుకుంటుంటాము.

ఒకసారి న్యూస్ పేపర్లో ఒక వార్త పడింది. పి.వి. నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఆయన వంటవాడు ఆయనేమి తింటాడో, ఆయనకేమి ఇష్టమో పేపరువాడికి చెప్పాడు. అంతే అతడిని ఉద్యోగంలోనుంచి తీసివేశారు. ఎందుకు అతనిని ఉద్యోగంలోనించి తీసేశారు? ఆయన ఏమి తింటున్నాడో తెలిస్తే ఏంటట? ఆయన ప్రొద్దునే కాకరకాయ రసం త్రాగుతాడు. ఇంకేదో వ్రాశాడు. ఏం తప్పు చేశాడు. మీ ఆహారపు అలవాట్లు తెలిస్తే మీ మనస్సును మార్చివేయచ్చు. పెద్ద పెద్ద నిర్ణయాలు డిన్నర్‌లో వస్తాయి. వారు చేసే బేరసారాలన్ని లంచ్‌లోనో, డిన్నర్‌లోనో చేస్తారు. వాళ్ళు మీటింగ్ వేసి మాట్లాడుకోవచ్చు కదా! ఎందుకు లంచ్, డిన్నర్? ఆహారం వల్ల మనస్సులు మార్చివేయవచ్చు అని వెళ్ళేవాళ్ళకు తెలుసు. అందుచేత ఆ శాస్త్రీయతను ఉపయోగించుకుని ఎవరైనా ప్రసాదం పేరుతో మీ మనస్సులకు కావలసిన ఒత్తిడి (stress) ఇస్తే ఆ పని జరుగుతుంది. మరి ఆ ప్రసాదానికి ఎంత విలువ ఇవ్వాలి. అందుకే ప్రసాదాన్ని కళ్ళకద్దుకుని తింటారు. ఆ సైన్సు అర్థమయితే ఎవరో తినమని చెప్పనక్కరలేదు. నువ్వే తింటావు. అందుచేత ప్రసాదం క్రిందపడితే ఏం చేస్తావు? తీసుకుని తింటావు. ఎందుకంటే అది గౌరవం వల్ల కాదు. దాని విలువ తెలియడం వల్ల. ఇదంతా పూజా విధానంలో ఉన్నది. అందువల్ల దేవాలయాలకి వెళ్ళాలి. ధనవంతులందరు దేవాలయానికి వెళ్తారు. తెలిసే వెళ్తారు. ఆహారం ద్వారా మనస్సును మార్చవచ్చు. అందువల్లనే పూర్వకాలం బయట తినేవారు కాదు. దానికి మడి అని పేరు పెట్టారు. మన అనాది కాలంగా వస్తున్న ఆ పద్ధతులలోని సైంటిఫిక్ యాస్పెక్ట్స్ (శాస్త్రీయ విధానాన్ని) ఉపయోగించుకోవడం మొదలుపెట్టాలి. ఋషులు దేవాలయాలకి ప్రతిరోజు వెళ్ళి తిరిగి రమ్మని రూలు పెట్టారు. అందుచేత దేవాలయాలకి ప్రతిరోజు వెళ్ళాలి. కాని గుడ్డిగా చేయకండి.

పిల్లవాడిని ఎల్.కె.జి.లో చేర్పించారు. కోరిక ఏమిటి? వాడు డాక్టరు అవ్వాలి. ఓ సంవత్సరం అయింది. ఇంకా డాక్టరు అవలేదా? అని అంటారా? డాక్టరు అవడానికి 16-17 ఏళ్ళు పడుతుంది. మరి దేవాలయానికి వెళ్ళిన రోజు నుండి నాకేమి లాభం అనుకుంటే ఏమి అనుకోవాలి? సరే రోజూ దేవాలయానికి వెళ్తున్నాం. దేవాలయానికి కొబ్బరికాయలు తీసుకెళ్తాం. ఎందుకో తెలియదు. పువ్వులు ఎందుకు తీసుకువెళ్తామో తెలియదు. కర్పూరం ఎందుకు తీసుకువెళ్తామో తెలియదు. ఉదొత్తులు ఎందుకు తీసుకువెళ్తామో తెలియదు. మన పూర్వీకులు ఇటువంటి అద్భుతమైన పద్ధతిని అందించినా, మనకు పంచోపచారపూజ అంటే తెలియదు. దేవాలయాలలో దేవుడు ఏమి చేస్తాడో తెలియదు. పూజారి ఏమి చెప్తున్నాడో తెలియదు. ప్రసాదం చిట్టచివర ఇస్తారు. పూజ అయిపోయిన తరువాత ప్రసాదం ఇస్తారు. అంటే ప్రసాదం అన్నది మనస్సును మార్చే ప్రక్రియలో చివరిది. **మానసిక స్థితిని మార్చుకోవడమే పూజా విధానం.**

**తరచు ఇతరులతో కలహించే వారు మానసిక కాలుష్యానికి లోనయ్యామని తెలుసుకోవాలి.**

ఈ పూజా విధానంలో ఐదు స్టెప్స్ ఉన్నాయనుకుంటే మొట్ట మొదట పవిత్రీకరణంతో మొదలు పెడతాం. పవిత్రీకరణ అంటే పవిత్రంగా ఉండాలి. శుభ్రంగా ఉండాలి. పూజలో అలా నీళ్ళు తీసుకుని ఏదో చేసేశాం. అది ఒక చిహ్న పూజ. క్లాసులో మాట్లాడుకుంటుంటారు. లెక్చరర్ వస్తాడు. క్లాసులో మాట్లాడు కుంటున్న వారందరు సైలెంట్ అయిపోతారు. అంతవరకు మాట్లాడుకుంటున్న విషయాలను, ఉన్నటువంటి ఆలోచనలను ప్రక్కకు పెట్టాలి అది పవిత్రీకరణ అంటే.

**ఓం అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపివా**
**యః స్మరే త్పుండరీకాక్షం స బాహ్యాభ్యంతర శుచిః**

మన మనస్సు మారాలి. ఐశ్వర్యవంతుడిగా అవాలంటే మన మనస్సు, చేతనత్వం మారాలి. ఐశ్వర్యం, అంటే ధనం ఒక్కటే కాదు. అన్ని రకాల ఐశ్వర్యాలు. కాని మనకు ఒక్కటే తెలుసు. డబ్బు సంపాదించి ప్రక్కన పెట్టుకోవడం. డబ్బు అయితే సంపాదిస్తారు. కాని ఉపయోగించుకోవడం చాలా మందికి రాదు.

**అపవిత్రః పవిత్రోవా ...**

కమ్మగా వండుకుంటారు. హాయిగా తింటుంటారు. ప్రక్కింటి వాళ్ళ గురించి మాట్లాడుకుంటున్నారు. కోపాలు వచ్చేస్తుంటాయి. ఇంతకి సమస్య మీది కాదు. ప్రక్కింటి వాళ్ళది. మనం కొట్టేసుకుంటుంటాం. వద్దు అది మీ మనస్సును అలా ఉంచుకోకూడదు. ఏమి కావాలో విషయంపైనే మనస్సు ఉండాలి.

ఇక ఆచమనం

**ఓం అమృతోపస్తరణమసి స్వాహా ।**
**ఓం అమృతా పిధానమసి స్వాహా ॥**
**ఓం సత్యం యశః శ్రీర్మయి శ్రీః శ్రయతాం స్వాహా ॥**

అంటే మూడు సార్లు నీటిని తీసుకుని మనస్సును, వాక్కుని కర్మలని కలపాలి. మనో వాక్కాయ కర్మలు అంటాం, త్రికరణశుద్ధి అంటాం. త్రికరణ శుద్ధి అంటే మనస్సు, వాక్కు, కర్మలు ఒకే రకంగా ఉండాలి. **అంటే అనుకున్నదే చెప్పాలి. చెప్పింది చేయాలి.**

"నేను నాలుగు గంటల పాటు కూర్చొని చదువుతాను" నోటితో చెప్పావు. అంటున్నప్పుడే 'నేనేం కూర్చుంటాను నాలుగు గంటలు' అని మనస్సులో అనిపిస్తుంటుంది. 8-12 బాగా చదువుకుంటాను. అరే క్రికెట్ మ్యాచ్ ఉన్నదే. సరే ఒక గంట చూస్తాను. ఏం జరిగింది అక్కడ? **మీ వాక్కుకి మనస్సుకి లింక్ పోయింది. అందువల్ల మీ కోరికలు తీరడం లేదు.** ఆధ్యాత్మికత ఇచ్చే గ్యారెంటి ఏమిటంటే **ఆలోచించినది సవ్యంగా ఉంటే అది వెంటనే ఫలితాన్ని ఇస్తుంది.**

బట్టలు కొనడానికి షాపుకి వెళ్తాం. తొందరగా కొనలేం. ఎందుకు? మనస్సు చంచలంగా ఉన్నది. అది మన జీవితంలో అడుగడుగునా వస్తుంది. దానిని సవరించుకోండి. అదే ఆచమనం అంటే. ఏదైనా ఖచ్చితంగా నిర్ణయించుకోండి. నేను ఏం చెప్తాను. నాకు బ్లూ కలర్‌లో ఫలానా రేటులో బట్ట కావాలంటాను అది చూపిస్తాడు. కొంటాను. వచ్చేస్తాను. ఇంక ప్రక్కన ఏం ఉన్నదో చూడను. చూస్తే మనస్సు మారుతుంది. మారకూడదు. రకరకాల బట్టలు ఉంటాయి. ఏదో ఒకటి త్వరగా నిర్ణయించుకోవచ్చు కదా! మనోవాక్కాయ కర్మలలో ముఖ్యమయినది ఏమిటంటే చెప్పింది చేయటం.

ఇంకొకటి ముఖ్యమైనదేమిటంటే సర్దుకుపోవడం ఎడ్జస్ట్‌మెంట్. ఈ మానసిక స్థితి వస్తే క్రిందపడిపోతారు. సర్దుకుపోకు. మీరు కూర్చున్నప్పుడు కుర్చీ సరిగ్గా లేకపోతే దానిని భరించావనుకో, నువ్వు ఎదగలేవు. అలా అని ఇంకొకళ్ళ ఇంటికి వెళ్ళి సర్దుతానన్నావనుకో, చాలా ఇబ్బందులు వస్తాయి. ఇది మీ వ్యక్తిగతమైన విషయముల వరకే సర్దుకుపోవద్దనేది. మీ ఇంట్లో అన్నదమ్ములకు మీరేమి నేర్పక్కర్లేదు. వాళ్ళ జీవితాలను వాళ్ళని జీవించనీయండి. మీరు మీ జీవితాలను మార్చుకుని ఉంటే వాళ్ళే మీ దగ్గరకు వచ్చి ఎలా మారావని అడుగుతారు.

మీకు సంబంధించిన వస్తువులు, మీకు సంబంధించిన పుస్తకాలు, మీకు సంబంధించిన జ్ఞానం, మీ కాలాన్ని సవ్యంగా ఉపయోగించుకోవాలి. కాని కాలాన్ని సవ్యంగా ఉపయోగించు కుంటానని 8 గం॥ల నుంచి 10 గం॥ల వరకు చదువుకుంటానని టైమ్ టేబుల్ వేసుకున్నావు. ఇంట్లో ఏదో కారణాల వల్ల 9 గంటలకే భోజనం చేయవలసి వచ్చింది, అప్పుడు బిగదీసుకు కూర్చోవక్కరలేదు. అంటే మీరు జీవితాన్ని ఇంత సీరియస్‌గా తీసుకుంటున్నారని ప్రక్కవాడికి తెలియకూడదు. తమాషా ఏమిటంటే మీరు చెప్తే తప్ప చాలా మందికి తెలియదు. మీరు ఇలా మారిపోయారు, జీవితాన్ని చాలా వ్యవస్థగా జీవించడానికి ప్రయత్నిస్తున్నారని వారికి కనిపించదు.

**ఆలోచనలు, మాటలు, చేతలు ఒకటిగా (streamline) అవ్వాలి.** ఇది పూర్వం దేవాలయాలలో నేర్పబడేది. అది తెలుసున్నవాడి ముందు రాజులు కూడా బలాదూరే. రాజులు కూడా పురోహితుల దగ్గరకు అందుకు వచ్చేవారు.

ఇప్పుడు దేవాలయాలలో విగ్రహాలు మాత్రమే ఉన్నాయి. ఒకప్పుడు అక్కడ విగ్రహాలు మాత్రమే ఉండేవి కాదు, ఆ విగ్రహాల వెనుక ఓ అద్భుతమైన చైతన్యం పనిచేస్తూ ఉండేది. ఈ

మనో మాలిన్యం నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకోనివ్వదు.

దేవాలయాలలో ఉండే సృజనాత్మకత మనకి తెలియటం లేదు. అందుచేత పూర్వకాలంలో దేవాలయాలకు అంతంత ధనం, భూములు ఇచ్చేవారు. పూర్వకాలపు రాజులు రత్నాలు, మాణిక్యాలు దేవాలయాలకి ఇచ్చేయడానికి వాళ్ళేమి పిచ్చివాళ్ళు కాదు.

మనం ప్యూరిటి (శుద్ధత) గురించి మాట్లాడుకుంటున్నాము. ఆచమనం ఏం చెప్తుదంటే మీ మాటకి, మీ ఆలోచనలకు, మీ చేతలకి మధ్య సంబంధం ఉన్నదో లేదో చూసుకోండి. హోటలుకి వెళ్తారు. ఏ టిఫిన్ తినాలో ఎంత గందరగోళపడతారో. మీకు కావలసినది ఏదో అది తినవచ్చు కదా. ఎందుకు మొహమాటాలు? కాఫీ త్రాగుతావా? టీ త్రాగుతావా? అది కూడా చెప్పలేరు అనేకమంది ఏదైనా ఫరవాలేదని అంటారు. నిర్ణయించుకునే శక్తి లేదు. వారు అది డెవలప్ చేసుకోవాలి.

నా దగ్గరకి చాలా మంది వస్తుంటారు. "మాష్టారు 25 లక్షలు పెట్టుబడి పెట్టేవాడిని ఎవరైనా చూడండి" అంటే నా పేరు చెప్పుకుని వాడి నెత్తిమీద వీడు చెయ్యి పెట్టేస్తాడన్నమాట. వెంటనే ఆ మాటలను ఆపేస్తాను. ఇంకొకడు నాకు ఇవ్వాలి అనుకునే వాడికి ఎవడు ఏమి చేయలేడు. మేము చేయగలము అని మనస్ఫూర్తిగా మొదలు పెట్టేసి మనోవాక్కాయ కర్మలుగా ప్రయత్నించు ఖచ్చితంగా ఫలితాలు వస్తాయి.

ఆచమనం తర్వాత శిఖాబంధనం. శిఖా బంధనం అంటే దేని గురించి ఆలోచిస్తున్నారో, చర్చించుకుంటున్నారో వాటిని గురించిన ఆలోచనలు ప్రపంచంలో ఏమి ఉన్నాయో, వాటిని పట్టుకోవడం. ఏదైనా రీసర్చి చేయాలంటే మొదట లైబ్రరికి వెళ్తాము. దానిని గురించి ఎవరైనా ఏమైనా వ్రాశారా అనే దాన్ని సర్వే చేస్తాము. అది శిఖా బంధనం అంటే. ఉత్తినే నెత్తిమీద చెయ్యి పెట్టుకుంటే ఏమి రాదు. మీకేదో సమస్య ఉన్నది. మీరు దేవాలయానికి వెళ్ళి ఈ కర్మకాండ చేస్తే దానికి సంబంధించిన ఇన్‌ట్యూషన్ (intuition) డెవలప్ (develop) అవుతుంది. ముఖ్యంగా టీచర్లకి ఈ అనుభవం బాగా తేలికగా వస్తుంది. వాళ్ళు మరుసటి రోజు చెప్పబోయే పాఠానికి తయారవుతుంటారు. అది పిల్లలకి ఎలా చెప్పాలని ఆలోచించుకుంటారు కాని అది తృప్తిగా ఉండదు. క్లాసుకి ఆ టెన్షన్‌తోనే వెళ్తారు. ఆ పాయింట్ చెప్పాల్సి వస్తుంది. ఠకామని దానిని అద్భుతంగా చెప్పేస్తారు. ఇంత బాగా ఎలా చెప్పాను అని అతనికే ఆశ్చర్యమేస్తుంది. అది శిఖా బంధనమంటే.

**చిద్రూపిణీ మహామాయే దివ్యతేజః సమన్వితే**
**తిష్ఠదేవి శిఖామధ్యే తేజోవృద్ధిం కురుష్వమే**

అనుకుంటూ ఉత్తినే చేయి నెత్తిమీద పెట్టుకుంటే ఏమి లాభం? మీరు చర్చించుకుంటేగాని అది దిగదు. ఈ విధమైన దృష్టి కోణంతో ఒక దేవాలయంలో ఒక గ్రూపుగా చేస్తే అది ఖచ్చితంగా దిగుతుంది (descent).

కాని ఈ విధంగా జరగటానికి రెండు కండిషన్స్ (conditions) ఉన్నాయి. 1) చర్చించుకున్న విషయం తప్ప మిగిలినదేది మనస్సులోకి ఆ క్షణంలో రాకూడదు. కెమిస్ట్రీ చదువుతున్నప్పుడు కెమిస్ట్రీ చదవండి. భోజనం చేస్తున్నప్పుడు భోజనం చేయండి. ఆడుకుంటున్నప్పుడు ఆడుకోండి.

అపవిత్రః పవిత్రోవా అంటే అది. ఇంగ్లీషులో చెప్తారు. work while you work, play while you play **అంటే పని చేసేటప్పుడు పని చేయాలి, ఆడుకునేటప్పుడు ఆడుకోవాలి. ఒక సమయంలో ఒకే పని చెయ్యండి. ఆ పనిని బాగా చెయ్యడానికి ప్రయత్నించండి.**

2) మనస్సు - వాక్కు - ఆచరణ ఒకే విధంగా ఉండేటట్లు చూచుకోండి. అలా ఉంటే ఖచ్చితంగా ఇన్‌ట్యూషన్ (intuition) పని చేస్తుంది.

పవిత్రీకరణ, ఆచమనం, శిఖాబంధనం తరువాత నాల్గవది ప్రాణాయామం.

మీకు మంచి ఆలోచనలు వచ్చాయి. కాని వాటిని ఆచరణ పెట్టేందుకు బలం లేదు. ధైర్యం చాలడం లేదు. అందువల్ల శక్తిని, సామర్థ్యాన్ని పెంచుకోవాలి. అవి పెంచుకుంటే తప్ప ఐశ్వర్య వంతుడు కాలేడు. **ప్రాణాయామం ద్వారా శక్తి సామర్థ్యాలు పెంచుకోవాలి. ఐశ్వర్యవంతుడు కావాలనుకున్నవాడికి నిత్య జీవితంలో ప్రాణాయామం తప్పనిసరి.** ఇంకో మార్గం లేదు. ప్రాణాయామం వల్ల తెలివితేటలు అభివృద్ధి అవుతాయి. కాని ప్రతినిత్యం చేసుకోవాలి. ఎన్ని సార్లు చెయ్యాలి? అనే ప్రశ్న వస్తుంది. గంటలు గంటలు చేయవలసి వస్తుంది. "మేము చేయలేము మాష్టారు" మీరు ఐశ్వర్యవంతులు కాలేరు. ఐశ్వర్య వంతులు కావటానికి దగ్గర దారులు (shortcuts) ఏమీ లేవు. ప్రాణాయామం చెయ్యకపోతే కబుర్లు మిగులుతాయి. ఇప్పటి నుండి డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) అలవాటు చేసుకోవాలి. పైపైన తీసుకునే శ్వాస వల్లనే పిల్లలు టెక్ట్స్ బుక్స్ చదవడం మానేశారు. **శ్వాస లోతుగా ఉంటే చదువుకునే సబ్జెక్ట్‌లో కూడా లోతుగా వెళ్ళగలరు.** అందుచేత ఈ లోతైన శ్వాస (deep breathing) అలవాటు చేసుకుంటే ఏ విషయంలోనైనా ఆటోమాటిక్‌గా లోతుగా వెళ్ళగలరు. బలం ఉన్నవాడు ఏ పనిచేసినా బలంగానే చేస్తారు. తెలివి ఉన్నవాడు ఏ పని చేసినా

**మనో మాలిన్యం అనుమానాలను, అపోహలను సృష్టిస్తుంది.**

తెలివిగా చేస్తారు. అందువల్ల శ్వాస మార్చుకోండి. "శ్వాస మార్చుకోవడం అంత తేలిక కాదు మాష్టారు". ఐశ్వర్యవంతుడు కావడం కూడా అంత తేలిక కాదు బాబు! నిజంగా మీకు ఆ కోరికలు ఉంటే తక్షణం డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) అలవాటు చేసుకోవాలి. మామూలుగా గాలి పీలుస్తున్నారు కదా! ఆ పీల్చుకునేదేదో ఇంకొంచెం ఎక్కువ సేపు పీల్చుకోండి. మరి ప్రాణాయామం ఎలా చెయ్యాలి. ఎడమ నాశిక నుంచి గాలి పీల్చుకుని కుడి నాశిక ద్వారా వదలడం, కుడి నాశిక నుంచి పీల్చుకుని ఎడమ వైపు వదలడం. గంటలు గంటలు చేయడం మంచిది. నెమ్మదిగా, అతిగా పోకుండా ఒక పద్ధతిగా పెంచుకుంటూ పోవాలి. యోగ శాస్త్రాలలో రోజుకి 144 ప్రాణాయామాలు చేయడం అధమ ప్రాణాయామం అంటారు. ఇదొక్కటి చేసి ఇంకేమి చేయకపోయినా మీ జీవితాలు మారిపోతాయి. ఏదైనా 5-6 నెలలు చేస్తేనే ఫలితాలు తెలిసేది.

దీనివల్ల మీరు నష్టపోయేది ఏమి లేదు. ఊపిరే కదా పీల్చుకునేది. ఏ పని చేస్తున్నా చేసుకోవచ్చు. రోడ్డు మీద నడుస్తున్నా చేసుకోవచ్చు. చూచేవాళ్ళు ఏమిటి వీళ్ళు ముక్కు ఇలా ఇలా అనుకుంటున్నారు అని అనుకున్నా పట్టించుకోవక్కరలేదు. సిగరెట్టు త్రాగుతూ వెళ్ళటం కంటే ఇది మంచిదే కదా! ఆ సాహసం ఉండాలి. ఐశ్వర్యవంతుడు కావాలంటే తెగింపు ఉండాలి. మంచి పని చేయడానికి తెగింపు లేకపోతే ఎలా? చెడ్డ పని చేయడానికి అసలు భయం ఉండదు. బార్‌లోకి వెళ్ళడానికి అసలు భయం ఉండదు.

ఇప్పటి దాకా చెప్తున్నది ఏమిటి? 1) అపవిత్ర పతిత్రోవా 2) ఆచమనం 3) శిఖా బంధనం. శిఖాబంధనం ఏం నేర్పుతుందంటే **నువ్వు ఏ పని చేస్తున్నా నీ కంటే ఎక్కువ తెలిసిన వారి ఆలోచనలు పట్టుకోవాలి.** ఎలా పట్టుకోవచ్చు? లైబ్రరిలో పుస్తకాలలో పట్టుకోవచ్చు. ఈ కాలం పిల్లలు లైబ్రరికి వెళ్ళరు. ఎందుచేతంటే ప్రాణాయామం చేయకపోవడం వల్లనే. ప్రాణాయామం చేస్తుంటే లైఫ్‌లో (జీవితంలో) లోతు వస్తుంది. జీవితంలో లోతులేని వాళ్ళకే ఈ జీవితం రోత పుడుతుంది. లోతున్న వాళ్ళకి రోత పుట్టదు. ప్రాణాయామం చేసేటప్పుడు శబ్దం రాకూడదు. నెమ్మది నెమ్మదిగా లోతుగా చెయ్యాలి. మత్తుగా అనిపిస్తుంది. పెగ్గులవి కొట్టక్కర్లేదు. ఆటోమేటిక్‌గా మత్తు వస్తుంది. ఈ మత్తు సహజమైనది. మత్తు ఎందుకు వస్తుందంటే మీ మెదడుకు కావలసిన ఆక్సిజన్ పరిపూర్ణంగా వెళ్తుంది. అందుచేత ఆ తృప్తి, ఆ మత్తు. **ఈ ప్రాణాయామం చేయడం వలన సబ్జెక్ట్స్ అర్థం కాకపోవడం అంటూ ఉండదు.**

ఇంకా మీ జీవితాలలో డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) అలవాటు అయిపోవాలి. డీప్ బ్రీతింగ్ ఎప్పుడైతే అలవాటు అయిందో ఆటోమేటిగ్‌గా ఇంట్రస్ట్ పెరుగుతుంది. జీవితానికి ఓ లక్ష్యం ఏర్పడుతుంది. ఇదంతా కేవలం శ్వాస మీద ఆధారపడి ఉంటుంది. నిమిషానికి 35 సార్లు శ్వాస తీసుకునే జంతువులు 15 సంవత్సరాలు మాత్రమే బ్రతుకుతాయని జువాలజిస్ట్ (జంతు శాస్త్రజ్ఞులు) చెప్తున్నారు. నిమిషానికి 15-16 సార్లు శ్వాస తీసుకునే మనిషి 100 సంవత్సరాలు బ్రతకాలి. కాని జీవితంలో పరుగులు పెట్టడం వల్ల, టెన్షన్ వల్ల నిమిషానికి తీసుకునే శ్వాసల సంఖ్య బాగా పెరిగిపోతున్నది. అందువల్ల 100 సంవత్సరాలు బ్రతకవలసిన మనిషి ముందరే పోతున్నాడు. తాబేలు, ఏనుగు నిమిషానికి 4 సార్లే గాలి పీల్చుకుంటాయి. 500 సంవత్సరాలు బ్రతుకుతాయి. ఇంత చెప్పినా ప్రాణాయామం మీరు చేయకపోతే ఎవరేమి చేయగలరు? ప్రాణాయామం తరువాత చివరిది న్యాసం. న్యాసంలో ఐదు ఇంద్రియాలను కన్ను, చెవి, నోరు, చేతులు, కాళ్ళు ముట్టుకుంటాము.

కళ్ళను ఉపయోగించుకోండి సవ్యంగా. చెవులను ఉపయోగించుకోండి సవ్యంగా. చేతులు ఉపయోగించుకోండి సవ్యంగా. **ఈ ఇంద్రియాలను ఎవరైతే సవ్యంగా ఉపయోగించు కోగలరో వారు ఐశ్వర్యవంతులు అయిపోతారు సహజంగా** (Let us grow rich is all aspects of life.)

*- డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారు యువతకు ఇచ్చిన ఉపన్యాసముల నుండి*

*శ్రీరామకృష్ణ మాస్టారిగారి ఉపన్యాసముల సి.డి.లు కావలసిన వారు సంప్రదించండి : ఫోన్ - 9441901275*

## రాణి సంయుక్త

*పృథ్విరాజ్ చౌహాన్ సంయుక్తను కన్నౌజ్ నుంచి అపహరించి తెచ్చాడు, వివాహం చేసుకున్నాడు. ఆమె రూప సౌందర్యాలకు ఎంతగా ముగ్ధుడయ్యేడంటే ఆమెను వదలి వెళ్ళలేక రాచకార్యాలు వదిలివేశాడు. ఈ స్థితిని గుర్తించి మహమ్మద్ ఘోరి ఢిల్లీపై ముట్టడి చేశాడు. నేతృత్వ లేమితో ఓటమి దగ్గరలో ఉన్నది. సంయుక్త భర్తకు కన్నులు తెరపించే విధంగా మాట్లాడి యుద్ధంలో నేతృత్వం వహించేటట్లు చేయలిగింది. ప్రేమ కన్నా కర్తవ్యం ముఖ్యమని చెప్పి దారి తప్పిన పతిని సరిచేసింది.*

- ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రాముఖ్యతను బట్టి క్రమపద్ధతిలో పనులను చేపట్టాలి.**

వ్యక్తి వికాసం

# బుద్ధి సంపదగా ఎలా మారుతుంది?

వ్యక్తిత్వం ఈ ప్రపంచంలో అన్నిటికన్నా అందమైనది, శక్తివంతమైనది. వ్యక్తిత్వానికి ఎన్నో కోణాలున్నాయి. బౌద్ధిక, వ్యావహారిక, భావనాత్మక మరియు ఆత్మిక శక్తులు ఇందులో అంతర్గతంగా ఉన్నాయి. వ్యక్తిత్వాన్ని ఉన్నతం చేయడంవల్ల నిద్రాణమై ఉండే ఈ శక్తులు జాగృతమౌతాయి. అప్పుడే విభూతులైన ఈ బహుమూల్య సంపదలను ఉపయోగించుకోగలము. ఇంతటి శక్తివంతమైన, బహుకోణాలు కలిగిన వ్యక్తిత్వ ధనులమైనప్పటికి నిస్సహాయంగా, అసమర్థులుగా ఏడుస్తూ ఈ లోకంలోనే అందరికన్నా దౌర్భాగ్యులమని భావిస్తుంటారు. ఎప్పుడూ మనం మన అంతఃకరణలో తొంగి చూడడం నేర్చుకోలేదు, మన విభూతులను శక్తులుగా ఉపయోగించుకోవడం తెలుసుకోలేదు.

వ్యక్తిత్వపు దుప్పటి కింద ఎన్నో విలువైన వస్తువులు దాగి ఉన్నాయి. వీటన్నింటిని ఏరి, సరిచూసుకుని, వాటిని సదుపయోగ పరచడం మనం నేర్చుకోవాలి. వ్యక్తిత్వము అనేది ముఖ్యంగా మూడు కోణాలు కలిగి ఉంటుంది. అవి ఆలోచన, వ్యవహారము, భావన. ఈ ప్రపంచంలో జీవించడానికి వ్యవహారం తెలియాలి. ప్రాపంచిక జీవనానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ వ్యవహార శైలి మీద ఆధారపడి ఉంటాయి. బౌద్ధిక సంపద ఈ ప్రక్రియని లక్ష్యానికి చేరుస్తుంది. **ఆలోచన, వ్యవహారాల కలయికయే సాఫల్యం.** మన దగ్గర వ్యక్తిత్వపు ఆయామములన్నింటిని సరిగ్గా ఉపయోగించుకోగల కళ ఉంటేనే సాఫల్యం యొక్క లాభం అందుతుంది.

మన దగ్గర బుద్ధి ఉండి కూడా మనం బుద్ధిమంతులము కాకపోవడమనేది ఆశ్చర్యకరమే. యోగవిద్యలో బుద్ధి గురించి తీక్షణమైన విశ్లేషణ లభిస్తుంది. ఇక్కడ బుద్ధి పరిపక్వత చెందని స్థితిని మూఢత్వం అంటారు. సమగ్రమైన వికాసం కలిగిన బుద్ధి ఉన్న వారిని జ్ఞానులంటారు. ఈ రెండింటి మధ్య స్థితి బుద్ధి మంతుల స్థితి. ఒత్తిడి, దుఃఖం, సరైన నిర్ణయం వంటివి అన్నీ దీని ద్వారానే పొందడం జరుగుతాయి. మనోవిజ్ఞానం ప్రకారం బుద్ధిని 'కాగ్నిషన్' అని సంబోధిస్తారు. దీన్ని బౌద్ధిక సంపదగా వాడడానికి కొన్ని విషయాలు జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. బుద్ధి యొక్క ఆయామములను (dimensions) వికసింపచేసుకుంటేనే వాటిని సరైన రీతిలో ఉపయోగించుకోవచ్చు.

బుద్ధిని సంపదగా ఉపయోగించుకోవడానికి మొదటి చరణం ధారా ప్రవాహమైన ఆలోచన. మనమెంత తొందరగా ఆలోచిస్తాము? మన ఆలోచనా ప్రవాహం తెగదు కదా? ఆలోచన పెడదోవలు పట్టదు కదా? ఇవన్నీ మన బౌద్ధిక ప్రతిభను తెలియచేస్తాయి. ఈ గుణం వ్యాసరచనకు, మాట్లాడడానికి లేదా ఏదైనా నిర్దిష్టమైన విషయం గురించి ఆలోచించడానికి అవసరం. కాబట్టి, ఆలోచన ఎల్లప్పుడూ శ్రేష్ఠమైన పదును మరియు ప్రవాహం కలిగి ఉంచుకోవడం అవసరం. దృఢ సంకల్పం, బలమైన ఉద్దేశ్యం కలిగి ఉండాలి. కాని వీటిని సాధించడానికి ఎన్నో రకాల ప్రక్రియలు ఉండాలి. ఒకే రకమైన ప్రక్రియను ఉపయోగిస్తున్నామంటే దాని అర్థము మనము మొండి వాళ్ళం, ఇది ఇలాగే చేస్తాను అనే రకం, కాని పని చేయడానికి చాలా విధానాలుంటాయి. ఒక విధానంతో సాఫల్యం దొరకకపోతే మరో విధానాన్ని అవలంబించాలి. పనులలో నాణ్యత కోసం కూడా విధానాలలో వెసులుబాటు కలిగి ఉండడం అవసరం. ఆలోచనలలో దృఢత్వంతో పాటు వెసులుబాటు కూడా అవసరమే.

మౌలికత ఉంటేనే బుద్ధి సంపదగా మారుతుంది. **మౌలికత అంటే మనం చేసే పనుల మీద మన ముద్ర ఉండాలి అంటే మన పనికి ఒక విశిష్టమైన గుర్తింపు ఉండాలి. పనులు మరొకరి నకలు కాకూడదు, చూడడానికి వికారంగా ఉండకూడదు. ఏది ఆలోచించినా సముచితంగా ఉండాలి, మాట్లాడే ప్రతిమాట ఆకర్షణీయంగా ఉండాలి, గుర్తింపు కలిగిఉండాలి. మనకు మనదైన ప్రత్యేక శైలి ఉండాలి, అది మనది మాత్రమే అయి ఉండాలి, మరెవరిదీ కాకూడదు. ఈ గుణమే మౌలికత.** అందుకే పేరున్న, బ్రాండున్న వస్తువులు ఎక్కువ అమ్ముడవుతాయి. ఎందుకంటే ఆ బ్రాండుకు కాని, ఆ పేరుకు కాని ఒక మౌలికత ఉంటుంది. ఒక ప్రత్యేకత గుర్తింపు ఉంటుంది, అది మరెవరికి ఉండదు. ఈ మౌలికత మనందరిలో ఉంది. ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత దాగి ఉన్నది. దాన్ని గుర్తించి, వికసింపచేసుకోవడం అవసరం.

మౌలిక ఆలోచనలతో పాటు క్రాంతికారీ (Revolutionary) భావాలు కూడా ఉండాలి. మన సామర్థ్యాన్ని మనం గుర్తించడం మనకు రావాలి. వర్తమానానికి, భవిష్యత్తుకు సంబంధించిన స్పష్టమైన ప్రణాళిక మనకుండాలి. నేటి రోజుతో పాటు

**మానసిక కాలుష్యం ఇతరుల లోపాలను ఎత్తి చూపుతుంది.**

భవిష్యత్తులోకి కూడా తొంగి చూడడం రావాలి. సుదూర ఆలోచనలుండాలి. మన ఋషులను క్రాంతిదర్శులనే వారు. క్రాంతి దర్శనం అంటే అవతలి వైపు చూడగలగడం, సుదూర భవిష్యత్తును గమనించగలగడం. ఎన్ని తరాలకైనా నిత్య నూతనంగా, సమయానుకూలంగా ఉండే ఆలోచనలు కలవారిని సంస్కర్తలని అంటారు. ఉదాహరణకు, స్వామి వివేకానంద లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పటికి అంతే ఉత్తేజ భరితమైనవి. నేటికి ఆ ప్రశ్నలు ఉన్నాయి. కాని వాటి స్వరూపమే మారింది. శ్రీ అరవిందులు, రమణమహర్షి మొదలైన ఋషులు కూడా సమాజ సంస్కర్తలే. ఎందుకంటే వారి ఆలోచనలోని సంవేదన అలా వ్యాపకమైనది. ఒకసారి స్వామి వివేకానంద కూర్చున్న వారల్లా ఉన్నట్టుండి లేచి అటూ ఇటూ తిరగడం మొదలు పెట్టారు. ఎందుకని అడిగితే, 'ఒక ఓడ సముద్రంలో మునిగిపోతోంది. అందులోని మునిగిపోతున్న యాత్రికుల సంవేదనలతో నిండిన సంవేదనాశీల మనస్సు కూడా మునిగి పోతోంది. అదే నా బాధకు కారణం' అని చెప్పారట. కాబట్టి మన ఆలోచనలు సంవేదనా శీలంగా కూడా ఉండాలి.

పరిస్థితులను జాగ్రత్తగా గమనించి నిర్ణయం తీసుకోవడం వల్ల, వచ్చే అవకాశాలను చక్కగా ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేకమైన సందర్భాలలో స్పందించాలంటే పరిస్థితిని తగు రీతిలో బేరీజు వేయడమే కాక తొందరగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం కూడా ఉండాలి. జీవితంలో సువర్ణావకాశాలు మాటిమాటికి రావు ఎప్పుడో ఒకసారి వస్తాయి. బుద్ధిమంతుడైతే సరైన నిర్ణయం తీసుకుని అవకాశాన్ని చేజిక్కుంటాడు. అందుకే ఏసు ప్రభువు ఇలా సెలవిచ్చారు. 'ఏదైనా మంచి వస్తువు వస్తే దాన్ని ముందు ఎడమ చేత్తోనైనా పట్టేసుకో, ఏమో ఎవరికి తెలుసు, కుడి చేయి చాచే లోపల ఆ వస్తువు నేలరాలుతుందేమో!'

బుద్ధిమంతుడైన వ్యక్తి తాను నిర్మించుకున్న బాటలోనే నడుస్తాడు. ఏ దిక్కులో ప్రతిభ పయనిస్తే, ఆ దిక్కులోనే దారి ఏర్పడిపోతుంది. అలా దారిని ఏర్పరిచినవారు ఒక కొత్త పరిణామాన్ని స్థాపిస్తారు. పరంపరలకన్నా వివేకానికి విలువనిచ్చి ఒక కొత్త పరంపరకు తావునిస్తారు. సామాన్య మానవుడు మాత్రం సాంప్రదాయంగా అనుసరించే మార్గాన్నే వాడడానికి అలవాటుపడి ఉంటాడు, ఇష్టపడతాడు. అతనిలో కొత్తగా ఆలోచించడానికి కాని, చేయడానికి కాని ధైర్యం ఉండదు. కాని ధైర్యవంతులు, శూరులు మాత్రం తుఫానుని కూడా మార్చగలిగే సత్తా కలిగి ఉంటారు. వారు జీవితానికి ఒక కొత్త దిశనిస్తారు. జీవించడానికి ఒక కొత్త, ప్రత్యేకమైన ప్రణాళికను వేసుకుంటారు. వారి ప్రణాళికలు పురాతనత్వ లోతుల నుండి నిత్యనూతన రూపంలో ప్రస్ఫుటిస్తాయి. ఇటువంటి వారి జీవితం ప్రయోగాత్మకంగా ఉంటుంది. వీరు ఎప్పుడూ కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ కొత్త విషయాలను కనుక్కుంటూ ఉంటారు.

వస్తువులను స్పష్టంగా గమనించడంలో కూడా బుద్ధి యొక్క క్రియాశీలత దాగి ఉంది. సామాన్య వ్యక్తి సరళమైన, వాడుక భాషలో చెప్పింది మాత్రమే అర్థం చేసుకోగలడు. కాబట్టి ఆ విధంగా అర్థమయ్యేటట్టు చెప్పడంలోనే లాభం ఉంటుంది. అలా జరగాలంటే ముందు మనకు ఆ విషయము మీద స్పష్టత ఉండాలి. సూత్ర, ప్రతీకల భాష ఎంతో నిగూఢంగా ఉంటుంది. కొంతమందికి మాత్రమే అది తెలుస్తుంది, అర్థమవుతుంది. కాని మిగిలిన వారికి అది ఎంతో కష్టంగాను, విసుగ్గాను ఉంటుంది. సూత్రాల యొక్క సరళ వ్యాఖ్యానమే వారికి అర్థమవుతుంది. ఈ తథ్యాన్నే ఆధారం చేసుకుని నేటి కంపెనీలు సరళమైన ప్రకటనలతో వారి వస్తువులను విక్రయిస్తుంటారు. **మన ఆలోచనలు స్వచ్ఛంగా, స్పష్టంగా ఉండాలి, అప్పుడే మనం చెప్పదలుచుకున్నది పక్కవారికి అర్థమయ్యేటట్టు తెలుపగలము.**

బుద్ధి యొక్క విశేష లక్షణం తర్కించడం. తర్కం సరైనది కాకపోతే అది అల్లుకున్న సాలెగూడులో అదే చిక్కుకుంటుంది. ఇటువంటి విషమ పరిస్థితి ఊహాగానాల వల్ల వచ్చి ద్వంద్వాన్ని కలుగజేస్తుంది. ద్వంద్వంతో నిండిన మనస్సు శంక, సందేహాలతో సతమతమవుతూ ఒత్తిడికి లోనవుతుంది. కాబట్టి **మనస్సు సకారాత్మకంగా (positive way) ఆలోచించడం నేర్చుకోవాలి,** బుద్ధి సరైన వస్తువులను ఎన్నుకోవడం నేర్చుకోవాలి. జీవితంలోని పరిస్థితులు, ప్రారబ్ధం ఎప్పుడూ ద్వంద్వాన్నే కలుగజేస్తుంటాయి. అసలు ద్వంద్వమే కలుగకుండా ఉండడం సంభవం కాదు, కాని మనం అందులోంచి బయటపడాలి. అందులో చిక్కుకుని అవతలి వారిని తప్పు పట్టడం కన్నా, మనకై మనమే నేర్పుగా బయట పడడం ఎంతైనా శ్రేయస్కరం. ఇది కూడా బలమైన మానసిక స్థితికి నిదర్శనం. దీన్ని ఒక బౌద్ధిక సంపద రూపంలో అందంగా ఉపయోగించుకోవచ్చు.

మనిషి ఈ ద్వంద్వం నుండి దాటి, దానికి అతీతంగా ఉండడం నేర్చుకుంటే తన అభిరుచిని లక్ష్యం సాధించే దిశగా పయనింప జేయగలడు. ఇటువంటప్పుడే బుద్ధి చెల్లాచెదరవకుండా విషయం మీద ఏకాగ్రత పెంచడం సాధ్యపడుతుంది. మన బౌద్ధిక సామర్థ్యాన్ని విషయం యొక్క మూలాలలోకి ప్రవేశింపచేసి, ఆ తరువాత విస్తరింపజేయాలి. అలా చేయడం వల్ల విషయం యొక్క లోతులలోకి పోయి దానిని అన్ని వైపుల నుండి చూడగలగాలి.

**తప్పులెన్నువారు తమ తప్పులు ఎరుగరు.**

ఈ విధంగా ఎన్నో కొత్త కోణాలు వికసిస్తాయి. ఏదైనా పనిలోగాని, విషయంలోగాని లభించిన ఈ కౌశలం నేడు కూడా జీవన సమీక్ష చేసుకోవడంలో పనికొస్తుంది. జీవితం వైవిధ్యంగా, పెడదోవ పట్టకుండా ఉండడానికి, మనం నిర్దేశించుకున్న లక్ష్యం వైపు మనస్సు ఉంచుకోవడంలో బుద్ధి ముఖ్య పాత్ర వహిస్తుంది.

జీవితంలోని అతి పెద్ద సమస్య మనస్సును, బుద్ధిని నియంత్రించలేకపోవడం. మనస్సును, బుద్ధిని నియంత్రించలేక పోవడం వల్ల అవి అడవి జంతువుల్లాగా అటూ ఇటూ తిరిగి చివరికి ఎన్నో సమస్యలు సృష్టించిపెడతాయి. వీటిని ఒకే విషయం చుట్టూ ఆలోచించేటట్టుగా నియంత్రించగలగాలి. ఈ ప్రక్రియ ద్వారా మన దృష్టి లక్ష్యాన్ని సరిగ్గా విశ్లేషించగలదు, ఉపలబ్ధులను గమనించగలదు. బౌద్ధిక శక్తి ఒక బిందువుపై స్థిరపడితే చమత్కారం సృష్టించగలదు. అసంభవం కూడా సంభవం కాగలదు. కాబట్టి బుద్ధిని అదుపులో ఉంచితేనే సమస్త ఇంద్రియాలను వాటి వాటి పనులలో పురమాయించవచ్చు. ఇది భౌతిక సాఫల్యమే కాదు, ఆత్మిక ప్రగతికి కూడా దారిని తెరవగలదు.

**బౌద్ధిక సామర్థ్యం యొక్క సార్థకత కష్టాన్ని ఎదుర్కోగలిగి నప్పుడే ఉంటుంది. సవాలుని స్వీకరించి ప్రమాదాన్ని ఎదుర్కొన్న వాడే విజేత.** ఎవరైతే వివేకంతో వారి పనులకు అడ్డొచ్చే దాన్ని పట్టించుకోరో వారినే విజయం వరిస్తుంది. సవాళ్ళతోను, ప్రమాదాలతోను ఆడుకునే వారి ధైర్యం స్థిరంగా ఉంటుంది. ప్రతి సవాలు వారికొక కొత్త విషయం నేర్పుతుంది, ప్రతి ప్రమాదం వారి మనోబలాన్ని కొన్ని రెట్లు పెంచుతుంది. ఆటల్లోగాని, వ్యాపారంలోగాని, రాజనీతిలోగాని, సామాజికంగాకాని అన్ని చోట్లా బుద్ధి అవసరం. **బలహీనమైన మానసిక స్థితి మనిషిని ఓడిస్తుంది.** సుదృఢ సాహసవంతుడు ఎప్పుడూ విజేతగా నిలుస్తాడు. ఈ విధంగా బుద్ధిని సంపదగా వాడచ్చు. వ్యక్తిత్వంలో దాగి ఉన్న శక్తులను బహిర్గతం చేయడం కూడా సాధ్యమవుతుంది. ఇదే విధంగా వ్యవహార, భావనాత్మక సామర్థ్యాలను కూడా ఉపయోగించుకోవచ్చు. అలాగైతేనే వ్యక్తిత్వం శక్తివంతంగా, ప్రభావవంతంగా మారుతుంది.

*– అఖండజ్యోతి, డిశంబరు 2005*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## తప్పు తెలుసుకో

*భార్యాభర్తలు భేదాభిప్రాయంతో ఒకరినొకరు కటు శబ్దాలతో నిందించుకున్నారు. మాట్లాడుకోవడం మానేశారు. ఏడు సంవత్సరాల వయస్సుగల వారి పుత్రుడు ఎక్కడో విన్న "కటు శబ్దాలు వినవద్దు" అనే పాటను తండ్రి గదిలో కూర్చుని పాడసాగాడు. అందమైన ఆ పాటని తండ్రి విన్నాడు. మనస్సు చలించింది. కుమారుడిని దగ్గరకు తీసుకుని ఈ పాట మీ అమ్మ దగ్గర కూడా పాడు అని ప్రేమగా పలికాడు. ఆ బాలుడు తండ్రి చెప్పినట్లు వెంటనే చేశాడు. పాట విన్న తల్లికి కోపం, నవ్వు కూడా వచ్చాయి. వెంటనే కొడుకుతో ఈ పాట మీ నాన్న దగ్గర పాడు అన్నది. ఏమి చేయలేమని బాలుడు రెండు గదుల మధ్య కూర్చుని పాడుకోసాగాడు. దుఃఖంతో అతని గొంతు బొంగురుపోయింది. తల్లిదండ్రులు అతనిని చూచి మౌనంగా ఉండిపోయారు. తప్పు తెలుసుకున్న తల్లిదండ్రులు పిల్లవాడిని ఎత్తుకుని అక్కున చేర్చుకున్నారు. చేసిన తప్పును ఒప్పుకోవడానికి సంకోచించకూడదు. చిన్న పిల్లలు చెప్పినా సరే తప్పును ఒప్పుకోవడంలోనే మన పెద్దరికం వ్యక్తమవుతుంది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

## తొలగిన భ్రమ

*ఒక యువకుడు ఒక యువతిని గాఢంగా ప్రేమించ సాగాడు. ఆ వయస్సులోని ప్రేమలో ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ ఉంటుంది. విజ్ఞులైన అతని తల్లితండ్రులు ఈ సంబంధం సరైనది కాదని భావించి కాదన్నా ఆ యువకుడు ఆమెనే వివాహమాడుతానని కూర్చున్నాడు. తల్లిదండ్రులు ససేమిరా అంటున్నారు. తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని ఆ యువకుడు ఒక మహాత్ముడిని కలిసి తన గోడు చెప్పుకున్నాడు. ఆ మహాత్ముడు ఆ పిల్ల తల్లితండ్రులు అంగీకరిస్తారో లేదో తెలుసుకోమని సలహా ఇస్తాడు. కాని యువకుడు తన ప్రేమ కోసం తాను ఏ త్యాగానికైనా సిద్ధమేనంటాడు. దానికి మహాత్ముడు చిరునవ్వు నవ్వి నాయనా! నీ తల్లి నుండి, తండ్రి నుండి, నీ సోదరుల నుండి నీకు ఇంత వరకు లభించిన ప్రేమ తక్కువేమి కాదు. కాని వారి ప్రేమ కొరకు ఏ త్యాగం చేయగలిగావు? ఇప్పుడు నీవు చేయబోయే త్యాగం ప్రేమ కొరకో, కామం కొరకో కాస్త జాగ్రత్తగా ఆలోచించు అని అంటాడు. మహాత్ముని ఆ వాక్కులు యువకుని బాగా ఆలోచింపజేశాయి. భ్రమ తొలగింది. వాస్తవం కన్నుల ముందు సాక్షాత్కారించింది. వివాహాన్ని గురించిన మొండి పట్టుదలను వదలివేశాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఓర్పులేని వారు సత్వర ఫలితాల కొరకు అడ్డ త్రోవలలో అన్వేషిస్తారు.**

బోధ కథ

# మమకారం ఫలితంగా పురుగు జన్మ

భిక్షువు తిష్య ముఖంపై సంతోష రేఖ తళుక్కుమన్నది. ఒక్కో సారి తన చేతిలో వెన్నలా మెత్తగా ఉన్న దుప్పటివైపు చూస్తున్నాడు. ఒక్కోసారి తన సోదరి సువర్ణవైపు చూస్తున్నాడు. సువర్ణ నెలల తరబడి నిర్విరామంగా శ్రమించి ఆ దుప్పటి తయారుచేసింది. దాని రంగులు ఇంద్ర ధనుస్సు రంగుల్లా అద్భుతంగా ఉన్నాయి. కళాత్మకతకు అద్భుత నమూనా ఆ దుప్పటి. ఒక చేతితో ఆ దుప్పటి పుచ్చుకుని, మరో చేతితో దాన్ని నిమురుతున్న తిష్యకు వర్షావాసం (చాతుర్మాస్యం) నెలలు గుర్తు వచ్చాయి.

భిక్షు సంఘ నియమాల ప్రకారం భిక్షువులు వర్షాకాలం మూడు నాలుగు నెలలు ఒకే స్థలంలో ఉండి సాధన చేయాలి. వర్షావాసం తర్వాత భిక్షువులు తమ యాత్ర తిరిగి ప్రారంభిస్తారు. ఆ సమయంలో ప్రజలు వారికి బహుమతులు ఇస్తారు. పెద్ద బహుమతులు కాక చిన్న చిన్న బహుమతులు మాత్రమే తీసుకోవాలన్నది వారి మరో నియమం.

బుద్ధ భగవానుని ఆదేశం ప్రకారం భిక్షువులు మూడు వస్త్రాలను మాత్రమే కలిగి ఉండాలి. అంతకు మించి వస్త్రాలను తమ వద్ద ఉంచుకోకూడదు. ఎవరైనా దుప్పటి బహూకరిస్తే, పాత దుప్పటి వదలివేయాలి. అలాగే, ఎవరైనా భిక్షా పాత్ర బహూకరిస్తే, పాత భిక్షాపాత్రను వదలివేయాలి.

గత వర్షాకాలం తర్వాత భిక్షువు తిష్య గ్రామం విడిచి వెళ్ళిపోతున్నప్పుడు ఒక గ్రామవాసి అతడికి ఒక దుప్పటి బహూకరించాడు. ఆ దుప్పటి చాలా మోటుగా కంబళీలా ఉంది. తాకితే గరుగ్గా, గొగ్గులు గొగ్గులుగా ఉంది. ముడులు ముడులుగా ఉంది. తిష్య ఎంతో అయిష్టంగా దాన్ని తీసుకున్నాడు. భిక్షు సంఘ నియమాల ప్రకారం తాను దాన్ని గురించి ఏమీ మాట్లాడకూడదు. బుద్ధ భగవానుడు విధించిన నియమాలు అలా ఉన్నాయి మరి. ఆ నియమాల ప్రకారం భిక్షువు తనకు ఇచ్చిన దాన్ని గురించి ఫిర్యాదు చేయకూడదు. ఆ వస్తువు లోపాలను చూపకూడదు.

సాధనా మార్గంలో ముఖ్యమైన ఆటంకం చాతుర్యం. ఆ చాతుర్యం ఏదో ఒక ఉపాయం కనుక్కొంటూనే ఉంటుంది. తిష్య కూడ తన చాతుర్యం ఉపయోగించాడు. ఒక ఉపాయం ఆలోచించాడు. ఆ గ్రామంలో అతడి సోదరి సువర్ణ నివసిస్తోంది. తిష్యకు ఆ గ్రామవాసి దుప్పటి బహూకరిస్తున్నప్పుడు ఆమె ప్రక్కనే నిలబడి ఉంది. ఆమె తన సోదరునికి వీడ్కోలు ఇవ్వడానికి వచ్చింది. భిక్షువు తిష్య ఏమీ మాట్లాడకుండా మనసులో బాధపడుతూ ఆ దుప్పటి ఆమె చేతిలో పెట్టాడు. అతడు నోటితో ఏమీ చెప్పకపోయినా, అతడి ముఖంలో కనిపించిన బాధ అంతా చెప్పింది. తిష్య మనసులోని భావాలను ఆమె క్షణంలో కనిపెట్టింది. కొద్దిరోజుల్లో మంచి అందమైన దుప్పటి నీకు ఇస్తానని ఆమె సైగతోనే అతడికి భరోసా ఇచ్చింది.

ఈ మౌన వాగ్దానంతో తిష్య మనసు తేలికపడింది. సువర్ణ ఆ దుప్పటి తీసుకుని ఇంటికి వెళ్ళింది. సన్నటి దారంతో అందంగా, మెత్తగా ఉన్న దుప్పటి తయారు చేసింది. ఈలోగా భిక్షువు తిష్య ఆ దుప్పటి కోసం ఎదురుచూస్తున్నాడు. మనసులోనే ఆ దుప్పటి గురించి ఊహలు అల్లుకున్నాడు. కల్పనా లోకంలో విహరించాడు. ఆ దుప్పటి ఇలా ఉంటుంది. కాదు ఇలా ఉంటుంది దాన్ని ఇలా కప్పుకుంటాను. కాదు ఇలా కప్పుకుంటాను అనుకుంటూ కోరికలు పెంచుకుంటూ పగటి కలలుకంటూ కాలం వెళ్ళదీస్తున్నాడు.

నేడు ఆ ఘడియ రానేవచ్చింది. సువర్ణ తాను నెలల తరబడి శ్రమించి అందంగా తయారుచేసిన దుప్పటిని అతడి చేతిలో పెట్టింది. అతడి మనసు నెమలిలా నాట్యం చేసింది. దుప్పటి అందిన తర్వాత అతడి ఊహలు రంగులు మారాయి. క్రమ క్రమంగా వాటికో రూపం వచ్చింది. ఆ రూపం అతడి మనసనే ఆకాశాన్ని ఆవరించింది. అహంకారపు మెరుపు ఆ రూపం చుట్టూ మెరిసింది. ఇంత అందమైన దుప్పటి బుద్ధ భగవానుని వద్ద కూడ లేదు. రేపు నేను ఈ దుప్పటి కప్పుకుని బయలుదేరితే భిక్ష సంఘంలో ఇలాంటి దుప్పటి మరెవరికీ లేదని అందరికీ తెలుస్తుంది అని భిక్షువు తిష్య అనుకుంటున్నాడు.

చీకటి పడుతోంది. ఇప్పుడు ఆ దుప్పటి కప్పుకోవడం వృధా. ఇప్పుడు దీన్ని కప్పుకున్నా, ఈ చీకటిలో దీని అందం ఎవరికి కనిపిస్తుంది? ఇతరులకు చూపడంలోనే మజా అంతా ఉంది అని ఆలోచిస్తున్నాడు. అతడు ఎంతో శ్రద్ధగా, మరెంతో ప్రేమగా ఆ దుప్పటిని చిలక కొయ్యకు తగిలించాడు. నిద్రపోవడానికి ప్రక్క మీద పడుకున్నాడు. సరైన నిద్ర ఎలా పడుతుంది? నిద్రలో కూడా అతడు ఆ దుప్పటి గురించి రకరకాల కలలు కన్నాడు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ఆ దుప్పటి కప్పుకుని అందరికీ

**వ్యతిరేక భావావేశం అంతర్గత శక్తిని హరిస్తుంది.**

చూపుదామా అనే వాసన, మమకారం అతడి చుట్టూ తిరుగుతున్నాయి. కానీ, ఆ రాత్రే అతడి జీవితం పూర్తయింది. అతడు చనిపోయాడు. ఆ దుప్పటిపై అతడి మమకారం ఎంత బలీయంగా ఉన్నదంటే అతడు బట్టలు తినివేసే పురుగుగా జన్మించాడు. ఆ దుప్పటిలో దాగికొని కూర్చున్నాడు.

మరునాడు ఉదయం సంఘంలోని భిక్షువులు అతడి శరీరాన్ని దహనం చేశారు. నియమం ప్రకారం వారా దుప్పటిని తమలో తాము పంచుకోవాలి. అందుకోసం వారు దాని మడతలు విప్పారు. ఒక భిక్షువు చనిపోతే, అతడి వస్తువులను భిక్షువులు పంచుకోవాలనే నియమాన్ని బుద్ధ భగవానుడు విధించి ఉన్నాడు. ఎవరి వద్ద ఆ వస్తువులు లేకపోతే వారికి అవి ఇవ్వాలన్నది నిబంధన. ఆ నిబంధనను పాటించడానికి వారా దుప్పటి మడతలు విప్పారు. లోపల ఉన్న ఆ పురుగు (కొత్త జన్మ ఎత్తిన తిష్య) ఇలా కేక వేసింది "నా వస్తువును మీరంతా ఎందుకు దోచుకుంటున్నారు" ఇలా కేక వేస్తూ ఆ పురుగు ఇటూ అటూ తిరగసాగింది.

ఈ పురుగు పెట్టిన కేకను బుద్ధ భగవానుడు మాత్రమే విన్నాడు. మరెవరికీ ఆ కేక వినిపించలేదు. ఆ కేక విన్న బుద్ధ భగవానుడు నవ్వుకున్నారు. ఆ దుప్పటిని అక్కడే ఉండనివ్వమని భిక్షువులకు చెప్పు అని ఆయన ఆనందుణ్ణి ఆదేశించారు. ఏడవ రోజున ఆ పురుగు చనిపోయింది. పురుగుకు ఆయుష్షు ఏ మాత్రం ఉంటుంది కనుక! ఆ దుప్పటిని తమలో తాము పంచు కోవాలని పురుగు చనిపోయిన తర్వాత బుద్ధ భగవానుడు చెప్పారు.

భగవానుడు ఇలా ఆదేశించడం భిక్షువులకు ఆశ్చర్యం కలిగించింది. వారం రోజులు ఆగి ఆ తర్వాత ఇలా ఆదేశం ఇవ్వడానికి కారణం ఏమిటని వారు ఆయనను అడిగారు. తిష్య చనిపోయి పురుగుగా జన్మ ఎత్తాడని, ఆ పురుగు చనిపోయిందని ఆయన వారికి చెప్పారు. భిక్షువుల ఆశ్చర్యం మరింతగా పెరిగింది. భిక్షువులంతా ఇలా అనుకున్నారు. "ఎంత చిత్రమైన విధి విధానం ఇది. మన తిష్య పురుగుగా జన్మించడం వింతగా ఉంది".

భిక్షువులకు సమాధానం చెప్తూ బుద్ధ భగవానుడు ఇలా అన్నారు, వాంఛాగ్రస్తుడు పలుమార్లు మరణిస్తాడు. ఎన్ని వాంఛలు ఉంటే అన్నిసార్లు మరణం, జీవుని ప్రతి వాంఛా ఒక్కొక్క జన్మకు, ఒక్కొక్క మరణానికి కారణం అవుతుంది.

ఇలా చెప్తూ భగవానుడు భిక్షువులకు ఈ ధర్మవాక్యం వినిపించారు –

**అయసా వ మత సముట్ఠితం తనట్ఠాయ తమేవ ఖాదతి।**
**ఏవం అతిధోవ చారినం సాని కమ్మాని నవన్తి దుగ్గతి ॥**

అనగా

తుప్పు, ఇనుము నుండి ఉత్పన్నమై దానినే తినివేస్తుంది. ఆ విధంగానే సాధనాత్మకమైన అనుశాసనాన్ని ఉల్లంఘించే మనిషి కర్మ అతడిని దుర్గతి పాలు చేస్తుంది.

ఈ ధర్మ వాక్యం విన్న భిక్షువులు ఆలోచనలో పడ్డారు. ఆసక్తి (మమకారం), అసూయ ద్వేషాలతో నిండిన అహంకారం సాధనా పథంలో కలిగే అవరోధాలు. వీటిని తొలగించు కోవడంలోనే సాధకుని కళ్యాణం ఇమిడి ఉంది.

ఇలా ఆత్మచింతన చేస్తూ భిక్షువులు భగవానునికి ప్రణామం చేసి, ధ్యానం చేయడానికి వెళ్ళారు.

★★★

## శ్రీ గాయత్రీ శతకం

**75.** ***స్ఫటిక, మల్లిక, కుంకుమ, శంఖు వంటి***
***రంగులిరువది నాలుగు హంగులుండి***
***కొలుచు వారికి తేజము గూర్చుచుండు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– గాయత్రీ మహామంత్రం యొక్క 24 అక్షరాల ప్రకాశ కిరణాలు 24 రంగులు. అవి : చంప, అతసీ, స్ఫటిక, కమల, సూర్య, కుంద, శంఖు, ప్రవాళ, పద్మపుత్ర, పద్మరాగ, ఇంద్రనీల, ముక్తా, కుంకుమ, అంజన, వైఢూర్య, పసుపు, కుంద, ద్రధ, సూర్యకాంతి, చిలుకతోక, శతపత్ర, కేతకీ, మల్లిక, గన్నేరు. ఇట్టి మంత్రమును నిత్యం కొలుచువారికి జీవితంలో తేజస్సునిస్తుంది వేదమాత.*

**76.** ***నాద బీజము లిరువది నాల్గు గలిగి***
***మధుర నాదమ్ము రవళించు మంత్రఝురిని***
***ఆలపించగ నొనగూర్చు నాత్మబలము***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– గాయత్రీ మంత్రమునందలి 24 అక్షరాలకు 24 బీజములున్నవి. అవి : ఓం, హ్రీం, శ్రీం, క్లీం, హోం, జూం, యం, రం, లం, వం, శం, సం, ఐం, క్రోం, హుం, హ్రీం, పం, ఫం, టం, రం, దం, ధం, క్షం, లుం. ఇట్టి మంత్రమును నిత్యం ఆలపిస్తే ఆత్మబలాన్ని పెంచుతుంది వేదమాత.*

రచన : సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

నిరాశావాదంతో కుంచించుకుపోయేవారు చొరవను చూపలేరు.

# మనిషి కోరుకుంటే తన ఆరవ ఇంద్రియాన్ని వికసింపచేసుకోవచ్చు

మనిషిలో అయిదు జ్ఞానేంద్రియాలే కాకుండా మరొక ఇంద్రియం ఆరవది ఉన్నది. దీనిని సిక్స్ సెన్స్ (Sixth Sense) లేక ఆరవ తన్మాత్ర అని కూడా అంటారు. ఇది అన్నిటికన్నా అత్యంత మహిమాన్వితమైన, శక్తివంతమైన తన్మాత్ర. కాని ఇది నిద్రావస్థలో ఉంటుంది. సంయోగ వశంగా అకస్మాత్ రూపంగా అప్పుడప్పుడు కొన్ని సందర్భాలలో ఇది జాగృతమవుతూ తన చమత్కారీ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకో గలిగేటట్లుగా కన్పిస్తూ ఉంటుంది. సాధకులు, యోగులు తమ సాధన పురుషార్థంలో దీనిని జాగృతపరచి తమ సాధనను వికసింప చేసుకొంటూ ఉంటారు. దీనిని వారు తమ శక్తిని, సామర్థ్యాన్ని లోక కళ్యాణం కొరకు వినియోగిస్తుంటారు.

సుప్రసిద్ధ రచయిత వైజ్ఞానిక వేత్త రూథర్ ఫోర్డు ప్లేట్ తన రచనలలో ప్రతి వ్యక్తిలో కూడా ఆరవ జ్ఞానేంద్రియం ఉంటుందని, అయితే దాని సామర్థ్యాన్ని మనం గుర్తించలేని స్థితిలో ఉంటామని తెలిపాడు. ఆయన తన స్నేహితురాలి అనుభవాన్ని గురించి ఉదహరిస్తూ 'ఆమె ఒక మైలు దూరంలో ఎక్కడో పోగొట్టుకున్న ఏదైనా ఒక వస్తువు వివరాలను చెప్పగలదని, ఈ విధమైన చెప్పగలిగే శక్తి తనకు ఎలా లభిస్తుందో ఆమెకు తెలియదని, ఆ మహిళ ఒక గొప్ప జీవ వైజ్ఞానికవేత్తని తెలుపుతూ, ఆమె ఒక్కోసారి కొద్ది విశ్రాంతి, కొంత చల్లదనాన్ని పొందిన తరువాతనే ఈ శక్తిని పొందుతుందని తెలిపాడు. మనందరిలో కూడా ఈ శక్తి ఉంటుంది కాని నిద్రావస్థలో ఉంటున్నందువల్ల మనం దానిని గుర్తించలేము.

ఈ ఆరవ ఇంద్రియం ఒక్క మానవునిలోనే గాక మానవేతర ప్రాణులలో కూడా ఉంటుంది. నీచ ప్రాణులుగా మనం అనుకొంటున్న కొన్నింటిలో ఈ శక్తి అత్యంత వికాసవంతంగా, పూర్తి సక్రియతతో కూడి ఉంటుంది. ఈ విధమైన గొప్ప శక్తి ఆధారంగా ఈ అమాయక జీవులు తమకు ఎదురయ్యే శత్రువుల బారి నుండి తమను తాము రక్షించుకొంటూ, జీవితాలను గడుపుతూ ఉంటాయి. మనిషి చెవులు వినలేని, గ్రహించలేని కొన్ని ఈల శబ్దాలను కుక్కలు సహజంగానే వినగలుగుతాయి. ఎత్తైన చెట్లు కొమ్మలపైన ఉన్న గుడ్లగూబలు రాత్రి చీకటిలో నేల మీద గడ్డిలో తిరుగుతున్న ఎలుకలను చూడగలుగుతాయి. కుక్కలను పెంచే కొంతమంది తమ కుక్కలు దారులను గుర్తు పట్టగలవని, వాసనను గుర్తించే సామర్థ్యం గురించి చాలా గొప్పగా వర్ణించి చెపుతూ ఉంటారు. రాయల్ కాలేజ్ ఆఫ్ వెటర్నరి సర్జన్ సుప్రసిద్ధ శల్య చికిత్సకుడు అయిన డా॥ ఆర్.హెచ్.స్మిత్ తన పరిశోధన ద్వారా ఎయిర్‌డెల్ పేరు గల ఒక కుక్క కొన్ని వేల మైళ్ళ యాత్రను లారీల మీద బస్సుల మీద ప్రయాణించిన తరువాత తిరిగి తన యజమాని వద్దకు చేరగలిగిందని, ఈ యాత్రలో అరమైలు వెడల్పున్న ఒక నదిని కూడా ఈది చివరకు రెండు నెలలలో ఇంత సుదీర్ఘ యాత్రను ముగించిదని తెలియపర్చాడు.

విఖ్యాత జర్మన్ ప్రాణ శాస్త్రజ్ఞుడైన కార్లవన్ ఫ్రిన్ తన అధ్యయన పరిశోధనలో తేనెటీగలు తిన్నగా నాలుగు మైళ్ళ దూరంలో గల పువ్వుల మకరందం కొరకు వెళ్ళివస్తాయని, అవి పోలరైజ్‌డ్ (Polarised) ప్రకాశం శక్తి చేత తమ మార్గాన్ని తెలుసుకోగలవని, ఈ రకమైన ప్రకాశ కిరణాలు వాటి నేత్రాల ద్వారా వెలువడుతున్నందున దాని సహాయంతో తమ పనులను చక్కబెట్టుకొని సూర్యుని వెలుగులో కూడా దూరంగా ఉన్న పూలను గుర్తిస్తాయని తెలుపుతూ, ఈ విధంగానే చిమ్మ చీకటిలో కూడా చేపలు (Fish) గుంపులు గుంపులుగా ఉన్న చేపల సమూహాలలో ఏ చేపను ఢీకొనకుండా నిశ్చింతగా అటూ ఇటు తిరుగుతూ ఉంటాయని తెలియపర్చాడు. శబ్ద తరంగాల సహాయంతో ఇవి స్పందిస్తూ ఉంటాయి. నీటిలోని మొసళ్ళ కాలి కదలికల సవ్వడుల నుండి ఎవరైనా పైపు లేక సిగరెట్టు త్రాగినప్పుడు నీటిలో రాలిపడే "నుసి" వల్ల ఏర్పడే అతి చిన్న శబ్దాల వరకు కూడా స్పందించగలవు. చాలా చేపలకు ప్రక్కనున్న తన్మాత్ర అవయవం ద్వారా నీటిలో రేగే అతిచిన్న కదలికలను గాని, లేక చిన్న ప్రవాహపు మార్పులను గాని పసిగట్టగలిగే సామర్థ్యంగలవిగా ఉంటాయి. ఈ తన్మాత్ర ప్రస్తుత విజ్ఞానపరిధిలో గల విద్యుత్ అయస్కాంతంవలె, రాడార్ వేవ్స్ (Radar waves) వలె, ఇన్‌ఫ్రారెడ్ కిరణముల వలె (Infrared light) ఉంటుంది. ఈ చిన్ని ప్రాణులు ఈ తన్మాత్ర సహాయాన్ని తమను తాము రక్షించుకోవడంలో వినియోగించుకొంటాయి.

ప్రసిద్ధ జీవ వైజ్ఞానికుల అభిప్రాయం ప్రకారం అన్ని జీవ రాశులలో భౌతిక శక్తి ఒకే విధంగా ఉంటుందని ఈ విధంగానే

**నిరాశావాదులు పనులను వాయిదా వేస్తుంటారు.**

పశు పక్షి చేపలు మొదలైన వాటిలో ఉన్న తన్మాత్ర మానవునిలో కూడా ఉన్నప్పటికి అది అచేతన స్థితిలో పడి ఉన్నదని స్పష్టంగా తేలిందని చెప్పుట జరిగింది. అంతేగాక వేడి-చల్లదనం గ్రహించగలిగే తన్మాత్రలు విశిష్ఠ నాడీ తంతువుల ద్వారా సుషుప్తస్థితిలో ఉన్న వెన్నుపూసలోని నాడీ మండలంలోనికి ప్రవేశించి, అక్కడ నుండి దానికి సంబంధించిన శరీరము అంతా విస్తరించే ఒక వలలాగా (Net) ఉంటుందని, అయితే ఈ తన్మాత్ర ముఖ్యంగా వీపు వెనుకభాగంలో ఉండి వేడి తన్మాత్రను స్పందింపచేస్తుందని తెలిపారు. జన్మతోనే 'పుట్టు అంధులు' గా ఉన్నవారిలో ఒక విశేషమైన తన్మాత్ర శక్తి ఎక్కువగా ఉంటుందని, దాన్ని ఫేషియల్ విజన్ (Facial Vision) అని అంటారని, కొన్ని కండరాలలోని టెండాన్స్ (Tendons) దాని పనితీరులో ముందుగానే ఆ తన్మాత్రలు వికాసం చెంది ఉంటాయని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. మనిషి పైకి క్రిందకు వంగినప్పుడు అతని గురుత్వాకర్షణ కేంద్రం (Centre of gravity) మీద ఆధారపడి తన స్థిరత్వాన్ని నిలుపుకొంటాడు. అలాగే నడచుటలో దుముకుటలో తన శరీరాన్ని నియంత్రించుకో గలుగుతున్నాడు.

మనిషి తన చెవుల ద్వారానే కాకుండా శరీరం ద్వారా (చర్మం ద్వారా) కొన్ని శ్రవణాతీత శబ్దాలను వినగలడని వైజ్ఞానికులు తమ ప్రయోగాల ద్వారా నిరూపించగలిగారు. ఒక ప్రయోగంలో క్రిస్టల్ (Crystal)లోని విభిన్న కోణమూలాలలో విద్యుత్ తరంగాలను ప్రసరింపచేసి శ్రవణాతీత కంపనలు పుట్టించ గలిగారు. ఈ విధమైన ప్రకంపిత ధ్వనులను శరీరం విభిన్న భాగాల మీద స్పర్శింపచేసినప్పుడు కంఠానికి వెనుక మెడమీద, చెవి ప్రక్క భాగాలలో మానవ శరీరం అధిక సంవేదనం చెందినట్లు తెలుసుకో గలిగారు. ఈ విధమైన శ్రవణాతీత తరంగాలను వలయాలుగా (Circles) చేసి పంపినప్పుడు వినికిడి యంత్ర మాధ్యమము ద్వారానే కాకుండా, మామూలు చెవి ద్వారా కూడా వినగలగటం సంభవమైంది. **మనకున్న పంచ తన్మాత్రల శక్తిని సాధన ద్వారా ఎక్కువ పెంచుకోగలిగితే మనలోని ఇతర తన్మాత్రలు కూడా వికసింపచేసుకోవచ్చని వైజ్ఞానిక వేత్తలు నిరూపించారు.** ఒక అంధ బాలకుడు తన నోటి ద్వారా క్లికింగ్ సౌండ్ (clinking sound) చేసుకొంటూ, ఆ ధ్వని యొక్క ప్రతిధ్వని ఆధారం మీద గబ్బిలంలాగా ఏ విధమైన అవరోధం లేకుండా రోడ్డు మీద సైకిల్‌ని నడపటంలో సమర్థుడవుతాడు. ఈ ప్రక్రియ రాడార్ సిస్టం (Radar System) మీద ఆధారపడే విధంగా ఉంటుంది.

ఈ విధమైన ఎన్నో రకాల అతీంద్రియ శక్తులు మనలో నిక్షిప్తమై ఉన్నాయి వాటిలో భవిష్యత్ దర్శనం కూడా ఒకటి. భవిష్యత్‌లో జరగబోయే సంఘటనలు కూడా ముందుగా తెలుసుకోవచ్చు. విశ్వవిఖ్యాత వైజ్ఞానికవేత్త, నోబుల్ పురస్కార గ్రహీత అయిన డాక్టర్ ఎలక్సిస్ కైరల్ కేవలం ఒక్కసారి కంటి చూపుద్వారా ఎదుట వ్యక్తిని చూసినంత మాత్రము చేత అతని గుణగణాలను వాని అర్హతార్హతలు తెలుసుకోవచ్చని అన్నారు. వీరు సిక్స్త్ సెన్స్ (Sixth Sense) మీద ఎన్నో ప్రయోగాలు చేసి మానవులందరిలో రెండు కుడిఎడమ, మస్తిష్కాలు; లోపల బయట ఉంటాయని, లోపల ఉన్న మస్తిష్కం చిన్నగా ఉంటుందని, ఇది గతంలో తీసుకున్న జంతుజన్మల ప్రవృత్తి ద్వారా ప్రాప్తిస్తుందని దీనినే థలామస్ (Thalamas) అంటారని తెలిపారు. దీనిలో అన్నీ తన్మాత్రలు, సూచికలు, సంతులనాలు మరియు చేతనలు కూడి ఉంటాయి. దీని ఆకారం చిన్న వ్రేలంత ఉండి, దీని రహస్య పొరలలో స్వప్న, దృశ్య, భావనల ప్రవృత్తులు నిండి ఉంటాయి. ఈ మస్తిష్కానికి పైన పెద్ద మెదడు ఉంటుంది. దీనిలో పదివేల మిలియన్ల న్యూరాన్లు ఉండి, అపరిమిత సంఖ్యలో నాడీ సర్క్యూట్స్ (Circuits)లో అనుసంధానింపబడి ఉంటుంది. మస్తిష్కం యొక్క క్రొత్త ఆలోచనాధారలు, క్రొత్త భావనలు దీనిలో వస్తూపోతూ ఉంటాయి. సంపూర్ణ ఏకాగ్రతతతో కూడిన అభ్యాసం ద్వారా మానవుడు తనలోని అంతర్ నిర్మిత శక్తిధారలను ఆరవ ఇంద్రియాన్ని మేల్కొల్పుట ద్వారా పొందవచ్చు. ఈ తన్మాత్ర శక్తి ద్వారా తనకే కాకుండా, లోకానికి కూడా కళ్యాణ కారకమైన రెండు లాభాలను పెంపొందింపచేయవచ్చును.

*- అఖండజ్యోతి, జూన్ 2009*

*అనువాదం : జి. చెన్నకేశవరావు*

## దేవాసుర సంగ్రామం

*జ్ఞాన, కర్మ, ఔదార్యములనబడు ముగ్గురు దేవతలకు అజ్ఞానం, అన్యాయం, అభావం (లోటు) అనే ముగ్గురు అసురులకు మధ్య అనాదిగా పోరాటం జరుగుతూనే ఉన్నది. ఇదే అసలైన దేవాసుర సంగ్రామం. సాధనా సమరంలో శూరులు, వీరులు, యోధులు మహాభారత యుద్ధభూమి యొక్క ధర్మక్షేత్ర కురుక్షేత్రాలలో పోరు సాగించినట్లే నిరంతరం పోరాడవలసి వస్తుంది. అంతర్ జగత్తులోని యుద్ధ భూమిలో ప్రతి వ్యక్తి పాల్గొనక తప్పదు. ఏ వ్యక్తికైనా ఈ ముగ్గురు అసురులను ఈ ముగ్గురు దేవతల ద్వారా ఓడించి గెలవవలసినదే, వేరే మార్గం లేదు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**బాహ్య పరిస్థితులు కష్ట నష్టాలకు కారణం కాదు.**



పరమ వందనీయ మాతాజీ మాతృవాణి

# గురువునే సర్వస్వంగా భావించుకోండి

అందరూ నాతో కలిసి గాయత్రీ మంత్రం చెప్పండి -

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్**

మనందరం జీవితాంతం ఎదురుచూసే మహోత్సవం, అసాధారణ ఉత్సవం, ఆత్మ చింతన, ఆత్మ బోధ కలిగే మహా పర్వదినం, గురుపౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి, వ్యాసపౌర్ణమి కూడా. 18 మహా పురాణాలు రాసిన వ్యాసుడిని పూజించే రోజు. కాని ఏ గురువుల ఆశీర్వాదంతో, వరాలతో శిష్యులు గొప్పవాళ్లైనారో ఆ గురువులను స్మరించి పూజించే రోజు ఇది.

## ద్విపాత్ర

ఈరోజు జరిగిన ఒక సంఘటన మీకు చెప్తాను. నాతో చెప్పకుండా, పరోక్షంగా నాకు డబల్ బాధ్యతలు అప్పజెప్పడం గురించి తెలుసుకుని పొద్దున్నుంచి అదే ఆలోచిస్తున్నాను. ఇన్నాళ్ళూ గురువుగారు అందరితో ఒకటే మాట చెప్పేవారు. మీ కష్టాలు తీర్చుకోవాలనుకుంటే, ఆశీర్వాదాలు కావాలనుకుంటే మాతాజీ దగ్గరకు వెళ్ళండి, యజ్ఞభస్మం తీసుకోండి; కాని ఏదైనా పని చేయదలుచుకుంటే నా దగ్గరకు రండి. ఆయనెప్పుడు మా ఇద్దరి మధ్య ఏ తేడా చూడలేదు. పైన ఉన్న ఆయన గదికి నేను, మరో కుర్రాడు మాత్రమే వెళ్లాము. ఇవాళ ఆ కుర్రాడితో ఆయన, "ప్రణవ్! ఇక్కడేం చేస్తున్నావు, గురువుగారు కింద కూర్చుంటే అక్కడికి వెళ్ళి నమస్కరించుకోక!" అన్నారు. అప్పుడేదో నవ్వేసి ఊరుకున్నాను కాని, నేను ఈ బాధ్యతను నెరవేర్చగలనా అని దీర్ఘంగా ఆలోచిస్తూనే ఉన్నాను.

నాయన! ఈ రోజు వరకు నాకు ఆయన అప్పచెప్పిన పనులన్నీ నేను ప్రాణాలు ఒడ్డి మరీ పూర్తి చేస్తానని నాకు నమ్మకముంది. ప్రాణం పోయేదాకా ఇది కూడా పూర్తి చేస్తాను. గురువుగారు ఒకలా ఉండేవారు, మాతాజీ మరోలా ఉన్నారు అన్న పేరు ఎన్నటికీ రానివ్వను. మేమిద్దరమూ ఒక్కటే, ఒక్కటిగానే ఉంటాము. గురువుగారు బాధ్యతలతో నా సంచీ నింపారు అవి మోసేంత సామర్థ్యం ఈ భుజాలకున్నా లేకపోయినా, సామర్థ్యం తెచ్చుకుని మరీ నెరవేర్చాలి, తప్పదు, నెరవేర్చి తీరతాను.

## గురువు ఆశీర్వచనం

నాయన! నేను నా గురించి దాచుకోలేక మీతో చెప్పుకుని హృదయాన్ని తేలిక చేసుకున్నాను. ఏ ప్రయాస లేకుండా మీరు తట్టుకోలేనన్ని వరాలు కురిపించే పర్వదినం నేడు. ఎందరి గురించో చెప్పుకోవచ్చు. ఉద్యోగం అడగడానికి వచ్చిన నరేంద్రుడికి తన శక్తినంతటినీ ధారపోసి ఏమీ తెలియని వాడిని మహాత్ముడైన వివేకానందుడిగా తీర్చిదిద్దారు రామకృష్ణ పరమహంస. విదేశాల్లో జరిగిన సర్వధర్మ సమ్మేళనలో ఈ భారతీయ కుర్రాడు ఏం మాట్లాడగలడులే అనే హేళనతో అతనికి చాలా కొద్ది సమయం కేటాయించారు, దమ్ముంటే శూన్యం గురించి మాట్లాడమన్నారు. **ఇది నాకు పరీక్ష, మీ పిల్లవాడి పరువు పోకుండా మీరే చూసుకోవాలి అని వివేకానందుడు గురువుని స్మరించుకున్నాడు.** నాయన! నీ గురువు సశరీరంగా లేడని భావించవద్దు, నేను నీతోనే ఉన్నాను, నీవు మాట్లాడు అన్నారు గురువు. అద్భుతం జరిగింది. అందరూ చప్పట్లు కొడుతూనే ఉండిపోయారు. తరవాత గంటలకొద్దీ ప్రసంగం సాగింది. ఇదంతా గురుకృప. **రామకృష్ణ పరమహంస చివరి రోజుల్లో గొంతు కాన్సర్‌తో బాధపడ్డారు. ఆయనకి ఆ రోగం వచ్చింది పిల్లల కష్టాలను స్వీకరించడం వల్లనే.** నేను పిల్లలు అని సంబోధించినప్పుడల్లా శిష్యులు అని అర్థం చేసుకోండి. నా నోట్లోంచి శిష్యులు అని రాదు, పిల్లలనే వస్తుంది. అసంఖ్యాకులైన పిల్లల బాధలను నవ్వుతూ భరించి వారికి మాత్రమే వరాలు కురిపిస్తారు గురువులు. ఈ బాధ్యత ఎంత పెద్దదో ఊహించుకోండి.

గురుకృప ఎలా ఉంటుందో చెప్తాను. చాణక్యుడిని ఒక రాజు అవమానిస్తాడు. **సాధువులు ప్రతీకారం తీర్చుకోరు, కాని గుణపాఠం చెప్తారు.** ఏమీ రాని ఒక దాసి పుత్రుడిని ఎన్నుకుని తన శక్తినంతటినీ ధారపోసి ఆ రాజ్యానికే సామ్రాట్టును చేస్తాడు చాణక్యుడు. శివాజీ చేతికి భవాని మాత ఖడ్గాన్నిచ్చి అతన్ని ఛత్రపతిని చేసాడు సమర్థ గురువు. మీరంతా భౌతికంగా ఫలితాలు చూడాలనుకుంటారు కాబట్టి ఈ ఉదాహరణలే చెప్తున్నాను. మనిషిని ధైర్యవంతుడిగా, దేవుడిగా మార్చే సూక్ష్మశక్తులు, కనీవినీ ఎరుగని, కష్టమైన పనులు చేయగలిగే సామర్థ్యం గురుకృప వల్లే వస్తుంది. భౌతికమే కాక ఆధ్యాత్మిక వరాలు కూడా ఇస్తారు గురువులు.

**వైఫల్యాలకు లోపం మన లోపలే ఉంటుంది.**

ఆధ్యాత్మికత ధైర్యవంతుల వల్లనే ఆచరింపబడుతుంది. పిరికి వాళ్ళ వల్ల కాదు. చిన్న చిన్న అడ్డంకులకు కూడా భయపడి వెనకడుగు వేసేవారు ఆధ్యాత్మికతకు పనికిరారు. కొండలను పిండి చేసుకుంటూ ముందుకు సాగే సాహసవంతులు మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలరు. కష్టాల్లో ఇరుక్కున్న పిరికివాళ్ళకి నాయన! ఇదిగో దారి అని చూపించినా వెళ్ళరు, అలాంటి వారిని ఎవరు మాత్రం ఉద్ధరించగలరు. కాని ఇవాళ గురుపర్వం. ఇక్కడున్న ప్రతివారి కొంగు బంగారమయ్యే రోజు. నా దగ్గరున్నదంతా మీకు ధారపోస్తాను. ఉన్నదంతా అయిపోతే మళ్ళీ అడిగి తెచ్చుకుంటాను, నా సొంతానికి ఏదీ అడగను, కాని మీ కోసం అడుగుతాను, మీ సంచులు నింపుతాను.

## ఉపకారం కాదు, కర్తవ్యం

ఇక్కడున్న వాళ్ళల్లో, మన పరిజనుల్లో ఎంతో మంది కష్టాల నుండి బయటపడినవారు, మృత్యువుని తప్పించుకున్నవారు కూడా ఉన్నారు. మిమ్మల్ని రక్షిందెవరు? మీ వేలు పట్టుకుని నడిపించిన ఆ గురువుకి శరణాగతులై మీరు ఆయనకు స్వంతమై పోయారు. ఆయన ఫలానా వ్యక్తి కష్టాలు తీర్చానని ఎప్పుడూ చెప్పుకోలేదు, **మీరు కష్టాలపాలైన విషయం కూడా మీకు తెలియనివ్వకుండా రక్షించుకొస్తున్నారు, అది వారి ఔదార్యం. ఆయన గురువు, మీరాయన పిల్లలు, ఆయన్ని మీరు కలిసి తీరాలి. ఇది ఉపకారం అని మేమెప్పుడూ అనుకోలేదు, ఇది మా కర్తవ్యం, బాధ్యత.**

రెండు నెలల క్రితం ఒకతనొచ్చి తన అనుభవం చెప్పాడు. 'కొన్నాళ్ళ క్రితం నేను ప్రయాణిస్తున్న కారుని తీవ్రవాదులు ముట్టడించి వందల బుల్లెట్లను ఫైర్ చేసారు. నాతో పాటున్న మిగిలిన ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ఆ క్షణం నాకనిపించింది, కొన్నాళ్ళ క్రితం గురువుగారి గురించి తెలుసుకున్నాను, వారిని కలవడానికి వెళ్ళడానికి వీలుపడనే లేదు, ఇక వీలు పడుతుందో లేదో అనుకున్నాను. తక్షణం నా రెండు వైపులా మీరు, గురువుగారు కూర్చున్నట్టు నాకు కనిపించింది. నేను బ్రతికి బయటపడ్డాను. ఆరోగ్యం కుదుట పడగానే మిమ్మల్ని కలవాలని పరిగెత్తుకుంటూ వచ్చాను' అన్నాడు. నాయన, నిన్ను రక్షించింది ఆ భగవంతుడు, నీ నమ్మకం. ఎంతో మంది రోజూ చనిపోతూనే ఉన్నారు, వాళ్ళని మేము రక్షించట్లేదే! మా మీద నీకున్న నమ్మకం నిన్ను రక్షించింది. ఆ రోజు నువ్వు చనిపోయుంటే నీ భార్య బిడ్డలకి నీవు దక్కేవాడివి కాదు. ఇప్పుడు కూడా అలాగే అనుకుని, నీ శేష జీవితం నీ కుటుంబం కోసం కాక సమాజానికి, మిషన్‌కి సేవ చేయడానికి వినియోగించు అని చెప్పాను. మాతాజీ, నేను మిషన్ సేవ చేయడానికే వచ్చాను. నా జీవితాంతం దేశం పట్ల, సమాజం పట్ల పవిత్ర భావాలు కలిగి ఉండి ఎలాంటి కష్టాలనైనా నవ్వుతూ ఎదుర్కునే ధైర్యాన్ని ప్రసాదించమని కోరడానికి వచ్చాను అన్నాడు. ఆ తరువాత అతను గురుదేవుల పనిలోనే నిమగ్నమై ఉన్నాడు. గురువుగారితో కొన్నాళ్ళ పరిచయంలోనే అతనికి జీవనదానం లభించింది.

ఇంకో సంఘటన చెప్తాను. పంజాబ్‌కి చెందిన ఒక అబ్బాయి, అతని బాస్ ఒక తప్పుడు కేసులో ఇరుక్కున్నారు. జీవిత ఖైదు తప్పదన్న పరిస్థితి. దీక్ష తీసుకున్న రోజు నుంచి ఆ అబ్బాయి గురువుగారికి నమస్కరించిగాని ఏ పనీ మొదలుపెట్టేవాడు కాదు. ఒక రోజు తెల్లవారుఝామున రెండు గంటలకు గురువుగారే అతన్ని లేపినట్టు అనిపించిందట. ఈ రోజు నీ కేసుంటే నువ్వు నిద్రపోతున్నావేంటి? ప్రార్థన చేసుకో అన్నారట. నిద్ర తూగితే ఒక అరగంటలో మళ్ళీ గురువుగారు తట్టి లేపి ఒకరిని చూపించి నీ కేసుకు జడ్జి ఇతనే కదా అన్నారట గురువుగారు, ఆ జడ్జి చాలా స్పష్టంగా కనిపించారతనికి. కోర్టుకెళ్ళాక పొద్దున గురువుగారు ఏ తలపాగాతో ఉన్న జడ్జిని చూపించారో, అలాగే ఉన్న ఆ జడ్జి వచ్చి ఇతని కేసు మాత్రమే విని వీరి పక్షంలోనే తీర్పునిచ్చి వెళ్ళిపోయాడట. అక్కడున్న అతని స్నేహితునికి ఆ జడ్జి తల మీద రెండు చేతులు ఉన్నట్టు కనిపించాయట. అవి తప్పక గురువుగారివే అని తెలుస్తోందట. ఎంతో మొండివాడు, కఠోరుడు అయిన ఆ జడ్జి వీళ్ళకు అనుకూలంగా తీర్పునివ్వడం వల్ల అతనికి, అతని బాసుకి శిక్ష తప్పిందని నాలుగు పేజీల ఉత్తరం రిజిస్టర్ పోస్టులో పంపించాడు ఆ అబ్బాయి.

ఇలాంటివి ఎన్నో గురువుగారి సూక్ష్మీకరణ ప్రభావంవల్ల జరుగుతూనే ఉన్నాయి. మీరంతా ఆయనతో ముడిపడి ఉన్నారు, మీకు లాభం దక్కడంలో ఆశ్చర్యమేమున్నది. అడక్కుండానే లభించే వరాలకు కాస్త మూల్యం చెల్లిస్తే తప్పేముంది. కాని వేల జన్మలు తల్లకిందుల తపస్సు చేసినా గురువు ఋణం తీర్చుకోవడం అసాధ్యం. ఒక పని చేయడానికి ధైర్యం చేయచ్చు. **గురువు ఇచ్చింది బీరువాలో దాచుకోకుండా దాన్ని ఉపయోగించాలి, చూపించిన దారిలో నడిచే సాహసం చేయాలి.**

## ఆశీర్వాదాన్ని లోకకళ్యాణానికి ఉపయోగించాలి

ఏ ఉద్దేశ్యంతో మీకు వరాలు ఇవ్వబడ్డాయో, ఆ ప్రయోజనానికే మీరు దాన్ని ఉపయోగించాలి. లేని పక్షంలో అవన్నీ వృధానే. లోకకళ్యాణానికి ఉపయోగిస్తే లభించిన దానికి లక్షల, కోట్ల రెట్లు మరింతగా పొందవచ్చు. మా జీవితాలనే తీసుకోండి, ఆ మహాగురువు యొక్క సత్తా వల్లనే నేడు ఈ స్థాయికి వచ్చాము. నాలుగు వేదాలు, 108 ఉపనిషత్తులు, 18 పురాణాలు, ఆరు దర్శనాల అనువాదం నుండి మీ అందరి సేవ చేయగలిగే

వైఫల్యాలకు మూలకారణం మానసిక కాలుష్యమే.

స్థాయి గురువే ఇచ్చారు. మమ్మల్ని మేము అర్పించు కున్నాము. మీరు కూడా మిమ్మల్ని మీరు సమర్పించుకుంటే అన్నీ సాధించగలరు. ఈ రోజు మా దగ్గరనుండి వెళ్ళిన వారంతా ఈ సంవత్సరం లోపల ఎంత సాధించారో చూసుకోండి. మామూలు భౌతిక సాఫల్యం మీరు కోరుకుంటే అదీ లభిస్తుంది కాని మేము మీకు ఆధ్యాత్మిక సాఫల్యాన్ని ఇవ్వాలనుకుంటున్నాం. ఈ నాలుగు రోజుల్లో మీకు ప్రత్యేకమైన వరాలను, విశేషమైన శక్తిని ఇచ్చి మీ బాటరీ చార్జ్ చేస్తున్నాం. మీకు కనిపించకపోయినా, మీరు జీవితాంతం కొనసాగించే సుదూర ప్రయాణానికి కావలసిన శక్తి అందివ్వబడుతోంది.

## కావలసిందల్లా తెగింపుతో ఒక్క గెంతు గెంతాలి

మీ కోసం తన జీవితాన్నంతటిని త్యాగం చేసి, తన కోశాగారాన్నంతటిని ఖాళీ చేసుకున్న వ్యక్తి ఇప్పుడు ఖాళీ చేతులతో నిలబడి ఉన్నాడు. అటువంటి గురువు కోసం మీరు చేయగలిగిందల్లా తెగించి ఒక్క దూకు దూకాలి. ప్రస్తుతం మీరు బొగ్గుతో సమానం. ఇలానే చనిపోతే మట్టిగా మారతారు. చనిపోయిన జంతువుల చర్మాలైనా దేనికో దానికి ఉపయోగ పడతాయి, కాని మీ శవాలు దేనికీ పనికి రావు. బొగ్గుని వజ్రాల కార్మికుడి చేతిలో పెడితే దాన్ని సరైన రీతిలో రూపాంతరం చేసి వజ్రంగా మారుస్తాడు. మీరు కూడా **గురువు చేతిలో మిమ్మల్ని మీరు అర్పించుకుంటే వజ్రంగా మారతారు.** అటువంటి వజ్రాన్ని మట్టి కరిపించే దమ్ము ఎవరికీ ఉండదు. నేను చూపించిన మార్గంలో మీరు పయనిస్తే మీరూ అంతటి వారు అవుతారు. గాంధీగారు పరమపదించాక విదేశీయులు ఆయన మెదడు కావాలన్నారు, దాని మీద పరిశోధనలు చేస్తామన్నారు. అంతటి మహానుభావుడు, సాధువు, రాష్ట్రపిత యొక్క మెదడు వేల కోట్లు ఇచ్చినా అమ్మమన్నారు భారతీయులు.

## గురువును ఆంతరంగికంగా స్వీకరించండి

సరైన మార్గం తెలుసుకుని, దాని గుండా ప్రయాణం చేసే మనిషి చాలా విలువైనవాడు. మీకు సరైన మార్గం తెలిసింది, అందులో నడుస్తారా, దానికి వ్యతిరేకంగా నడుస్తారా అన్నది మీ ఇష్టం. అంటే గురువును నోటి మాటగా స్వీకరించారా, ఆంతరంగికంగా స్వీకరించారా అనేది మీ చేతిలో ఉంది. ఆంతరంగికంగా స్వీకరిస్తే మాత్రం మీ గురువు మీకు భౌతికంగా కనిపించకపోయినా, మీకు చాలా దగ్గరగానే ఉన్నారు. ఆయన విరాట్ స్వరూపాన్ని చూడండి, మీ ముందున్న ఈ తల్లిలో తొంగి చూస్తే ఆయన తప్పక కనిపిస్తాడు. గురువును తన పని చేసుకోనివ్వండి, దర్శనం కావట్లేదు, మేము అనాధలమైపోయాము అంటూ ఆయన్ని ఇబ్బంది పెట్టకండి. నేనుండగా మీరు అనాధలు కారని వాగ్దానం చేస్తున్నాను.

నాయన! ఎలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లవాడైనా ఆయనను అంతరంగంలో ప్రతిష్ఠించుకున్నవాడు గొప్పవాడు. గురువుతో బాంధవ్యం ఏర్పర్చుకునేది జీవాత్మే కాని అతని ధనం, ఐశ్వర్యం కాదు. వీడ్కోలు సందేశంలో ఒక మాట చెప్తాను. నేను నా రాముడికి సీతను. ఆయన భగవంతుడు, నేను ఆ సంత్, ఋషికి భార్యను. ఆ నాటి సీతకన్నా ఒక విషయంలో నేను చాలా గొప్పదాన్ని. ఆవిడకి లవకుశులిద్దరే పిల్లలు, నాకు లక్షల కోట్ల మంది పిల్లలున్నారు. సిద్ధాంతాలనిచ్చి ఆయన తండ్రి అయ్యారు, వాత్సల్యాన్నిచ్చి నేను తల్లినయ్యాను.

## సిద్ధాంతాలతో పాటు వాత్సల్యం

ఆయన మీకు సిద్ధాంతాలని, ప్రేరణని ఇచ్చారు; నేను కూడా నా వాత్సల్యాన్ని పంచాను. మీ కన్న తల్లికి మీమీదున్నంత అధికారం నాకు కూడా ఉంది. మీకు అర్థం కాకపోతే పోనీ గాక! ఇదంతా ఊహా ప్రపంచం. ఆ ఊహించేదేదో అత్యున్నతమైనది ఊహించచ్చు కదా, గొప్పవాటి గురించి కలలు కనవచ్చు కదా, మనం ఉన్నతి వైపేగా పయనించాల్సింది.

ఆత్మచింతన యొక్క ఈ గొప్ప పర్వదినాన మీరు అందుకోబోతున్న వరాలను మననం చేసుకుని ఆ చింతనలోనే మునిగిపోండి. **గురువుగారితో ఐక్యమవండి, అదే ఆత్మ సాక్షాత్కారం. ఆయన్ని మీలో లీనం చేసుకోండి, మీరు ఆయనలో లీనమైపోండి, అప్పుడే గురువు మీవాడు అని మీకు అర్థమవుతుంది.** మొదటిసారి స్టేజీ మీద కూర్చోపెట్టినప్పుడు నా పరిస్థితి వర్ణనాతీతం. టెన్షన్ పడ్డాను, అప్పుడు ఆయన నా దగ్గర కూర్చున్నట్టు అనిపించింది. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ మా ఇద్దరికీ ఇక్కడ దిళ్ళు ఉంచుతారు. ఇవాళ కూడా కారు దిగుతూంటే ఆయన నాతో పాటు వెనక దిగుతున్నట్టు అనిపించింది. ఆయన కనపడకపోతే మాత్రం ఏమిటి, ఆయన ఎప్పుడూ మనతోనే ఉన్నారు. ఇప్పుడు చెప్పిన మాటలు నావి కావచ్చు కాని భావప్రేరణ ఆయనదే. మేమిద్దరము ఒకటే. అదీ ఆయన చెప్పించిందే. ఇక్కడికొచ్చిన పిల్లలకి, రాలేకపోయిన వాళ్ళకి కూడా మా ఇద్దరి శుభాశీస్సులు, శుభకామనలు సదా ఉంటాయి.

*(పరమపూజ్య గురుదేవుల సూక్ష్మీకరణ సాధనా సమయంలో గురుపూర్ణిమ 02.07.1985 నాడు వందనీయ మాతాజీ ఇచ్చిన ప్రవచనం)*

*– అఖండజ్యోతి జులై 2003*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**అంతర్గత శక్తిని సద్వినియోగం చేసుకోవాలి.**

నావారితో నా మాట

# యువత బలమైన తుఫానువలె ముందుకు రావాలి

సవాళ్ళు ఎన్నో ఉన్నప్పటికి సమాధానము మాత్రము కేవలం ఒకటే అదే యువచైతన్యం జాగృతమై, యువశక్తి సక్రియమై జీవిత మందలి ప్రతి రంగములోను సాహసోపేతంగా భాగస్వాములు కావడం. ప్రచండ సాహసము, బలమైన సంకల్పము, మొక్కవోని ధైర్యముతోపాటు భావనశీలురైన, ఆలోచనాపరులైన యువత అడుగు ముందుకేస్తే అసంభవం అనుకున్న సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుంది. కాని పరిస్థితుల పట్ల ఉన్న వ్యామోహము, సందిగ్ధావస్థలో కొట్టు మిట్టాడుతున్న మానసికస్థితిని ఏమనాలి? ఎన్నో రకాలైన చర్చలు నడుస్తున్నాయి. అనేక టి.వి.ఛానళ్ళలో పెద్ద చర్చావేదికలు నడుస్తున్నాయి. కానీ ఏదైనా చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడితే మాత్రం అందరు అడుగు వెనక్కు వేస్తున్నారు. ఏదైనా చేయాలనే ప్రయత్నిస్తున్న ఈ సమయంలో ఒకరినొకరు దూషించుకుంటూ ఉండడమే మినహా వేరే ఏమి జరగటం లేదు. సామాజిక బాధ్యతలు ఏమీ మాకులేవు అన్న విధంగా ప్రవర్తిస్తే ఎలా?

కొత్తది ఏదైనా కనిపెట్టాలన్నా, ప్రస్తుత సమస్యలకు సమాధానము వెతకాలన్నా యువకులు తల విదిల్చి హుంకారము చేస్తే తప్ప కుదరదు. ఇది ఈనాటి మాట కాదు వేల సంవత్సరాల నాటి మాట, యువకుడైన శ్రీరాముడు వైభవోపేతమైన అయోధ్య రాచరికాన్ని వదిలి రావణుని దురాచారములు, అత్యాచారములపై శంఖనాదం చేశాడు. ఆయన ఒంటరి ప్రయత్నమునకు అనేకుల ప్రయత్నాలు కూడా తోడుగా రావడం వల్ల అనాచారియైన రావణునిపై విజయం సాధించారు. శ్రీకృష్ణుడు కిశోరావస్థలో ఉన్నప్పుడే ఎంతోమంది రాక్షసులను వధించాడు. క్రూరుడైన కంసుని పతన, పరాభవములతో ఒక నూతన క్రాంతి జాగృతమైంది. వ్యాసమహర్షి తన యువావస్థలోనే ఆర్ష గ్రంథములన్నింటిని మథించి వేదములు, పురాణములు మాత్రమే కాక మిగిలిన గ్రంథములన్నింటిని అద్భుతమైన రీతిలో సంకలనము చేసి సంపాదకీయ కార్యమును చేశాడు. దాని ఫలితంగా అనేక ఐతిహాసిక పరివర్తనలు జరిగాయి.

పురాతన కాలంలో ఇవి తప్ప వేరే ఉదాహరణలేవీ మనకు లభించవు. కానీ ఇటువంటి సంఘటనలు తరువాత కూడా జరిగాయి. ధర్మ చక్ర ప్రవర్తన చేసే బుద్ధుడు కూడా యువకునిగా ఉన్నప్పుడే జాగృతమయ్యాడు. సమాజము యొక్క ధర్మము యొక్క సంస్కృతి యొక్క దేశము యొక్క దురవస్థ వల్ల వచ్చిన బాధలకు బలైన లెక్కలేనంతమంది యువతీయువకులు ఆయన పిలుపుకు ప్రభావితులైన ధర్మం శరణం గచ్ఛామి, బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి అనే నినాదంతో బయటికి వచ్చారు. తథాగతుడైన గౌతమునివలె మహావీరుడు కూడా యౌవనావస్థలోనే మహాత్యాగము అనే పాఠము చదివాడు, చదివించాడు. ప్రపంచము పీడింపబడుతున్న స్థితిలో ఉన్నప్పుడు విలాసాలు, వైభవాలు జీవితముపై విషం కంటే ఎక్కువ ప్రభావమును చూపిస్తాయి. మహావీరుడు యువకులకు ఈ విషయాలే నేర్పించాడు. యౌవ్వనంలో ఉండే శక్తికి భ్రష్టాచారములను ఎదిరించి పోరాడే యుద్ధరంగం కావాలి కానీ విలాస వైభవాలు, ధనము, సంపదతో మ్రగ్గిపోయే వాతావరణం అవసరం లేదు.

చరిత్ర పుటలను త్రిప్పుతూ మనం ముందుకుపోతే వివేకానందునికి కూడా యౌవ్వనంలోనే వివేకం జాగృతమైంది. ఆయన యొక్క వివేకము, వైరాగ్యము మరియు ఆలోచనాశీలత అనేవి భారతీయ సంస్కృతి విజయంలో ఒక కొత్త అధ్యాయమును లిఖించాయి. ఆ తరువాత ఆయనవల్ల ప్రేరితులైన అనేకమంది యువత దేశం కోసం చూపించిన సాహసాలన్నీ కథలుగా చెప్పుకోబడ్డాయి. లోకమాన్యతిలక్ తన యౌవ్వనంలోనే స్వరాజ్యం మా జన్మ హక్కు అని ప్రకటించారు. సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి వారందరూ దేశం కోసం తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టిన యువతరమే. అంతేకాదు వారు తమ జీవితం ద్వారా, తమ యౌవ్వనం ద్వారా యువచేతనకు ఒక కొత్త పరిభాషను అందించారు. మనకు యౌవ్వనమనేది తుమ్మెదలవలె ఎగసిపడే భావనలనే ఉచ్చులలో ఇరుక్కునేందుకు లభించలేదు. దేశము, ధర్మము, సంస్కృతికి ఉపయోగిపడినప్పుడు మాత్రమే యౌవ్వనం చరితార్థమౌతుంది. అన్యాయము, అనాచారము, ఆక్రమణలకు ఎదిరించి పోరాడే శౌర్యమును, సాహసమును చూపించేందుకై శంఖనాదం చేయాల్సిన బాధ్యత యువతది మరియు వారి యొక్క యౌవ్వనానిది.

మనందరి యొక్క ప్రేరక, మార్గదర్శక సంరక్షకులైన పరమపూజ్య గురుదేవుల యొక్క జీవితమే ఇందుకు సుస్పష్టమైన ప్రమాణం. ఆయన యువావస్థలో దేశస్వాతంత్ర్యం కొరకు తనను తాను స్వయంగా సమర్పించుకున్నారు. ఇందుకొరకు ఆయన

**అంతర్ముఖులై వైఫల్యాలకు మూలకారణం అన్వేషించాలి.**

ఎన్నో బాధలను అనుభవించారు. కానీ స్వాతంత్ర్యం లభించిన తరువాత ఆ ఫలితం అనుభవించే గొప్ప అవకాశం లభించి నప్పుడు మాత్రం ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఎందుచేత అంటే ఆయన ధర్మము మరియు సంస్కృతి అనే మార్గమును ఎంచుకున్నారు. ఆయన జీవితంలోని జరిగిన సంఘటనల గురించి చెప్తూ యౌవ్వనంలో తపస్సు చేయాలనే ఆ తపన ఆయన మనస్సుని అక్కడి నుండి కదలనివ్వలేదు. తపస్సు, జ్ఞాన సముపార్జన మరియు లోకసేవ అనే మార్గమును ఆయన స్వీకరించారు.

ఆయన యొక్క విస్తృతమైన స్వానుభవం, దైవీ మార్గదర్శనం, ప్రఖర ఆలోచనలు సృష్టించిన ప్రచండమైన తుఫానులో లక్షల, కోట్ల మంది తడిసి ముద్దవుతూ, ఇంకా కొంతమంది కలుస్తూ తమని తాము సమర్పించుకుంటూ పోతున్నారు. ఆయన సంపర్కంలోకి వచ్చిన వారిలో ఎక్కువ మంది యువకులే. మహాత్మగాంధీ ఉద్యమం తరువాత దేశంలో ఇంతమంది పాల్గొని, భాగస్వామ్యం వహించి ఉత్తుంగ తరంగంలా ఎగిసిపడిన ఉద్యమం మరొకటి లేదు. వేలాది మంది తమ విద్యను, పదవిని, ఉద్యోగాలను వదులుకొని వచ్చారు. లక్షలాది మంది యువత ఈనాడు పసుపు రంగు ధరించిన పరివ్రాజకులుగా మారడమనేది తమకు లభించిన ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నారు. కానీ సమయం యొక్క ఆవశ్యకతను, యుగం యొక్క పిలుపును చూస్తుంటే ఈ సంఖ్య చాలా తక్కువనే అనిపిస్తున్నది.

ధర్మము మరియు సంస్కృతి ఇంకా అనేక ఆడంబరాలలో చిక్కుకొని ఉన్నది, దేశం ఇంకా భ్రష్టాచారం మరియు దురాచారములనే ఊబిలోనే ఉన్నది. జనచేతన ఇంకా నిద్రావస్థలోనే ఉన్నది, బద్ధకంగా, నిస్పత్తువతో ఉన్నది. వారిని ఒక్క కుదుపు కుదిపి తట్టిలేపేందుకు శక్తి యొక్క సమర్థవంతమైన సుడిగాలులు కావాలి. ఇదంతా యువతతో కూడిన కొత్త తరానికే సాధ్యమౌతుంది. కానీ అది ఇంకా సంపూర్ణంగా కార్యోన్ముఖం కాలేదు. చర్చలతో పనులు కావని గురుదేవులు చెప్పేవారు. యువత తమంతతావే ముందుకు వచ్చి సమస్యలను పరిష్కరించాలి. పనికిమాలిన చర్చలతో కూడిన ఇటువంటి ఒక సందర్భం గురుదేవులకు ఎదురైంది. ఆ సమయంలో ఆయన రైలు ప్రయాణం చేస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న సీటులో ఒక శేఠ్‌జీ కూడా ప్రయాణిస్తున్నాడు. ఆయన కూర్చున్నవాడు కూర్చోకుండా మాటిమాటికి ధార్మిక సంస్థలను ఎద్దేవా చేసి తిడుతున్నాడు.

అప్పుడు గురుదేవులు అతని మాటలకు అడ్డు చెప్తూ ఇలా అన్నారు 'శేఠ్‌గారు, మీకు ఎంతమంది మగ పిల్లలు, ఎంతమంది ఆడపిల్లలు? అందుకు అబ్బో నాది నిండైన కుటుంబం అని శేఠ్‌జీ సమాధానం చెప్పాడు. నాకు ముగ్గురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు అన్నాడు. మరైతే మీరు మీ పిల్లల్లో ఒక అమ్మాయిని, ఒక అబ్బాయిని ధర్మము మరియు సంస్కృతి కొరకు ఇచ్చేస్తారా? అని గురుదేవులు అడిగారు. గురుదేవుల యొక్క ఈ ప్రస్తావనను విన్న శేఠ్‌జీ ఉలిక్కిపడి 'భలేవారే నాకేమైనా మతిపోయిందా ఏమిటి, నా కొడుకులని అమెరికా పంపిస్తాను, నా కూతుళ్ళని డాక్టర్లని చేస్తాను' అన్నాడు. ఆయనన్న మాటలకు గురుదేవులు నవ్వి 'ఎప్పటివరకు మీ వంటి మంచి కుటుంబాలకు చెందిన చదువు కున్న యువకులు, యువతులు ధర్మసంస్కృతి కార్యకలాపాలు చేసేందుకు ముందుకురారో అప్పటివరకు వీటి స్థాయి ఎలా పెరుగుతుంది చెప్పండి' అన్నారు. పరమపూజ్య గురుదేవుల యొక్క ఈ ప్రశ్న ఇప్పటికీ యధావిధిగా అలాగే ఉన్నది. ఎప్పటి వరకు సుశిక్షితులైన, సంస్కారవంతులైన యువతరం ధర్మచక్ర ప్రవర్తన కొరకు ముందుకు రాదో అప్పటివరకు ఈ కార్యక్రమం యొక్క వేగం పెరగదు. అందుచేత ఆలోచించవద్దు, అడుగులు ముందుకు వేయండి. ఇందులో తీవ్రత, వేగం రెండు అవసరమే.

*- అఖండజ్యోతి, జూన్ 2012*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## అష్టావక్రుడు

*జనక మహారాజు మందీ మార్బలంతో, మిథిలా నగర వీధుల గుండా సాగుతుండగా ఆ దారిలో ఎవరిని నడవవద్దని రాజభటులు కట్టుదిట్టం చేస్తారు. శోభాయాత్ర ముగిసేవరకు ప్రజలు తమ పనులు అవసరాలు వదులుకొని ఎక్కడి వారక్కడ ఆగవలసి వస్తుంది. ఇదే సమయంలో ఆ బాటలో వస్తున్న అష్టావక్రుని రాజభటులు తప్పుకోమని ఆదేశించగా, ఆయన నిరాకరించి ప్రజలకు కన్న తండ్రియైన రాజు కేవలం తన సౌకర్యం కొరకు ప్రజలను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం అవినీతికరమైన చర్య. దీనిని ప్రతిఘటించడం నా వంటి బ్రాహ్మణుని బాధ్యత. ఈ విషయం మీ రాజుకి చెప్పండని పలుకగా రాజభటులు అష్టావక్రుని రాజాజ్ఞను ధిక్కరించిన నేరం క్రింద బంధించి రాజు ముందు ప్రవేశపెడతాడు. అవినీతితో ఇంత నిర్భయంగా పోరాడగల బ్రాహ్మణుడే రాష్ట్రం యొక్క అసలైన సంపదగా పేర్కొంటూ జనక మహారాజు అష్టావక్రుని క్షమాపణ కోరి రాజ గురువు పదవి చేపట్ట వలసినదిగా ప్రార్థిస్తాడు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**భయమే కష్టనష్టాలకు మూలకారణం.**



ఆరోగ్యమే మహాభాగ్యం - 20

# హోమియో వైద్య సేవ



థైరాయిడ్ గ్రంథి

మారుతున్న జీవనశైలి, పాశ్చాత్య దేశాల ఆహార అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి కారణంగా థైరాయిడ్ గ్రంథిపై ప్రభావం పడి దాని ప్రతిచర్యలలో లోపాలు మొదలవుతున్నాయి. థైరాయిడ్ గ్రంథి పనితీరులో లోపాల కారణంగా కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలతోపాటు అనేక ప్రధాన అవయవాలలో సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉన్నది. థైరాయిడ్ సమస్యకు హోమియోలో శాశ్వత పరిష్కారం లభించ గలదు.

జీవక్రియ సమతుల్యతను ఏర్పర్చడం, ఆహారం నుండి శరీరానికి అందవలసిన శక్తిని కాపాడుతూ క్రమబద్ధీకరించడం, అవసరమైన విటమినుల, హార్మోనుల జీవకణాల అభివృద్ధికి, పనితీరుకు ఉపయోగపడే విధంగా నియంత్రణ చేయడం థైరాయిడ్ గ్రంథి ప్రధాన కర్తవ్యం. అంతేకాకుండా లివర్, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు మొదలైన ముఖ్య అవయవాల పనితీరుకు నిర్దేశం థైరాయిడ్ హార్మోన్ల నుండి వెలువబడుతుంది.

**లక్షణాలు:**

- నీరసంగా ఉండడం, ఉదయం నిద్రలేచినప్పుడు చురుకుగా లేకపోవడం, రోజంతా నీరసంగా ఉంటూ పనిపై శ్రద్ధ తగ్గడం, కొన్నిసార్లు నిద్రలేకపోవడం వంటివి.
- బరువులో మార్పులు జరుగుతుండడం, ఎంత తిన్నా ఒంటికి పట్టకపోవడం.
- మానసిక ఆందోళన, వ్యాకులత లాంటివి మొదలుకావడం, దిగులు, విస్మయం, గుండెదడ లాంటివి ఉండటం.
- కొలెస్ట్రాల్ స్థాయిలో ఒడిదుడుకులు
- వంశపారంపర్యంగా థైరాయిడ్ సమస్యలు
- స్త్రీ, పురుషులలో సంతానలేమి, స్త్రీల బహిష్టులు ఎక్కువ కావటం, నొప్పితో కూడుకుని ఉండడం లేదా దీనికి విరుద్ధం అంటే అసలు లేకపోవడం వంటివి.
- మలబద్ధకం లేదా అతి విరేచనాలు.
- తల వెంట్రుకలు రాలడం, పొడిబారడం, పెలుసులు కట్టడం, జీవం లేకపోవడం లాంటివి, చర్మం పొడిబారటం, దళసరిగా లేదా పలచగా మారటం, రంగులో మార్పులు రావటం, మచ్చలు ఏర్పడటం, కాంతి కోల్పోవడం.

**రకాలు:** థైరాయిడ్ గ్రంథి నుంచి టి3, టి4, కాల్సిటోనిన్ అనే ముఖ్య హార్మోన్లు వెలువడుతాయి. వీటిలో మొదటి రెండు అయోడిన్‌తో కలిసి జీవక్రియకు, శరీర అవయవాల ఎదుగుదలకు తోడ్పడతాయి. కాల్సిటోనిన్ హార్మోన్ శరీర కాల్షియం జీవక్రియకు తోడ్పడతాయి. అయితే జరిగిన అసమతుల్యత కారణంగా థైరాయిడ్ సమస్యలకు గురికావచ్చు. వాటిలో హైపో థైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం, గాయిటర్ నాడ్యుల్స్, ఆటో ఇమ్యూన్ థైరాయిడ్, థైరాయిడ్ క్యాన్సర్ ముఖ్య థైరాయిడ్ సమస్యలుగా గుర్తించడం జరిగింది.

**దుష్ప్రభావాలు:**

అనేకసార్లు అశ్రద్ధ వల్ల థైరాయిడ్ సమస్యను గుర్తించడం జరగకపోవచ్చు. ఎందుకంటే ఆందోళన, చిరాకు, నీరసం, బరువు సమస్యలు వంటివి చాలా తక్కువ స్థాయిలో ఉండవచ్చు. లేదా కొంతమందిలో అసలు ఎటువంటి లక్షణాలు ప్రారంభంలో బయట పడకపోవచ్చు. అంతేగాకుండా డిప్రెషన్, నిద్రలేమి, కీళ్ళ నొప్పులు వయసుతో పాటు వచ్చే అనారోగ్యంగా నిర్ధారణ చేసి నిర్లక్ష్యం చేయడం కూడా జరగవచ్చు.

ఒబేసిటి, హృద్రోగాలు, కొలెస్ట్రాల్, బ్లడ్ ప్రెషర్ పెరగటం, ఆస్టియో పోరోసిస్ అంటే ఎముకలు మెత్తబడటం, రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడి రకరకాల వ్యాధుల బారిన పడడం లాంటివి థైరాయిడ్ సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల రావచ్చును. అంతే కాకుండా కొంతమందిలో అత్యంత ముఖ్యమైన అవయవాలైన లివర్, కిడ్నీల పనితీరుపై ప్రభావం వల్ల అకస్మాత్తుగా దుష్పరిణామాలు సంభవించి కోమా లేదా ప్రాణాంతక పరిస్థితులకు దారితీయ వచ్చును.

**నిర్ధారణ:**

సామాన్య రక్తపరీక్షలతో పాటు టి3, టి4, టిఎస్‌హెచ్‌తోపాటు రక్త కాల్షియం, థైరాయిడ్ యాంటీబాడీస్ లాంటివి అవసరాన్ని బట్టి సూచించడం జరుగుతుంది. ఎక్స్‌రే, సిటి, ఎంఆర్ఐ స్కానింగ్, బయాప్సి వంటి ఆధునిక పరీక్షలు వ్యాధి తీవ్రతను అంచనా వేయడానికి ఉపకరిస్తాయి.

**హోమియో వైద్యం :**

థైరాయిడ్ సమస్యలు కేవలం వంశపారంపర్యంగా వస్తాయని, సరైన చికిత్స లేదన్నది కేవలం అపోహ మాత్రమే. శారీరక, మానసిక, పరిసరాల ప్రభావం కారణంగా వచ్చే సమస్యలలో థైరాయిడ్ సమస్య మొదటిగా నేడు ప్రపంచ శాస్త్రవేత్తల అధ్యయనంలో పేర్కొంటున్నారు. అన్ని కోణాల నుండి శరీర క్రియల పనితీరును తెలుసుకుని వ్యాధి మూలాలను కనుగొనడం హోమియో వైద్యం విశిష్టత. అసమతుల్యతను తొలగించడం వల్ల అనారోగ్యం నుండి బయటపడటమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. వాడుతున్న మందులను ఒకేసారి ఆపకుండా, క్రమబద్ధంగా తగ్గిస్తూ అవసరమైన పరీక్షలు చేయిస్తూ శాశ్వత పరిష్కారం చూపించడం కేవలం హోమియో వైద్యంతోనే సాధ్యం.

థైరాయిడ్ సమస్యకు సాధారణంగా వాడే హోమియో మందులు : అయోడం, థైరోయిదినం, బ్రోమియం, నేట్రం మూర్, మొదలైనవి.


**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.

ఆర్.ఎన్.జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్, ఇ.నెం. 3-211,

యశోద గార్డెన్స్ దగ్గర, శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 72.

ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచు కోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

**భయం పోగొట్టుకోగలిగితే సామర్థ్యం పెరుగుతుంది.**



# సుభాషితాలలో సుధారస బిందువులు - 9

ధీరుడు తన లక్ష్యాన్ని సాధించాలంటే అతనికి గల ప్రథమ శత్రువులైన స్త్రీ వ్యామోహాన్ని అనవసర కోపాన్ని, అత్యాశను జయించి, ఆత్మ నిగ్రహశక్తితో ఉన్నప్పుడు అతడు స్థిరచిత్తునిగా, స్థిత ప్రజ్ఞునిగా ఆదర్శ ప్రాయుడౌతాడు.

***కాంతా కటాక్ష విశిఖా నలునంతియస్య***
***చిత్తం, న నిర్దహతి కోప కృశానుతాపః***
***తర్పన్తి భూరి విషయాశ్చ నలోభపాశైః***
***లోకత్రయం జయతి కృత్స్నమిదం సధీరః ॥***

లోకంలో కాంత, కాంచనములు (స్త్రీ వ్యామోహం, సంపదల పట్ల అత్యాశ) అత్యంత ప్రమాదకరమైన పతనానికి దోహదపడే కారణాలు. అందువల్ల ధీరుడు స్థిరచిత్తంతో వివేకానందునివలె, ఆదిశంకరునివలె స్త్రీ వ్యామోహానికి దూరంగా ఉండవలెను. తరుచు ఓర్పును కోల్పోయే కోపాన్ని మనస్సులోకి చేరనీయ కూడదు. దానివల్ల ఆలోచనాశక్తి నశించిపోయి, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాడు. అందువల్ల తొందరపాటు నిర్ణయాలతో తప్పులు చేసే అవకాశం ఉంటుంది. సంపదల పట్ల లోభం వల్ల, బంధు మిత్రులతో అనవసరమైన శతృత్వాన్ని పొంది, ఏకాకిగా, ఎటువంటి ప్రయోజనం లేని స్వార్థపరునిగా చెడ్డపేరు పొంది, ఇబ్బందులు పాలయ్యే దుస్థితి కలుగుతుంది.

అందువల్ల అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు తావు ఈయకుండా, స్థిరచిత్తంతో జీవించే వాడే ధీరుడు.

విధివశాత్తు ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికి, ధైర్యాన్ని కోల్పోకుండా, శీలాన్ని రక్షించుకోవడమే ధీరుల స్వభావం. కొన్ని అనివార్య పరిస్థితుల్లో స్థితిగతులు మారిపోయినప్పటికి, కష్ట కాలంలో దీనస్థితిని పొందినప్పటికి ధీరులు తమ వ్యక్తిత్వంతో ఉన్నతంగా ప్రకాశించే ప్రయత్నం చేస్తారు. గగనతారలుగా శోభిల్లుతారు. ఎన్ని కష్టాలు ఎదురైనా హరిశ్చంద్రుడు, రాముడు, పాండవులు, రాణా ప్రతాప్‌సింగ్, ఛత్రపతి శివాజీ వంటి మహనీయులు చెదరని ధైర్యంతో ఉన్నతంగా (దిగజారే మనస్తత్వం లేకుండా) ప్రకాశించారో, అలాగే ప్రతి ఒక్కరు ఉన్నత విలువలకు తావిచ్చే ఉత్తమ శీలాన్ని కాపాడుకోవాలి.

***కదర్థితస్యాపి హి ధైర్యవృత్తేః***
***న శక్యతే ధైర్యగుణః ప్రమాష్టుమ్***
***అధో ముఖస్యాపి కృతస్యవహ్నేః***
***న అధః శిఖాయాతి కదాచి దేవ ॥***

దీపశిఖను (కాగడా) తలక్రిందులుగా చేసి పట్టుకున్నప్పుడు అగ్ని జ్వాలలు, ఎలాపైకి ఎగిసిపడతాయో, (క్రిందికి దిగజార కుండా) అలాగే ధీరుడు కష్టదశలో ఉన్నప్పటికి, ఉన్నతంగానే ప్రవర్తిస్తాడు తప్ప నీచంగా ఉండదు. అదే అతని ఔన్నత్యం. శీలాన్ని కాపాడుకునే ప్రయత్నంలో, ధీరుడు మరణానికైనా సిద్ధపడతాడు. అదే మన భారతీయుల నరనరాల్లోను ప్రవహించే జీవనాదం.

***వరం తుంగా తేశృంగాత్ గురుశిఖరిణః క్వాపివిషమే***
***పతిత్వాయంకాయః కఠినదృషదంతే విదిలితః***
***వరం న్యస్తో హస్తః ఫణిపతి ముఖే తీక్ష్ణదశనే***
***వరం వహ్నౌపాతః తదపి నకృతః శీలవిషయః ॥***

జీవించడం కష్టమనిపించే దశలో, తినడానికి ఆకులు, అలములు కూడా దొరకని స్థితిలో, కొండలలో, కోనలలో యాచకునిలా బ్రతకవలసిన కష్టకాలం ఏర్పడినప్పుడు, ధీరుడు ఆ కొండ శిఖరం నుండి దూకి, ఆత్మ త్యాగం చేయడానికి సిద్ధపడతాడే తప్ప, బిచ్చగానిగా జీవించడానికి ఇష్టపడడు. విష జ్వాలలు క్రమ్మే భయంకర సర్పాల చేత చిక్కినప్పుడు, వాటితో పోరాడి వీర మరణం పొందడం కానీ, లేదా శ్రీకృష్ణునివలే వాటి పడగలపై నాట్యం చేయడం (జయించి, వాటిని లొంగదీసు కోవడం) ధీరుల లక్షణం. అగ్ని దహిస్తుందని, మృత్యువుకు తప్పదని తెల్సినప్పుడు, ఆ అగ్నిలో దూకి ఆత్మత్యాగం చేసుకోవడం ఉత్తమం. అట్టి స్థితిలో సీతవలే అగ్ని పునీతులుగా శోభిల్లడం అసాధారణమైన విషయమే అయినప్పటికి అది ధీరులకే సాధ్యం.

ఉత్తమ గుణగణాలు కలిగినవారికి, ప్రకృతి కూడా అనుకూలించి, వారి ఉత్తమ శీలానికి హారతి పడుతుందన్న సత్యాన్ని ఇలా వివరించాడు భర్తృహరి.

***వహ్నిస్తస్య జలాయతే, జలనిధిః, కుల్యాయతే, తత్క్షణాత్***
***మేరుః స్వల్పశిలాయతే, మృగపతిః, సద్యః కురంగాయతే ।***
***వ్యాలో మాల్య గుణాయతే, విషరసః పీయూష వర్షాయతే***
***యస్యాంగే ఖిల లోక వల్లభ తమం శీలం సమున్మీలతి ॥***

ఉత్తమ శీలం కలిగిన వారి స్థిరచిత్తం ముందు ఎంతటి దుర్భరమైన విషయాలైనా, వారి సంకల్పం ముందు మోకరిల్ల వలసిందే. ప్రహ్లాదుని స్థిర భక్తి ముందు హిరణ్యకశిపుడు పెట్టిన

**అంకితభావంతో చేపట్టిన కార్యక్రమాలను పూర్తిచెయ్యాలి.**

కష్టాలన్నీ, ఓటమి చెందాయి. అగ్ని గుండంలోకి విసిరి వేయబడినప్పటికి, శ్రీహరి దయాపాత్రుడైన ప్రహ్లాదుడు చందనపు గుట్ట నుండి వచ్చినవానివలే బయటపడ్డాడు.

సీతాన్వేషణకు బయలుదేరిన హనుమంతునికి సముద్రం ఒక పిల్లకాలువగా అగుపించింది. దానికి కారణం ఆతని దృఢభక్తి. ఆత్మశక్తి. మేరు పర్వతం కూడా అగస్త్యులవారి దివ్యశక్తి ముందు మోకరిల్లిన రీతిలో పెద్ద పెద్ద కొండలవంటి సమస్యలు కూడా చిన్న చిన్న గుట్టలుగా మారిపోతాయి. భరతుడు బాల్యంలో ఆట వస్తువులుగా సింహపు పిల్లలతో ఆడుకున్నాడంటే అది ఆతని ధైర్యగుణానికి చిహ్నం. శాలివాహనుని శక్తికి మోకరిల్లిన పులి ఎలా అతని వాహనంలా మారిందో, అలాగే గొప్పవారి ఆత్మశక్తి ముందు అన్నీ సమస్యలు తలవంచుతాయన్న సత్యాన్ని వివరిస్తూ, మహాశివుని మహిమ ముందు గరళం కూడా తన ప్రతాపాన్ని చూపలేదన్న యదార్థాలను వివరించారు భర్తృహరి.

కాలచక్రంలో గెలుపు ఓటములు పరిభ్రమిస్తూ, కొన్నిసార్లు గెలుపు, మరికొన్ని పర్యాయాలు ఓటమి, మానవ జీవితాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి. అయితే ధీరుల చిత్తాలు వీటికి అతీతంగా ఉంటాయి. ప్రస్తుతం ఓటమి చెందినా, భవిష్యత్తులో గెలుపును సాధించవచ్చన్న ఆత్మవిశ్వాసంతో వారు పయనిస్తూ ఉంటారు.

***ఛిన్నోఽపిరోహతి తరుః***
***క్షీణో ఽప్యుపచీయతే పునశ్చంద్రః***
***ఇతి విమృశంతి సన్తః***
***సంతప్యతే న విప్లుతా లోకే ॥***

వృక్షాన్ని ఖండించినప్పటికి, అది తిరిగి చిగురిస్తుంది. చంద్రుడు అమావాస్య రోజున క్షీణించినప్పటికి, తిరిగి పాడ్యమి నుండి ప్రకాశిస్తాడు. అలాగే గొప్పవారు కూడా కొన్ని సమయాలలో అపజయం పాలైనా, ఇతర సమయాల్లో విజయాలతో వెలుగొందుతారు. అందువల్ల గెలుపు, ఓటములు వారిని ప్రభావితం చేయలేదు అన్నది అక్షర సత్యం.

– సాధన నరసింహాచార్య

## విస్మరించిన సత్యం

*ఒక చెట్టు మీద రెండు డేగలు చాలా ప్రేమానురాగాలతో జీవిస్తూ ఉండేవి. అవి రెండు వేటకు వెళ్ళి దొరికిన వాటిని ఆనందంగా కలసి తింటుండేవి. ఒక రోజు సాయంత్రం యథా ప్రకారం తమ స్థావరానికి చేరేసరికి ఒక దాని నోటిలో ఒక పాము, ఒక దాని నోటిలో ఒక ఎలుక ఉన్నాయి. చెట్టు మీద వాలి, నోటిలో ఉన్న ఆ రెండింటిని వదిలేసరికి ఇంకా జీవించి ఉన్న పాము ఎలుకను మ్రింగడానికి సిద్ధమయింది. ఇది చూచిన ఎలుక డేగ రెక్క క్రింద దాగి ప్రాణరక్షణకు ప్రయత్నించసాగింది. ఈ దృశ్యాన్ని చూస్తున్న ఒక డేగ పాము వంక చూస్తూ ఈ పాము ఎంత మూర్ఖురాలు దాని జిహ్వా చాపల్యం మృత్యువుని కూడా మరపింపచేస్తుంది అని ఆశ్చర్యాన్ని ప్రకటించింది. ఆ మాటకు రెండవ డేగ తన రెక్క క్రింద దాగి ఉన్న ఎలుకను చూపిస్తూ దీని మూర్ఖత్వం తక్కువేమీ కాదు ప్రత్యక్షంగా నిలచి ఉన్న మృత్యువు రెక్క క్రింద ఎలా భయపడి దాక్కుందో అని పలికింది.* ***మానవుడు కూడా జిహ్వకు, భయానికి, మృత్యువు కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు.*** *ఏ క్షణంలోనయినా, ఎక్కడైనా, ఎలాగైనా తన మీదకు ఉరకగల మృత్యువును పూర్తిగా విస్మరించి బతికేస్తుంటాడు. మానవుని అలవాట్లు సత్యాన్ని విస్మరింపజేసి జీవింపజేస్తుంటాయి.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

## ప్రకాశం గారు

*ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశం గారి వయస్సు 84 సంవత్సరాలు. ఈయన తల్లి పేదరికం కారణంగా చిన్న హోటలు నడిపి అతి కష్టం మీద కుటుంబాన్ని పోషించేది. అలా పెరిగిన ప్రకాశం గారు స్వయంకృషితో వకీలు పరీక్షలో ఉత్తీర్ణుడై ఇంగ్లాండు వెళ్ళి బారిస్టర్‌గా తిరిగి వచ్చారు. తన సంపాదనలో పెద్ద మొత్తాన్ని ప్రతినెల పేద ప్రజల సహాయార్థం ఖర్చు చేస్తుండేవారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూ 'స్వరాజ్యం' అనే దినపత్రికను నడుపుతుండేవారు. జైలుకు వెళ్ళినప్పుడల్లా అనేకమంది నేరస్థులను చైతన్యవంతులుగా చేసి వచ్చేవారు. కుటుంబ బాధ్యతలను శ్రద్ధగా నిర్వహిస్తూనే ప్రజాహిత కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. వీరి చరిత్ర ఎంత ఉత్కృష్టమైనదంటే ఆ రోజులలో ముఖ్యమంత్రిగా నియమించ దానికి వీరిలాంటి వ్యక్తి మరొకరున్నారేమోని కాగడా పెట్టి వెదకినా దొరకక 84 సంవత్సరముల వృద్ధాప్యంలో వీరినే ఆ పదవిని చేపట్టవలసినదిగా కోరడం జరిగింది. యువకుల కంటే ఉత్సాహంతో, సామర్థ్యంతో ఆ పదవిలో కొనసాగి జీవితం యొక్క అంతిమ అధ్యాయాన్ని వీరు అత్యంత ప్రీతి పాత్రమైన సృజనాత్మక కార్యక్రమాలలో లీనమయి గడపడం జరిగింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**అంకితభావంతో పనిచేస్తే ఉత్సాహం పెల్లుబికి వస్తుంది.**

# ఆషాఢ మాస ప్రాముఖ్యత

"ఆషాఢస్య ప్రథమ దివసే మేఘ మాశ్లిష్ట సానుమ్" అన్న శ్లోకంలోని పంక్తి ద్వారా కాళిదాసు తన 'మేఘ సందేశ' కావ్యంలోని మొదటి శ్లోకం ద్వారా ఆషాఢమాసం యొక్క మొదటి రోజు అయిన పాడ్యమి రోజున కన్పించే తొలిమేఘం రాబోయే వర్ష ఋతువుకు ఆహ్వానం పలికే రోజుగా వర్ణించారు. మండు వేసవి తాపంతో కూడుకుని ఉన్న వాతావరణం, చల్లబడడానికి కారణంగా ఆషాఢ మాసం. గ్రీష్మ ఋతువుకు, వర్ష ఋతువుకు మధ్య వారధిగా భావించవచ్చును.

విదియ రోజున పూరీ క్షేత్రంలో జగనాథస్వామి వారి రథోత్సవం జరిపే ఆచారం ఉంది.

**నీలాచల నివాసాయ, నిత్యాయ పరమాత్మనే**
**సుభద్రా బలభద్రాత్యామ్, జగన్నాథాయ మంగళమ్ ॥**

రెండవ పంక్తిలో "సుభద్రా ప్రాణానాథాయ" అనే పాఠాంతరం ఉన్నది. అయితే శ్రీకృష్ణుని భార్య సుబద్ర అనే తప్పుడు ప్రచారానికి అవకాశమిచ్చే ఆ వాక్యాన్ని పూరీక్షేత్రంలోని పై శ్లోకం ఖండించి, ఇలా వివరించింది.

సుభద్ర శ్రీకృష్ణుని సోదరియని, యశోద గర్భమున పెరిగిన ఎనిమిదో ఆడ శిశువే సుభద్రయని, శ్రీకృష్ణుని దేవకి వద్దకు చేర్చడంలో ప్రధాన పాత్ర వహించినది. దేవకి గర్భమున పెరుగుతున్న బలరాముని రోహిణి గర్భమునకు మారునట్లు చేసిన యోగమాయాదేవి సుభద్ర అని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. కంసుడు ఆకాశంలోకి ఎగురవేసినప్పుడు ఈ భద్రయే ఆకాశవాణిగా శ్రీకృష్ణుడు జీవించియే ఉన్నాడని తెలిపిన యోగ మాయాదేవి. ఈమెకు భద్ర, భద్రకాళి మొదలగు పన్నెండు పేర్లు ఉన్నాయి. అంటే సోదరుడు బలరాముడు (బలభద్రుడు), సోదరి సుభద్రతో కలిసి మూడు రథాలలో పూరీ నుండి ఇంద్రద్యుమ్నానికి ఊరేగింపుగా వెళ్ళి, తిరిగివచ్చే ఉత్సవమే జగన్నాథ రథయాత్ర. లక్ష్మీదేవి పూరీలోనే ఉండి, స్వామివారు తిరిగి వచ్చాక ఆహ్వానించిందని స్థల పురాణం తెలుపుతోంది. ఈ ఉత్సవం ఆషాఢ విదియ నుండి మూడు రోజుల పాటు జరుగుతుంది.

ఈ నెలలోనే గోదావరి, కావేరి నదులకు క్రొత్త వరద నీరు వచ్చి చేరుతుంది.

ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా, మహాఏకాదశిగా ఆచరిస్తారు. స్వాములు ఆచరించే చాతుర్మాస దీక్షలలో వచ్చే మొదటి ఏకాదశి ఇదే. అందువల్ల దీనిని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు.

శ్రీ మహావిష్ణువు ఈ ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదలు నాలుగు నెలలు బలి చక్రవర్తి చేసే పూజలందుకుని తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున తిరిగి వస్తారని, ఒక కథ ప్రచారంలో ఉన్నది. మరొక కథ ప్రకారం క్షీర సాగరంలో శ్రీ మహావిష్ణువు ఈ ఏకాదశి మొదలు నాలుగు నెలలు విశ్రాంతి తీసుకుంటారన్న మరో కథనం కూడా ప్రాచుర్యంలో ఉంది. అందుకే "శయనైకాదశి" అన్న పేరు కూడా ఈ ఏకాదశికి ఉంది.

బౌద్ధమతస్థులు కూడా ఈ ఆషాఢ మాసంలో, "వాసో" వృక్షం (ఇవి బర్మా, నేపాల్ ప్రాంతాలలో ఎక్కువగా ఉంటాయి. వీటి పువ్వులు పసుపు రంగులో ఉంటాయి) విరబూసే కాలం కాబట్టి, ఆ పువ్వులతో, బౌద్ధభిక్షువులను పూజిస్తారు. భిక్షువులు పంచశీల ధర్మలను బోధిస్తారు. బుద్ధుడు తల్లి వద్దకు చేరుకునే రోజులు ఈ ఆషాఢమాసం అని, ఆ బుద్ధుడు భూమిపైకి వచ్చే శుభప్రదమైన మాసం ఈ ఆషాఢ మాసం.

ఆషాఢ పౌర్ణమిని వ్యాసపౌర్ణమి లేదా గురుపౌర్ణమిగా ఆచరించే ఆచారం ప్రసిద్ధమై ఉన్నది. దీనినే గురుపౌర్ణమిగా, వ్యాసుల వారి జయంతిగా జరిపే ఆచారం ఉన్నది.

ఆది గురువుగా భావించే శ్రీకృష్ణుల వారి చరితమైన భాగవతాన్ని, భగవద్గీతను లోకానికి అందించిన బ్రహ్మవిద్యానిధి అయిన వ్యాసుల వారిని పూజించి గురువు, గురువు ఔన్నత్యాన్ని గౌరవించే పర్వదినమే ఈ గురుపూర్ణిమ.

కొన్ని ప్రాంతాలలో శివశయనోత్సవంగా, శైవులు ఆచరిస్తారు.

కృష్ణానదిలో భీమానది కలిసే పవిత్ర ప్రదేశం మహబూబ్‌నగర్ లోని కసుమర్తి గ్రామం. ఇక్కడ ఆషాఢపౌర్ణమి సందర్భంగా జాతర జరగడం ఆనవాయితి.

వసంత ఋతువుతో వచ్చిన కోకిల గ్రీష్మ ఋతువు చివరలో వలసపోతుంది కాబట్టి కోకిల వ్రతంగా తెలగపిండితో 'కోకిల' ప్రతిమను చేసి ఆరాధించే ఆచారం కొన్ని ప్రాంతాలలో కలదు. ద్రుపదుని భార్య పేరు కూడా కోకిలాదేవి. ఈ విధంగా ఆమెను స్మరించే పద్ధతి మరికొన్ని ప్రాంతాలలో ఉన్నది.

ఆషాఢ అమావాస్యను కర్కాటక సంక్రమణంగా ఆచరించి పితృదేవతలకు పూజలు చేస్తారు. పితృ దేవతలు తరించే పుణ్య కాలంగా ఈ సంక్రమణాన్ని ఆచరిస్తారు.

– సాధన నరసింహాచార్య

**అంకితభావంతో పనిచేయడం వల్ల మానవ సంబంధాలు వృద్ధి చెందుతాయి.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## తూములూరులో

108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం 2012 మే 31 మరియు జూన్ 1వ తేదిన తూములూరు గ్రామం, కొల్లిపర (మం॥), గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో జరిగింది.

మే 31వ తేది సాయంత్రం 5 నుండి కలశయాత్ర ప్రారంభమై రాత్రి 7 గంటలకు కోలాటంతో ముగిసినది. దాదాపు 200 మంది మహిళలు కలశయాత్రలో పాల్గొన్నారు. తదుపరి 1008 దీపాలతో స్వస్తిక్, ఓంకారం, కాగడ మరియు శివలింగ ఆకృతులతో దీపాలను వెలిగించి దీపయజ్ఞాన్ని నిర్వహించారు. దీనిలో దాదాపు 400 మంది మహిళలు పాల్గొన్నారు. శ్రీ అశ్విని సుబ్బారావు, డా॥ శ్రీరామ్ మరియు పూల్‌సింగ్ గార్లు కార్యక్రమాన్ని నిర్వహించారు.

జూన్ 1వ తేదీన ఉదయం 9 గంటలకు 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ప్రారంభమైనది. డా॥ శ్రీరామ్, పూల్ సింగ్‌లు యజ్ఞ క్రతువును ప్రారంభించారు. తదుపరి శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రవచనాన్ని అందించి, సర్వులను ఉత్తేజితుల గావించారు. విద్యారంభ సంస్కారాలు, మంత్రదీక్ష సంస్కారాలు శ్రీ అశ్వినిసుబ్బారావుగారి నేతృత్వంలో నిర్వహించారు. ఈ ఉత్సాహపూరిత వాతావరణంలో రూ.9000/- గురుదేవుల సాహిత్యం విక్రయించబడింది. సత్తెనపల్లి వాస్తవ్యులు శ్రీ టి.ఎస్.అంకారావు కార్యక్రమ విజయానికి సహకరించారు.

చుట్టుప్రక్కల గ్రామస్తులు యజ్ఞ కార్యక్రమానికి సంపూర్ణ సహకారాన్ని అందించారు.

## ఘంటావారిపాలెంలో

2012 జూన్ 2 మరియు 3 తేదీలలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము గుంటూరు జిల్లా ఘంటావారిపాలెంలో నిర్వహించారు. 2వ తేది కలశయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించిరి. సుశిక్షితులైన అడవిపాలెం గ్రామ కోలాట బృందం వారి కళానైపుణ్యంతో గ్రామస్తులకు చక్కని వినోదాన్ని, భక్తిని అందించారు. కలశయాత్ర దాదాపు గంటన్నర సమయం ఘంటావారిపాలెం గ్రామ వీధులలో సాగింది. అటుపిమ్మట శ్రీ అశ్విని సుబ్బారావుగారి ప్రవచనం కొనసాగినది. శ్రీ పేరిశాస్త్రి దాదాపు 300 మంది నారీమణులతో దీపయజ్ఞాన్ని నిర్వహించారు.

3వ తేది ఉదయం 9 గంటలకు 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ప్రారంభమైనది. శ్రీ పేరిశాస్త్రి మరియు శ్రీ పూల్‌సింగ్ యజ్ఞాన్ని నిర్వహించారు. గాయత్రీ పరివార్ దక్షిణ భారత సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావుగారు గురుదేవుల విరచితమైన ప్రజ్ఞాపురాణం గురించి మరియు గురుదేవుల గురించి, వ్యక్తి నిర్మాణము, కుటుంబ నిర్మాణం మరియు సమాజ నిర్మాణాలపై ప్రవచించి అందరికి మార్గదర్శనం గావించారు. శ్రీ అశ్విని సుబ్బారావు మరియు శ్రీ పేరిశాస్త్రిగార్ల ప్రేరణతో రూ.11,000/- గురుదేవుల సాహిత్యం ఇచ్చట విక్రయించబడింది.

**గాయత్రీ సేవా సమితుల ఆవిర్భావముపై నివేదిక :**

ఆదర్శ గ్రామాల రూపొందించుటలో భాగంగా 1) కొత్తపాలెం గ్రామం, పర్చూరు (మం॥), ప్రకాశం జిల్లా 2) తూములూరు గ్రామం, కొల్లిపర (మం॥), గుంటూరు జిల్లా 3) లక్ష్మీపురం గ్రామం, కాకాని శివారు గ్రామ పంచాయితి, నర్సరావుపేట రూరల్ (మం॥), గుంటూరు జిల్లాలో గాయత్రీ సేవా సమితులను గాయత్రీ పరివార్ వారి ప్రేరణతో ఏర్పాటు చేయుట జరిగినది.

1) తొలుత ముప్పరి సభ్యులతో గ్రామాభివృద్ధి సమితిని ఆవిష్కరించడమైనది. 2) మూడు చోట్ల శ్రీ అశ్విని సుబ్బారావుగారు తమ వంతు గ్రామాభివృద్ధికి అంశదానంగా రూ.5,000/- నగదును అందించారు.

వీరి ప్రేరణతో కొత్తపాలెంలో రూ. 16,032/-, తూములూరులో రూ. 33,102/- మరియు లక్ష్మీపురంలో రూ.17,000/- మూలధనంగా అంశదానం రూపంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేయడమైనది.

**ఈ క్రింది కార్యక్రమాలను తొలిదశలో చేపట్టుటకు నిర్ణయించడమైనది.**

1. వృక్షాలు నాటుట - గ్రామం యొక్క అన్ని వీధులలో
2. వైద్య సదుపాయముల ఏర్పాటు : హోమియో మరియు ఆయుర్వేద వైద్య సదుపాయముల ఏర్పాటు చేసి గ్రామీణులకు నాణ్యమైన, నమ్మకమైన, నిరపాయకరమైన అత్యంత, స్వల్ప ఖర్చుతో వైద్య సదుపాయములను అందించుట.
3. వయోజన విద్య : గ్రామములో చదువురాని వారందరికి ఉచితంగా విద్యను నేర్పించుట. బాలసంస్కార కేంద్రాన్ని స్థాపించుట, బాల పురోహితులను ప్రోత్సహించుట.

హేతుబద్ధ విశ్వాసం అవసరం.

4. గోశాలల ఏర్పాటు : గో ఆధారిత వ్యవసాయ పద్ధతిని ప్రోత్సహిస్తూ, రసాయనిక ఎరువులు మరియు పురుగు మందుల వాడకాన్ని పూర్తిగా తొలగించి వేయుట.

5. వ్యవన విముక్తి : ఈ ఉద్యమాన్ని చేపట్టి గ్రామములో పొగ త్రాగుట, మద్యసేవనాన్ని, జూదం మున్నగు వ్యసనాలను రూపుమాపుట.

6. నారీ జాగరణ : నారీ జాగరణ కార్యక్రమాల చేపట్టి మహిళా మండలులను స్థాపించి, కుటుంబ నిర్మాణానికి మరియు సమాజ నిర్మాణాలకు చేయూతను అందించుట.

7. త్రాగునీటి వసతి - గ్రామాల పారిశుద్ధత : గ్రామములో రక్షిత మంచి నీటి పథకాలకు తగిన ప్రోత్సాహాన్ని అందించి, గ్రామపారిశుద్ధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి పెద్ద ఎత్తున చేపట్టుట.

8. కుటీర పరిశ్రమల ఏర్పాటు : గ్రామాల స్వావలంబన దిశగా తగిన కుటీర పరిశ్రమల ఏర్పాటు చేయుట.

పైన ఉదహరించిన రీతిలో గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్ గాయత్రీ సేవా సమితుల ద్వారా గ్రామీణుల సహాయ సహకారములతో గ్రామ అవసరాలను తీర్చే దిశగా తగిన పథకాలను రూపొందించి, తగిన మార్గదర్శనాన్ని అందించాలని, వానిని 2012-13 సంవత్సరాని కల్లా పూర్తిచేయాలని సంకల్పించింది.

## ఒంగోలులో

గాయత్రీ జయంతి ఉత్సవములు మూడు రోజులు ఒంగోలులోని గాయత్రీ గోశాల ప్రజ్ఞా మండలిలో శ్రీ మలసాని వెంకటేశ్వర్లుగారి నేతృత్వంలో నిర్వహించబడినాయి. 29.05.2012న దీపయజ్ఞం, 30.05.2012న కలశయాత్ర వైభవంగా నిర్వహించబడింది. 31.05.2012న నవ కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడినది. దీనిలో 180 మంది పాల్గొన్నారు.

## ఖమ్మంలో

29.04.2012 ఖమ్మం జిల్లాలోని కుసుమంచి గ్రామంలో నవ కుండముల గాయత్రీ యజ్ఞమును శ్రీ దండ్యాల లక్ష్మణరావు గారి ఆధ్వర్యంలో శ్రీ డి.వి.ఆర్. మూర్తి, శ్రీ సత్యన్నారాయణ గార్లు నిర్వహించిన ఈ కార్యక్రమమునకు శ్రీయుతులు చౌదరి, ప్రసాద్, నూతక్కి పద్మ, వెంకయ్యగారు సహకారం అందించారు. ఈ యజ్ఞ కార్యక్రమంలో సుమారు 200 మంది పరిజనులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

## నెల్లూరులో

2012 ఏప్రిల్ 15,18,22,29 తేదీలలో గాయత్రీ యజ్ఞములను నెల్లూరు గాయత్రీ పరివార్ కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీ రమణమూర్తి మాష్టారు నిర్వహించారు. ముకుందాపురంలో 20,27 తేదీలలో దీపయజ్ఞములు నిర్వహించబడినవి. శ్రీ తిరునారాయణగారు గాయత్రీ పరివార్ జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. అట్లే వారి నేతృత్వంలో కార్యకర్తలలో నూతన ఉత్సాహం ఇనుమడించి సమైక్యంగా పనిచేయుట గమనార్హము.

## హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో

దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీరామకీర్తన ప్రజ్ఞామండలిలో గాయత్రీ జయంతి సంబరాలు ఉదయం 7 గం॥ల నుండే ప్రారంభమైనాయి. సుమారు పాతిక మంది పరిజనులు గాయత్రీ హవనంలో 108 ఆహుతులను సమర్పించారు. అనంతరం పరమ పూజ్య గురుదేవుల 108 నామాలు శ్రద్ధగా పఠించాక పరిజనులతో పాటు విద్యార్థులు కూడా ఎంతో స్ఫూర్తితో 108సార్లు గాయత్రి చాలీసా పారాయణ చేసారు. ఆ తరువాత పరిజనులు అందరు యజ్ఞశాల ప్రాంగణంలో తులసి మొక్కలు నాటి భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. అదే రోజు సూర్యప్రకాశ్ దంపతులు తమ 35వ వివాహదిన వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఎంతో కృషి చేస్తూ సంవత్సర కాలంలో సుమారు యాభై మందికి పైగా యుగశక్తి గాయత్రి మాస పత్రికను పరిచయం చేశారు. నిత్యం గురువుగారి సాహిత్యాన్ని కొత్తవారికి అందించే ప్రయత్నం చేసే శ్రీ వెంకట్‌రావు దంపతులు కూడా తమ 50వ వివాహదిన సంస్కారాన్ని ప్రజ్ఞాపీఠంలో జరుపుకున్నారు.

## జగిత్యాలలో

2012 మే నెలలో గాయత్రీ పరివార్ జగిత్యాల, కరీంనగర్ జిల్లా శాఖ ఈ క్రింది కార్యక్రమాల నిర్వహించారు. 22.05.2012 న ధర్మపురి మండలంలోని దోనూర్ గ్రామములోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో పంచకుండీ యజ్ఞము నిర్వహించగా 600 మంది పాల్గొన్నారు. అట్లే 31.05.2012న గాయత్రీ జయంతి సందర్భంగా లచ్చక్కపేట గ్రామం, సారంగాపురం మండలంలోని శివాలయంలో మరో పంచకుండీ యజ్ఞాన్ని నిర్వహించారు. దీనిలో 400 మంది పాల్గొన్నారు. అదేరోజు జగిత్యాల పట్టణంలో స్వర్ణకార సంఘ భవనంలో మరో పంచకుండీ యజ్ఞాన్ని నిర్వహించారు.

పై కార్యక్రమాలన్నింటిని శ్రీ ఆడెపు గంగారామ్, శ్రీ రాంరెడ్డి, శ్రీ అశోక్‌గుప్తా, గడ్డం బుచ్చిరెడ్డి గార్ల సారథ్య సహకారాలతో జరిగాయి. చిట్యాల భూంరెడ్డి, మహేష్, తిరుపతి, రమేష్, రాజన్న, సత్యన్నారాయణ, దక్షిణామూర్తి మున్నగు పెద్దలు సహకరించారు.

**పిల్లల భద్రతా రాహిత్యాన్ని తల్లితండ్రులు పోగొట్టాలి.**

## వరంగల్లులో

గాయత్రీ జయంతి సందర్భముగా 31.05.2012 గురువారమునాడు వరంగల్లులో 9 కుండముల గాయత్రీ యజ్ఞము శ్రీ అమ్మిరాజు రాధాకృష్ణమూర్తి, శ్రీ సావిత్రి, బాలా త్రిపురసుందరి నిర్వహించారు. సుమారు 400 మంది పాల్గొన్న ఈ యజ్ఞంలో డా॥యం.వెంకటేశ్వర్లుగారు ప్రవచనము ఇచ్చారు. ఈ యజ్ఞ కార్యక్రమానికి శ్రీ గార్లపాటి వెంకటేశ్వర్లు సహాయ సహకారాలు అందించారు.

## ఆహ్వానము

పూజ్యులు, పరమపూజ్య గురుదేవుల, పరమ వందనీయ మాతాజీల మానస పుత్రులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి సారథ్యంలో నిర్వహింపబడుచున్న 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞానికి అందరికీ ఆహ్వానము.

**వేదిక:** సరస్వతి శిశు మందిరము, మెయిన్‌రోడ్, సత్తెనపల్లి పట్టణం, గుంటూరు జిల్లా.

**కార్యక్రమ వివరాలు :**

21.07.2012 – శనివారము సా॥ 4 గం॥లకు కలశయాత్ర సా॥ గం॥ 5.30 ని॥లకు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి ప్రవచనం తదుపరి దీపయజ్ఞం – తీర్థప్రసాద వితరణ.

22.07.2012 – ఆదివారము ఉ॥ 9 గం॥లకు 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞము – తీర్థప్రసాద వితరణ.

యజ్ఞ కార్యక్రమంలో డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి ప్రవచనము, శ్రీ అశ్విని సుబ్బారావు, గాయత్రి పరివార్ దక్షిణ భారత సంచాలకులు గారి ప్రవచనములు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. జాతి, మత, కుల, లింగ భేదం లేకుండా అందరూ ఆహ్వానితులే.

ఇట్లు

**టి.ఎస్.అంకారావు మరియు గాయత్రీ పరివార్**

సత్తెనపల్లి శాఖ, గుంటూరు జిల్లా

**సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:**

**సెల్ : 9866156572 / 9246466220**

## ఆహ్వానము

## గాయత్రీ పరివార్ సమ్మేళనం

2012 జులై 8వ తేది గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలోని గాయత్రి పరివార్ సభ్యుల మరియు కార్యకర్తల సమ్మేళనము జరుప నిశ్చయించడమైనది.

**సమ్మేళన స్థలం:** రాజస్థాన్ సాంస్కృతిక మండలి హాలు, కనకదుర్గా నర్సింగ్ హోమ్ దగ్గర, జిల్లా పరిషత్ జంక్షన్, విశాఖపట్నం.

**సమ్మేళనం:** 07.07.2012న ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥3.30 గం॥ల వరకు

08.07.2012న ఉ॥ 9.00 గం॥లకు 54 కుండముల గాయత్రి మహాయజ్ఞము

**సమావేశ అజెండా :**

1) విశ్వ గాయత్రీ పరివార్ లక్ష్యానికి అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను 5 జిల్లాలకు తయారు చేసుకొనుట – తద్వారా గ్రామాలకు సైతం విస్తరించుట.
2) గాయత్రీ పరివార్ సభ్యులు మరియు కార్యకర్తల మధ్య పటిష్టమైన సహాయ సహకారముల పెంపొందించు కొనుట.
3) పుస్తక ప్రదర్శన విక్రయశాలలను విస్తృతంగా ఏర్పాటు చేయుట. తద్వారా గురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికి చేర్చుట.
4) యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారుల సంఖ్యను 2013 మార్చి నాటికి 1,25,000కు చేర్చుట.
5) కార్యకర్తల అనుభవాలను, సూచనలను పంచుకొనుట.

కావున పై జిల్లాలలోని యావన్మంది కార్యకర్తలు వారి రాకను తెలియజేయుచూ ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించ ప్రార్థన. దూర ప్రాంత సభ్యులు 06.07.2012 సాయంత్రానికి సమావేశస్థలికి చేరుకొన ప్రార్థన.

**ఫోన్: 9490132923 / 8985183698**

ఇట్లు

**సమావేశ అనుసంధాన కమిటి**

వైజాగ్ సెంటర్, గాయత్రీ పరివార్ ట్రస్ట్

**తమ పట్ల తమకు నమ్మకం లేకపోవడమే నిరాశావాదం.**